ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 29.06.2024 | సంపుటి : 10 సంచిక : 350 | పేజీలు : 12 వెల: రూ. 4/-

RNI NO.APTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# నీట్‌పై అట్టుడికిన లోక్‌సభ

## చర్చకు ఇండియా కూటమి పట్టు

- వాయిదాలతో మొదలైన సభ
- చర్చ కోరుతూ వాయిదా తీర్మానం ఇచ్చిన కాంగ్రెస్ సభ్యులు
- తిరస్కరించిన స్పీకర్ ఓంబిర్లా..
- నిరసనల మధ్య జులై 1కి వాయిదా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** లోక్‌సభ సమావేశాలు వాయిదాలతో మొదలయ్యాయి. నీట్‌పేపర్ లీక్‌పై చర్చించాలన్న విపక్షాల డిమాండ్ కారణంగా గందరగోళం మధ్య లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. సాధారణ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కాగానే నీట్ పేపర్ లీకేజీపై చర్చకు విపక్షనేత రాహుల్ గాంధీ వాయిదా తీర్మానం ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్‌పై చర్చించాల్సి ఉందని, వారికి పార్లమెంట్ భరోసా ఇవ్వాల్సి ఉందని అన్నారు. అయితే నిబంధనల మేరకు రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ



మిగతా 2లో..

## లీకేజీల నీట్ మాకొద్దు

### రద్దు కోరుతూ తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

**చెన్నై(జనంసాక్షి):** వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష నీట్ పేపర్ లీక్‌పై దేశ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం పార్లమెంట్‌ను ఈ అంశం కుదిపేసింది. ఈ నేపథ్యంలో నీట్ రద్దు చేయాలంటూ తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. నీట్‌ను రద్దు చేయాలని, నీట్ అమలుకు ముందు మాదిరిగా 12వ తరగతి మార్కుల ఆధారంగా

మిగతా 10లో..

# రుణమాఫీపై మార్గదర్శకాలు విడుదల చేస్తాం



## పాస్‌బుక్కే కీలకం • వివరాలు నాలుగు రోజుల్లో ప్రకటిస్తాం

- రేషన్‌కార్డు ఆధారంగా మాఫీ ఉండదు • బంగారం తాకట్టు రుణాలకు మాఫీ వర్తించదు
- రుణమాఫీ తరవాత రైతుబంధుపై దృష్టి • అప్పులు తగ్గించుకునే పనిలో ఉన్నాం
- వాస్తవాలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన • ధరణి, మండలాలు, జిల్లాలపై అసెంబ్లీలో చర్చ
- ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగి.. ఆదాయం పెరిగింది • కేసీఆర్ చేసిన తప్పులు మేం చేయబోం
- చేరికలు అంతటా జరుగుతూనే ఉన్నాయి • కులగణన చేపట్టి తీరుతాం
- ఢిల్లీలో మీడియాలో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

## అధిష్టాన నిర్ణయమే ఫైనల్

### మంత్రివర్గ విస్తరణ,పీసీసీచీఫ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీకి రేవంత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆగస్టు-15 లోగా ఈ హామీని నెరవేరుస్తానని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మాటిచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ప్రక్రియ కూడా దాదాపు మొదలైంది. ఢిల్లీ పర్యటనలో బిజిబిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ ప్రస్తావన వచ్చింది. దీనిపై మాట్లాడిన సీఎం.. రుణమాఫీపై నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. పంట రుణాల మాఫీకి రేషన్



కార్డు ప్రామాణికం కాదని.. అది కుటుంబాన్ని గుర్తించడం కోసం మాత్రమేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రూ. 2 లక్షల వరకు మాత్రమే రుణమాఫీ ఉంటుందని.. మరోసారి స్పష్టం చేశారు. బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలు మాఫీ కావని కూడా సీఎం చెప్పేశారు. పాస్ బుక్ ఆధారంగానే రుణ మాఫీ ఉంటుందని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఈ క్రమంలో రుణమాఫీకి నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకు రేషన్ కార్డు ప్రామాణికం కాదని స్పష్టం చేశారు. రైతు రుణమాఫీ తర్వాత రైతు బంధు ఇతర పథకాలపై దృష్టి

మిగతా 2లో..

### భారత్‌లో మతస్వేచ్ఛపై

# అమెరికా ఆందోళన

## మైనారిటీలపై దాడులు తగవు

- భారత్‌లో తీసుకొస్తున్న మాతమార్పిడి నిషేధ చట్టాలు మరింత విద్వేషాలు కలిగిస్తాయి
- వ్యాఖ్యలను ఖండించిన భారత్



**వాషింగ్టన్(జనంసాక్షి):**భారత్‌లో తీసుకొస్తున్న మత మార్పిడి నిషేధ చట్టాలు, విద్వేష వ్యాఖ్యలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని అమెరికా వ్యాఖ్యానించింది. మైనారిటీలకు సంబంధించిన ఇళ్లను, ప్రార్థనా స్థలాలను కూల్చివేయడమూ ఇబ్బందికరమేనని అభిప్రాయపడింది. అంతర్జాతీయ మత స్వేచ్ఛపై బుధవారం నివేదిక విడుదల చేసిన సందర్భంగా అమెరికా విదేశాంగశాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా మత స్వేచ్ఛ కోసం పలువురు పని చేస్తున్నారని తెలిపారు.'భారత్‌లోని 28 రాష్ట్రాల్లో 10 రాష్ట్రాలు మత మార్పిడి నిషేధిస్తూ చట్టాలు చేశాయి. ఇందులో కొన్ని బలవంతపు మత మార్పిడికి పాల్పడితే భారీ జరిమానాలను విధిస్తున్నాయి. దీనిపై అమెరికా అధికారులు ఎప్పటికప్పుడు భారత్ అధికారులతో మాట్లాడి ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు' అని అంతర్జాతీయ మత స్వేచ్ఛపై విడుదల చేసిన 2023 నివేదిక పేర్కొంది.తమ దేశంలో జరిగిన ఖలిస్థాన్ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్ను హత్య కేసులో భారత్ దర్యాప్తు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నామని అమెరికా పేర్కొంది. ఈ హత్యలో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తా ప్రమేయముందని అమెరికా అధికారులు గత నవంబరులో అభియోగాలు మోపారు. గత ఏడాది

మిగతా 2లో..



## బీఆర్ఎస్‌కు మరో షాక్

### కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

### కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి

### అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరారని వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత రాష్ట్ర సమితి (భారాస)కు మరో షాక్ తగిలింది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. దిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తెలంగాణ మాజీ స్పీకర్, భారాస బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. దీంతో యాదయ్యతో కలిపి ఇప్పటివరకు ఆరుగురు భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ క్రమంలో తాజాగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్‌లో చేరారు. ఢిల్లీలో

మిగతా 2లో..

### హేమంత్ సోరెన్‌కు

## ఊరట

### బెయిల్ మంజూరు

#### తప్పుడు కేసుల్లో ఇరికించారని మాజీ సీఎం విమర్శలు

**రాంచి(జనంసాక్షి):**జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కి భారీ ఊరట లభించింది. ల్యాండ్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన హేమంత్‌కు ఝార్ఖండ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ ఏడాది

మిగతా 2లో..



# పోయేవాళ్లు పోతేపోని..



## కేసీఆర్ నిట్టూర్పు

**హైదరాబాద్(జనంసాక్షి):** పార్టీని వీడి దొంగల్లో కలిసిన వారి గురించి బాధలేదని.. అంతకన్నా మెరుగైన, మెరకల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తుందని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు.ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల నుంచి వచ్చిన నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పార్టీని వీడిన నేపథ్యంలో కీలక వ్యాఖ్యలు చేశారు."భారాస శ్రేణులకు ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఒక లెక్కే కాదు. పార్టీ నుంచి వెళ్తోన్న నాయకుల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. ఒకరు పోతే 10 మంది నాయకుల్ని పార్టీ తీర్చిదిద్దుకుంటుంది. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ సమస్యలను లోతుగా పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా భారాసకే ఉంది. రెట్టించిన

మిగతా 2లో..

### షాద్‌నగర్ పరిశ్రమలో

# ఘోర ప్రమాదం

### ఫ్యాక్టరీలో పేలిన కంప్రెషర్ • ఆరుగురి దుర్మరణం

### పలువురికి తీవ్రగాయాలు • ఎగిసిపడ్డ మాంసపు ముద్దలు



**షాద్‌నగర్(జనంసాక్షి):**రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్‌లో పెను విషాదం చోటు చేసుకుంది. స్థానిక సౌత్ గ్లాసు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కంప్రెషర్ పేలడంతో ఆరుగురు మృతి చెందారు. పేలుడు ధాటికి కార్మికుల మృతదేహాలు ఛిన్నాభిన్నమయ్యాయి. మంటలు చెలరేగడంలో మరికొంత మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. ఒకేసారి కంప్రెషర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. క్షతగాత్రులను

మిగతా 10 లో..

### కమిషన్‌పై

## పిటిషన్

#### తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

**హైదరాబాద్(జనంసాక్షి):** హైకోర్టులో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. విద్యుత్ కమిషన్ ఏర్పాటు జీవోను కొట్టివేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. కేసీఆర్ పిటిషన్‌కు విచారణ

మిగతా 2లో..



# ముందుంది మంచికాలం

- రానున్న మూడు రాష్ట్రాల ఎన్నికల్లో విజయం మనదే..
- భేషజాలు వీడి అందరూ ఐక్యంగా పోరాడాలి
- కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు రాహుల్ గాంధీ దిశానిర్దేశం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**త్వరలో జరగనున్న మూడు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాహుల్ గాంధీ హస్తం పార్టీ శ్రేణులు, నేతలకు కీలక సూచనలు చేసినట్లు పార్టీ వర్గాల సమాచారం. పార్టీకి నష్టం కలిగించే ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేయవద్దని సూచించినట్లు తెలుస్తోంది. త్వరలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని వృథా చేసుకోవద్దని గట్టిగా చెప్పినట్లు

మిగతా 2లో..

### తెలంగాణకు జాతీయ రహదారుల

# హైలెవల్ కమిటీ

- వచ్చేవారం పర్యటించే అవకాశం
- వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** వచ్చే వారంలో జాతీయ రహదారుల హైలెవల్ కమిటీ, రాష్ట్ర పర్యటనకు వస్తుందని రోడ్లు

మిగతా 2లో..



# ఆద్యంతం ఆసక్తిగా..

### అమెరికా అధ్యక్ష అభ్యర్థుల చర్చ

### బైడెన్ తడబాటు .. ట్రంప్ దూకుడు

**వాషింగ్టన్(జనంసాక్షి):** అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లు ప్రత్యక్ష చర్చ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. 2020 అధ్యక్ష ఎన్నికల గందరగోళం తర్వాత వీరిద్దరూ తొలిసారి ముఖాముఖి తలపడ్డారు.అట్లాంటాలోని సీఎన్ఎన్ ప్రధాన కార్యాలయంలో భారత


మిగతా 2లో..



# ఢిల్లీ జలమయం

### దేశరాజధానిని ముంచెత్తిన భారీ వర్షాలు • విమానాశ్రయంలో కూలిన టెర్మినల్ కప్పు

### ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు • పలు కార్లు ధ్వంసం...సహాయక చర్యలు ముమ్మరం





**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఇందిరాగాంధీ విమానాశ్రయం లోని టెర్మినల్ 1లో కొంత పైకప్పు భాగం కూప్పకూలింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. 8 మంది గాయపడ్డారు. వెంటనే సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంలో పైకప్పు కింది పార్క్ చేసిన అనేక వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. పైకప్పు కూలడంతో కారులోని వ్యక్తి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా పలు విమనాలు రద్దు చేశారు.. కాగా..ఈ ఘటనపై కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఢిల్లీ విమానాశ్రయంలో వ్యక్తిగతంగా తాను పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. క్షతగాత్రులకు చికిత్స కొనసాగుతోందని అని ట్వీట్ చేశారు. టెర్మినల్-1 దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం 2 వరకు టెర్మినల్-1 నుంచి డిపార్చర్‌కు బ్రేక్ ఇచ్చారు. పునరుద్ధరణ పనుల అనంతరం సర్వీసులను కొనసాగించనున్నారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎయిర్ పోర్టుకు చేరుకుని.. టెర్మినల్ రూఫ్ పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు.. దీంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని

మిగతా 2లో..



# పివికి ఘన నివాళి అర్పించిన సీఎం రేవంత్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పి.వి. చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావుకు దక్కుతుందని రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధానమంత్రిగా పి.వి. చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి పి.వి. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇదిలావుంటే పీవీ స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం పనిచేస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పీవీ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లురవి, గడ్డం వంశీకృష్ణ, జైవీర్ రెడ్డి, చామల కిరణ్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ వంశీకృష్ణ.. దేశ అభ్యున్నతికి పీవీ సంస్కరణలు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. పీవీ నరసింహారావు కేబినెట్ లో కాకా కేంద్రమంత్రిగా దేశాభివృద్ధిలో భాగం అయ్యారని తెలిపారు.

# బీఆర్ఎస్‌కు మరో షాక్

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. సీఎం రేవంత్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. దీంతో అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 71కి చేరుకుంది. కాగా ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెల్లం వెంకట్రావ్, సంజయ్ కుమార్, దానం నాగేందర్ కాంగ్రెస్ లో చేరారు.కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎంపీపీ, జెడ్పీటీసీగా పని చేసి, 2009లో చేవెళ్ల నియోజకవర్గం నుండి పోటీచేసి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కోరాని సాయన్న రత్నం చేతిలో ఓడిపోయాడు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి కోరాని సాయన్న రత్నంపై 781 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీలో చేరాడు. 2018లో జరిగిన తెలంగాణ ముందస్తు ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి 33 వేల 552 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో గెలిచారు.

**అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా**

తనకు రాజకీయాలకన్నా నియోజకవర్గ అభివృద్ధి ముఖ్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. అధికార పార్టీలో ఉంటే నిధులు తెచ్చుకుని అభివృద్ధి చేసుకోవచ్చన్న ఆలోచనతోనే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. అధికారంలో ఉంటే వెసులబాటు తెలియంది కాదన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తెలంగాణ మాజీ స్పీకర్, భారాస బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. దీంతో యాదయ్యతో కలిపి ఇప్పటివరకు ఆరుగురు భారాస ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు.అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయాక, పార్లమెంట్ ఎన్నికల్లో పరువు నిలబెట్టుకుందామనుకున్న బీఆర్ఎస్‌కు అడుగడుగునా ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత గెలిచిన ఎమ్మెల్యేలను నిలబెట్టుకోలేకపోవడం.. లోక్‌సభ ఎన్నికల ముందు సిట్టింగ్ ఎంపీలే జంప్ అవ్వడం, టికెట్ దక్కించుకున్న తర్వాత ఊహించని రీతిలో ఝలక్ ఇచ్చేసి కాంగ్రెస్‌లో చేరి పోటీ చేయడం గమనార్హం. ఈ షాక్‌ల నుంచి తేరుకోకముందే వరుసగా నలుగురు ఎమ్మెల్యేలు ఈ మధ్య కాలంలోనే బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పేయడంతో కారు పార్టీ కంగుతిన్నది. ఇలా ఒక్కొక్కరుగా 'కారు' దిగుతుండగా.. తాజాగా చేవెళ్ల నుంచి వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన కాలె యాదయ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఢిల్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి, టి. కాంగ్రెస్ ఇంచార్జ్ దీపా దాస్ మున్షీల సమక్షంలో ఈ చేరిక జరిగింది. కాంగ్రెస్ కండువా కప్పిన రేవంత్.. యాదయ్యను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మరోవైపు.. త్వరలో మరికొన్ని చేరికలు ఉంటాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కాలె యాదయ్య.. కాంగ్రెస్ పార్టీతోనే తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎంపీపీ, జడ్పీటీసీగా పనిచేసిన ఆయన.. తొలిసారి 2009 ఎన్నికల్లో ఎస్సీ రిజర్వ్ స్థానమైన చేవెళ్ల నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. టీడీపీ తరఫున పోటీచేసిన కోరాని సాయన్న రత్నం గెలిచి.. ఆ తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. 2014 ఎన్నికల్లో పార్టీ మారిన ఇదే ప్రత్యర్థిపైనే.. యాదయ్య పోటీచేసి 781 ఓట్ల మెజార్టీతో తొలిసారి గెలుపొందారు. టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో కొద్దిరోజుల్లోనే గులాబీ కండువా కప్పేసుకున్నారు. ఇక 2018 ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తరఫున పోటీచేసి 33,552 మెజార్టీతో గెలిచారు. 2023 ఎన్నికల్లో మాత్రం ప్రత్యర్థి పామేని భీమ్ భరత్ కాంగ్రెస్ నుంచి పోటీచేయగా.. సాయన్న బీజేపీ నుంచి పోటీచేశారు. అయినా సరే ఈ ఇద్దర్నీ ఓడించి అతి తక్కువ 268 ఓట్ల మెజార్టీతో గట్టెక్కారు. దీంతో వరుసగా గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యే అయ్యారు యాదయ్య. ఈయన రాకతో కాంగ్రెస్ శ్రేణులు, నేతలు హ్యాపీగా ఫీలవుతున్నారు. ఈ చేరికపై ఈయన ప్రత్యర్థి భీమ్ భరత్ మాత్రం ఇంతవరకూ ఎక్కడా స్పందించలేదు.

## తెలంగాణకు జాతీయ రహదారుల

# హైలెవల్ కమిటీ

భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని అంశాలతో అధికార యంత్రంగం సిద్ధంగా ఉండాలని ఆ శాఖ అధికారులకి ఆయన స్పష్టం చేశారు. మన్నెగూడ రహదారికి మార్గం సుగమం చేసేందుకు, ఎన్జీటీ ఆదేశానుసారం 915 చెట్లను రీలోకేట్ చెయ్యాలని అధికారులకు సూచించారు. ఎల్బీనగర్– మల్కాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. రహదారి విస్తరణ పనులకి అడ్డుగా ఉన్న వాటర్ లేన్, ట్రాన్స్– కో సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడానని ఆయన తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించాలని, ఎక్కడ అలసత్వం ఉండొద్దు అని అధికారులకి సూచించారు. న్యాక్?లో జాతీయ రహదారులపై రోడ్లు, భవనాల శాఖ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే వారంలో జాతీయ రహదారుల హైలెవల్ కమిటీ రాష్ట్రానికి వస్తుందని, అన్ని అంశాలతో అధికార యంత్రంగం సిద్ధంగా ఉండాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ అధికారులకి సూచించారు. మన్నెగూడ రహదారికి మార్గం సుగమం చేసేందుకు, ఎన్జీ?టీ ఆదేశానుసారం 915 చెట్లను రీలోకేట్ చెయ్యాలని ఆయన అధికారులకు సూచించారు.కాంట్రాక్టు సంస్థ 300 చెట్లను రీలోకేట్ చేసేందుకు సిద్ధంగా ఉందని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు.

# రుణమాఫీపై మార్గదర్శకాలు విడుదల చేస్తాం

పెడతామని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన రెండు రోజుల తర్వాత తెలంగాణ బడ్జెట్ సమావేశాలుంటాయన్నారు. తెలంగాణ బడ్జెట్ వాస్తవ అంచనాలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు చెప్పాం. అంచనాలకు మించి ఊహాజనిత లెక్కలతో బడ్జెట్ ఉండకూడని అధికారులను ఆదేశాలు ఇచ్చాం. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయంపై అసెంబ్లీలో చర్చించి కమిషన్ ఏర్పాటు చేస్తాం. కాళేశ్వరం సంబంధించిన వాస్తవాలను కూడా అసెంబ్లీ ముందుకు తెస్తాం. చర్చల తర్వాత డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక, నిపుణుల సూచన మేరకు ముందుకు వెళ్తాం అని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల రెవెన్యూ పెరిగింది. ఆర్టీసీకి ప్రతి నెలా రూ.350 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లిస్తోంది. 30శాతం నుంచి ఆక్యుపెన్సీ రేషియో 80 శాతానికి పెరిగింది. తద్వారా ఆర్టీసీకి నిర్వహణ నష్టాలు తగ్గాయి. గత అప్పులతో సంబంధం లేకుండా చుస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక లాభాలతో ఆర్టీసీ నడుస్తోంది. రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్నా సరే.. సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. బీసీ కమిషన్ పదవీకాలం ఆగస్టుతో పూర్తవుతుంది. కొత్త వారిని నియమించిన తరువాత కుల గణన చేస్తాం అన్నారు. రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. ప్రతి నెల రూ. 7వేల కోట్ల అప్పులు కడుతున్నాం. రాష్ట్రం విడిపోయి నప్పుడు నెలకు రూ. 6,500 కోట్లు కట్టేవారు. గత ప్రభుత్వం 7 నుంచి 11 శాతం వడ్డీతో రుణాలు తెచ్చారు. రుణభారం తగ్గేలా రుణాల వడ్డీని తగ్గించుకునే పనిలో ఉన్నాం. ఒక్కశాతం తగ్గినా రూ. 700 కోట్లు ఆదా అవుతాయి. ఈ మేరకు కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నాం. బడ్జెట్ కు ముందే రాష్ట్రానికి కావాల్సిన అంశాలను కేంద్రం దృష్టిలో ఉంచి ఎక్కువ నిధులు పొందే ప్రయత్నం చేస్తున్నాం. అన్ని శాఖలకు సంబంధించిన రాష్ట్ర మంత్రులు.. కేంద్రమంత్రులను ఇప్పటికే ఒకసారి కలిశారు అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన 'ధరణి'లో ఉన్న లోపాలు సరి చేసే పనిలో ఉన్నాము. ఆ తరవాత ఏ పేరు పెట్టినా నడుస్తుంది. కంప్యూటరైజ్ చేయాలా..? లేక మాన్యువల్ పద్ధతి పాటించాలా..? రెండే పద్ధతులు. ఏది చేయాలో అసెంబ్లీ ముందు పెట్టిన తర్వాతే నిర్ణయం ఉంటుంది. ఏ పాలసీ అయినా... ముందు అసెంబ్లీలో పెట్టి చర్చించిన తర్వాతే మార్పు చేర్పులతో తుది విధానం ప్రకటన చేస్తామని అన్నారు.. ఐఏఎస్, ఐపీఎస్‌ల పోస్టింగ్స్‌లో రూల్స్ బ్రేక్ చేయం. కేసీఆర్ చేసిన తప్పులను మేం చెయ్యం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో విద్యుత్ కోత లేదు పంపిణీలో అంతరాయాలు మాత్రమే ఉన్నాయి. మేము అధికారంలోకి వచ్చే సరికి ప్రతి సంవత్సరం జరిగే నిర్వహణ పనులు జరగడం వల్ల అంతరాయం ఏర్పడింది. బడ్జెట్ వ్యవహారంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు అనుసరించాల్సిన అవసరం లేదన్నారు. మహిళలకు ఉచిత రవాణా సదుపాయం వల్ల టెంపుల్ టూరిజం పెరిగింది. అక్కడ జీఎస్టీ కూడా పెరిగింది' అని రేవంత్ చెప్పుకొచ్చారు. 'రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్న సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. రైతు రుణమాఫీ తరువాత రైతు బంధు ఇతర పథకాల పై దృష్టి పెడతాం. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయం లో కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉచిత పథకాలను తప్పుపట్టడం సరికాదు. అవసరం ఉన్నవారికే సంక్షేమ పథకాలు అందాలి. మోదీ 10 ఏళ్లలో 16 లక్షల కోట్లు కార్పొరేట్లకు మాఫీ చేస్తే ఎవరు ప్రశ్నించరు..? కానీ మహిళలు, రైతులు, పేదలకు ఇస్తే మాత్రం తప్పుపడుతున్నారు' అని ఉదహరించి మరీ రేవంత్ మాట్లాడారు. ఈ సందర్భంగా.. మహిళలకు పీసీసీ ఇస్తే ఎలా ఉంటుందన్న ప్రశ్నకు మహిళలకు పీసీసీ ఇస్తే బానే ఉంటుందని సీఎం సమాధానం ఇచ్చారు. విలేకరుల సూచనలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పీసీసీ రేసులో ఎవరైనా ఉండొచ్చన్నారు. ఫిరాయింపుల తెలంగాణ ఒక్కటే ప్రత్యేకం కాదని.. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో ఎమ్మెల్యేలు ఫిరాయించారన్న విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన తప్పులు, తాము చేయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తకొత్త పీసీసీ చీఫ్ నియామకం, సామాజిక సమీకరణాలు దృష్టిలో ఉంచుకుని హై కమాండ్ డిసైడ్ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ బీ ఫామ్ మిద గెలిచిన వారికి మాత్రమే పదవులు వచ్చాయి. పీసీసీ చీఫ్‌గా రెండు ఎన్నికలు పూర్తి చేశా. జూలై 7 తో మూడేళ్లు పీసీసీ పూర్తి కానుంది. పీసీసీ , కేబినెట్ విస్తరణ నిర్ణయాలు ఒకే సారి ఫైనల్ అవుతాయని అన్నారు.

# పోయేవాళ్లు పోతేపోని..

ఉత్సాహంతో భవిష్యత్తులో ఇంకా బాగా ప్రజల కోసం పనిచేయాల్సి ఉంది. పదేళ్లపాటు అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేశాం. కొన్ని సార్లు ప్రజాస్వామ్యంలో అబద్ధపు ప్రచారాలు నమ్మి ప్రజలు బోల్తాపడుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో అదే జరిగింది. ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడొద్దు. అధికారం ఉంటేనే పనిచేస్తామంటే పద్ధతి కాదు. ఏ హోదాలో ఉన్నా ప్రజల కోసం పనిచేయాల్సిందే. అంతిమ లక్ష్యం తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి మాత్రమే. నాడు ఉద్యమంలోకి దిగినప్పుడు మనతో ఎవరు ఉన్నారు? నాడైనా, నేడైనా నాయకులను తయారు చేసుకునేది పార్టీనే" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. అంతకముందు.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో ప్రత్యేకంగా సమావేశమైన కేసీఆర్.. పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

## ఆద్యంతం ఆసక్తిగా..

కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం ఈ కార్యక్రమం జరిగింది. చర్చలో బైడెన్, ట్రంప్ ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించుకున్నారు. ఒకానొక దశలో సంయమనం కోల్పోయిన నేతలు వ్యక్తిగత విమర్శలకూ దిగారు. మాజీ అధ్యక్షుడు దూకుడు ప్రదర్శించగా.. బైడెన్ కొన్నిచోట్ల తడబడ్డట్లు కనిపించారు. బైడెన్‌ను ట్రంప్ ఫెయిల్యూర్‌గా అభివర్ణించారు. దీనికి ప్రతిగా ట్రంప్‌ను బైడెన్ దోషి అంటూ ఆరోపణలు గుప్పించారు. చర్చలో నిర్వాహకులు తప్ప మరెవరూ లేకపోవడం గమనార్హం. పైగా ఈసారి ఒకరు మాట్లాడుతుండగా.. మరొకరి మైక్‌లను కట్ చేశారు.చర్చలో ట్రంప్ పైచేయి సాధించినట్లు సీఎన్ఎన్ పోల్‌లో మెజారిటీ వీక్షకులు అభిప్రాయపడ్డారు. ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ సైతం బైడెన్ చర్చను నెమ్మదిగా ప్రారంభించినట్లు తెలిపారు. కానీ, చివరకు హుందాగా, దీటుగా ముగించారని పేర్కొన్నారు. మొత్తం చర్చలో ట్రంప్ 23 నిమిషాల ఆరు సెకన్లు మాట్లాడగా.. బైడెన్ 18 నిమిషాల 26 సెకన్లు తీసుకున్నారు. ట్రంప్ హయాంలో అనుసరించిన ఆర్థిక విధానాలపై విమర్శలు గుప్పిస్తూ బైడెన్ చర్చను ప్రారంభించారు. సంపన్నులకు అనుకూల వైఖరిని అవలంబించారని దుయ్యబట్టారు. దీంతో ఆర్థికవ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందన్నారు. ఉద్యోగ కల్పన పూర్తిగా క్షీణించిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశ ఆర్థికవ్యవస్థను గాడిన పెట్టాల్సిన బాధ్యతను ప్రజలు తనపై ఉంచినట్లు పేర్కొన్నారు.దీనికి బదులిస్తూ.. బైడెన్ హయాంలో కేవలం అక్రమ వలసదారులకు మాత్రమే ఉద్యోగాలు లభించాయని ట్రంప్ విమర్శిం చారు. ద్రవ్యోల్బణం చుక్కలు చూపిస్తోందన్నారు. ఆర్థిక వ్యవస్థ ఎప్పుడూ లేనంత దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటోందని విమర్శించారు.

# భారత్‌లో మతస్వేచ్ఛపై అమెరికా ఆందోళన

జూన్‌లో చెక్ రిపబ్లిక్‌లో నిఖిల్‌ను అరెస్టు చేసి అమెరికాకు తీసుకొచ్చారు. 'ఈ కేసులో విచారణ జరుపుతున్నామని భారత్ అధికారులు తెలిపారు. ఆ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాం' అని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి బుధవారం వాషింగ్టన్‌లో వ్యాఖ్యానించారు. ఇరు దేశాల సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత అత్యు త్తమంగా ఉన్నాయని, అవి మరింత విస్తృతమవుతున్నాయని భారత్‌లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ ఇంత దగ్గరగా రెండు దేశాలు లేవని, అమెరికాలో భారతీయులు 1.5 శాతం ఉన్నారని, వారు దేశ పన్నుల్లో 6శాతం చెల్లిస్తున్నారని తెలిపారు. అమెరికాలో భారతీయులు అత్యంత విజయవంతమైన వలస వర్గమని వ్యాఖ్యానించారు. భారత్ నుంచి భారీగా తరలివచ్చిన ప్రతినిధులతో ఆక్సన్ హిల్‌లో నిర్వహించిన సెలక్ట్ యూఎస్ఏ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. 'భారత్, అమెరికా సంబంధాలంటే కూడిక కాదు.. మల్టిప్లికేషన్. ఇది అమెరికా ప్లస్ ఇండియా కాదు. గుణింతం లాంటిది' అని గార్సెట్టీ పేర్కొన్నారు. అమెరికన్లకు మరిన్ని భారత్ బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.

**అమెరికా నివేదికను ఖండించిన భారత్**

భారత్‌లో తీసుకొస్తున్న మతమార్పిడి నిషేధ చట్టాలు, విద్వేష వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయంటూ అమెరికా (జూం) వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.'అంతర్జాతీయ మత స్వేచ్ఛ'పై ఈ మేరకు ఓ నివేదికను విడుదల చేసింది. అయితే.. దీన్ని తిరస్కరిస్తున్నట్లు భారత్ స్పష్టం చేసింది. ఆ నివేదిక తీవ్ర పక్షపాతంతో కూడిందని, ఓటు బ్యాంకు కోణంలో దీన్ని రూపొందించినట్లు కనిపిస్తోందని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు."గతంలో మాదిరే ఈ నివేదిక పక్షపాతంతో కూడి ఉంది. ఇందులో భారత సామాజిక పరిస్థితుల గురించి అవగాహన కొరవడింది. ఓటు బ్యాంకు లెక్కలు కనిపిస్తున్నాయి. అనేక అసంబద్ధ ఆరోపణలు, తప్పుడు వివరణలు, కొన్ని అంశాలనే ఎంచుకోవడం, పక్షపాత అంశాలపై ఆధారపడటం, ఒకే కోణాన్ని చూపించడం వంటివి పొందుపరిచారు" అని పేర్కొన్నారు. "భారత వ్యతిరేక కథనాన్ని చిత్రీకరించేందుకు కొన్ని ఘటనలనే ఆ నివేదిక ప్రస్తావించింది. చట్టాలు, నిబంధనల చెల్లుబాటునూ ప్రశ్నించింది. భారత న్యాయస్థానాలు ఇచ్చిన కొన్ని తీర్పుల విశ్వసనీయతను కూడా సవాలు చేసేలా కనిపిస్తోంది" అని జైస్వాల్ వ్యాఖ్యానించారు.అంతర్జాతీయ మత స్వేచ్ఛపై అమెరికా బుధవారం ఓ నివేదిక విడుదల చేసింది. 'భారత్‌లోని 28 రాష్ట్రాల్లో 10 రాష్ట్రాలు మత మార్పిడి నిషేధిస్తూ చట్టాలు చేశాయి. ఇందులో కొన్ని బలవంతపు మత మార్పిడికి పాల్పడితే భారీ జరిమానాలను విధిస్తున్నాయి. దీనిపై అమెరికా అధికారులు ఎప్పటికప్పుడు భారత్ అధికారులతో మాట్లాడి ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు' అని అందులో పేర్కొంది.

## హేమంత్‌సోరెన్‌కు ఊరట

ఇదే కేసులో జనవరి 31న సోరెన్ అరెస్ట్ అయ్యారు. 8.36 ఎకరాల ల్యాండ్ కొనుగోలు విషయంలో అవకతవకలు ఈడీ తేల్చి చెప్పింది. ఈ కేసులో ఆరోపణలు వచ్చిన వెంటనే ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తరవాత చంపై సోరెన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే హైకోర్టు బెయిల్ ఇచ్చింది. పెండింగ్ కేసులు ఏమీ లేకపోవడం వల్ల ఆయన జైలు నుంచి విడుదలయ్యేందుకు లైన్ క్లియర్ అయింది. ల్యాండ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌నీ ఇప్పటికే అరెస్ట్ చేశారు. 2023లో ఈ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ని తారుమారు చేశారు. ఆయనను అరెస్ట్ చేసిన తరవాత డాక్యుమెంట్స్‌ని స్వాధీనం చేసుకున్నారు. హేమంత్ సోరెన్ 8.36 ఎకరాల ల్యాండ్‌ని అక్రమంగా కొనుగోలు చేసినట్టు తేలింది. ఈ వ్యవహారంలో భాను ప్రతాప్ సహకరించాడు. ఇప్పటికే ఈడీ మరి కొన్ని కేసులనూ విచారిస్తోంది. కాగా తనను తప్పుడుగా ఇరికించారని.. రాజకీయ నేతలు, సామాజిక కార్యకర్తల గొంతు నొక్కుతున్నారని.. జైలు నుంచి విడుదలైన అనంతరం హేమంత్ ఆరోపించారు.సోరెన్‌ను చూసేందుకు జేఎంఎం శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున జైలు వద్దకు తరలివచ్చారు. పార్టీ కార్యకర్తలు ఆయనకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత తన తండ్రి, జేఎంఎం అధినేత శిబు సోరెన్ నుంచి ఆశీస్సులు తీసుకున్నారు. మద్దతు తెలిపిన వారికి, న్యాయవ్యవస్థకు హేమంత్ సతీమణి కల్పనా సోరెన్ ధన్యవాదాలు తెలిపారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఝార్ఖండ్ ముక్తిమోర్చ కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్‌ను ఈ ఏడాది జనవరి 31న ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి ఆయన బిర్సా ముండా జైల్లో ఉన్నారు. అరెస్టుకు కొన్ని గంటల ముందే ఆయన నాటకీయ పరిణామాల నడుమ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా.. నూతన సీఎంగా చంపయీ సోరెన్ బాధ్యతలు చేపట్టారు.

# ముందుంది మంచికాలం

సమాచారం.త్వరలో జరగబోయే మూడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభ ఎన్నికల్లో విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ముందుకు సాగాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నేతలకు దిశా నిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ గెలుపు కోసం ఐక్యంగా పని చేయాలని సూచించారని చెప్పాయి. త్వరలో మహారాష్ట్ర, హరియాణా, ఝార్ఖండ్ రాష్ట్రాలతో పాటు జమ్ముకశ్మీర్ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని, మిత్ర పక్షాలతో కలిసి ఎన్నికల్లో పని చేయాలని రాహుల్‌గాంధీ, హస్తం పార్టీ నేతలకు సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఇటీవల సమీక్షించారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో హస్తం పార్టీలో సీనియర్ నేతల మధ్య నెలకొన్న అంతర్గత పోరు విషయమై రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

# నీట్‌పై అట్టుడికిన లోక్‌సభ

ప్రారంభించాల్సి ఉన్నందున, అందులో ప్రస్తావించాలని స్పీకర్ ఓంబిర్లా సూచించారు. లేదా మరో తరహాలో చర్చకు అనుమతిస్తామని చెప్పారు. అయితే విపక్ష సభ్యులు అందుకు నిరాకరించారు. నీట్‌పై చర్చ చేయాల్సిందే నని పట్టుబట్టారు. నినాదలతో గందరగోళ పరిచే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్పీకర్ ఓంబిర్లా సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో 'నీట్ పేపర్ లీక్ వ్యవహారం దుమారం రేపుతోంది. దీనిపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేయడంతో లోక్‌సభ, రాజ్యసభల్లో శుక్రవారం గందరగోళ వాతావరణం నెలకొంది. ప్రతిపక్షాల ఆందోళనలతో లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన పలువురు రాజకీయ ప్రముఖులకు సభ సంతాపం ప్రకటించింది. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. దీనిపై స్పీకర్ చర్చను ప్రారంభించగా.. ప్రతిపక్షాలు నీట్ అంశాన్ని లేవనెత్తాయి. నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల కోసం సభలో చర్చించాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. ఇందుకు సభాపతి ఓం బిర్లా అంగీకరించకపోవడంతో విపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. అయితే విపక్షాలు నిబంధనలు కాదని డిమాండ్ చేయడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని ధన్యావా తీర్మానం అయిపోయాక చర్చకు అవకాశం ఉంటుందని చెప్పారు. అయితే దీనిని విపక్షాలు అంగీకరించలేదు. ప్రతిపక్షాల నిరసన నేపథ్యంలో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అటు రాజ్యసభలోనూ ఇదే గందరగోళం కన్పించింది. నీట్ అంశంపై చర్చకు పట్టుబడుతూ విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. వారి ఆందోళనల నడుమ కొంతసేపు ఛైర్మన్ సభను నడిపించారు. అయినప్పటికీ వారు తగ్గకపోవడంతో ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది.

# ఢిల్లీ జలమయం

సూచించారు. అయితే.. కూలిన టెర్మినల్ 16 ఏళ్ల క్రితం నాటిదని పేర్కొం టున్నారు. ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురు స్తోంది. ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలి చిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్ సహా ఎన్‌సీఆర్‌లో ఏకధాటిగా వర్షం పడుతోంది. ఆర్కేపురం, సరి తా విహార్, మునిర్కా, ఇండియా గేట్ ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమ యమయ్యాయి. ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత రాత్రి నుంచి ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. కుండపోతగా కురుస్తున్న వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. భారీగా వరద నీరు రావడంతో లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు నిలిచిపోయాయి. రోడ్లపైకి వర్షం నీళ్లు చేరడంతో కొన్ని చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు నెమ్మదిగా కదులుతుండడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఐతే ఉదయం నుంచి వర్షం పడుతుండడంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఈసందర్భంగా విమానయానశౄఖ మంత్రి రామ్మోమన్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. ఇది చాలా తీవ్రమైన ఘటన అని వ్యాఖ్యానించారు.ఇక్కడ మీకు ఒక విషయం స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఈరోజు తెల్లవారుజామున కూలినది పాత భవనంలోని పైభాగం. దానిని 2009లో ప్రారంభించారు. ప్రధాని మోదీ ప్రారంభించిన భవనం అవతలివైపు ఉందని వెల్లడించారు. కూలిన భాగంలోని కొన్ని బీమ్‌లు తుప్పుపట్టి ఉన్నాయని ప్రశ్నించగా.. 'దీని గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు చర్య అవుతుంది. దీనిపై తనిఖీ చేయమని విమానాశ్రయ అధికారులను ఆదేశించాం. మంత్రిత్వ శాఖ, డీజీసీఏ విడివిడిగా దర్యాప్తు చేస్తుందని వెల్లడించారు. విమానాశ్రయంలో జరిగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఆ కూలిన టెర్మినల్‌ను ఇటీవలే ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని హస్తం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ ఆరోపించారు. గత పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతి, నేరపూరిత నిర్లక్ష్యం ఈ దుస్థితికి కారణం' అని దుయ్యబట్టారు. ఈ విమర్శలను ఉద్దేశించే కేంద్రమంత్రి బదులిచ్చారు. అదంతా తప్పుడు సమాచారం అని కొట్టిపారేశారు. కూలిపోయిన ఈ టర్మినల్ పైభాగాన్ని 2008–09 సంవత్సరంలో నిర్మించారని తెలిపారు. ఈ ఘటనపై కేంద్రమంత్రి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం తరఫున మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గాయపడినవారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షలు ఇస్తామని వెల్లడించారు. అలాగే సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్ని ఆయన పరామర్శించారు. ఇక ఈ ఘటనతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వారు ప్రయాణించాల్సిన విమానాల గురించిన సమాచారం అందక గందరగోళానికి గురయ్యారు. ఈ క్రమంలో డీజీసీఏ విమానయాన సంస్థలకు ఆదేశాలు ఇచ్చింది. ప్రత్యామ్నాయ విమానాలు ఏర్పాటుచేయాలని, విమానాలు రద్దయితే టికెట్ రీఫండ్ ఇవ్వాలని వెల్లడించింది. ఘటన జరిగిన వెంటనే అత్యవసర సహాయ బృందాలు చర్యలు చేపట్టాయని, పలువురు గాయపడ్డారని, వారికి వైద్య సాయం అందించినట్లు తెలిపారు. వెంటనే... టెర్మినల్ 1 నుంచి విమాన సర్వీసులు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ముందు జాగ్రత్త చర్యగా చెక్ ఇన్ కౌంటర్లు అన్ని మూసి వేశామని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్‌లో భారీ వర్షాలు పడుతున్నాయి.

# కమిషన్‌పై పిటిషన్

అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగిశాయి. అనంతరం కేసీఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసినట్లు హైకోర్టు ప్రకటించింది. అయితే కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ స్వీకరించవద్దని అడ్వకేట్ జనరల్ కోరారు. పిటిషన్‌ను విచారణకు అనుమతించడం పైనే వాదనలు వినిపించాలని? మెరిట్స్‌లోకి వెళ్లవద్దని ఏజీకి ధర్మాసనం సూచించింది. ఏజీ వాదనలపై కేసీఆర్ న్యాయవాది ఆదిత్యా సోంధీ అభ్యంతర వ్యక్తం చేశారు. జ్యుడిషియల్ విచారణగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దానిపై నివేదిక ఇవ్వాలే గానీ, మీడియాకు వివరాలు వెల్లడించకూడదు. విద్యుత్ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముందే చెప్పి కారకులెవరో తేల్చుమన్నారు. ఇది సరికాదు అని ఆదిత్యా సోంధీ పేర్కొన్నారు. విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘం ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని హైకోర్టు గురువారం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం హైకోర్టు రిజస్ట్రీకిఆదేశాలు జారీచేసింది. విద్యుత్తు వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘాన్ని నియమించింది. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్–తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తుశాఖ ముఖ్య కార్యదర్శిని, జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విచారణ సంఘాన్ని, వ్యక్తిగత హోదాలో జస్టిస్ ఎల్ నరసింహారెడ్డిని ఇందులో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
రోడ్లు & బిల్డింగ్స్ డిపార్టుమెంట్
ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వారి కార్యాలయము
సౌత్‌బిల్డింగ్స్, డివిజన్, డివిజన్, ఖైరతాబాద్, హైదరాబాద్
ఈ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT No.DB/PA/EE/SBD/2024-25/04/356 Dt:25/06/2024
పనుల సంఖ్య: 02, మొత్తం ఈసీవీ రూ.2,05,435/- బిడ్ డాక్యుమెంట్లు స్వీకరించు చివరితేది: 02.07.2024. సాయంత్రం: 3 గం॥లకు. బిడ్ డాక్యుమెంట్లు తెరచు తేది & సమయం: 02.07.2024, సా॥ 3.15 గం॥ల నుండి. మిగతా వివరాలకు https://tender.telangana.gov.in లో చూడగలరు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు(ఆర్ & బి)
సౌత్ బిల్డింగ్ డివిజన్, హైదరాబాద్
DIPR No.192-DP/CL/ADVT/1/2024-25

# బొక్కల కంపెనీల కోసం రైతులకు వేధింపులు

- ఓ కీలక రాష్ట్ర నేత తమ్ముడు బెదిరిస్తున్నాడని రైతుల ఆరోపణ
- రోడ్డు వెడల్పు చేయాలని సీఎంఓ ఆఫీస్ నుండి అధికారులకు ఫోన్ కాల్స్?
- 12 ఫీట్ల రోడ్డును 30 ఫీట్ల రోడ్డుగా మారుస్తున్న చింతపల్లి తహసీల్దార్

మర్రిగూడ, జూన్ 24 (జనంసాక్షి) : బొక్కల కంపెనీ కోసం అధికారులు రైతులను వేధిస్తున్న వైనం, అత్యంత దుర్వాసన తో కూడుకున్న జంతు వ్యర్థాలతో నూనె, దాన తయారు చేస్తున్న వైనం, దుర్వాసన భరించలేక రైతులు అనారోగ్యంతో పాటు పాలిచ్చే ఆవులు దుర్మరణం పాలవుతున్నాయి. ఈ కంపెనీ చుట్టూ ఉన్న పొలాలలో పని చేయడానికి వ్యవసాయ కూలీలు రావడం లేదు. పనిచేయడానికి వచ్చిన కూలీలకు వాంతులు విరోచనాలు అవుతున్నాయి.









రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం అప్పరెడ్డి పల్లి గ్రామ శివారులో సర్వేనెంబర్ 87,92,93 లలో 30 ఎకరాలలో ఐఎమ్ఆర్ అనిమల్ ఫీడ్ కంపెనీ ఐలేష్ యాదవ్ పేరు మీద ఏర్పాటు చేశారు. అక్కడున్న రైతులతో వాసన భరించలేక యజమాని ఐలేష్ యాదవ్ నిలదీయగా ఈ కంపెనీ ఓ కీలక రాష్ట్ర నేత తమ్ముడిదని బెదిరిస్తున్నాడని రైతులు వాపోతున్నారు.



ఈ కంపెనీకి రోడ్డు చింతపల్లి మండలం పోలేపల్లిరాంనగర్ గ్రామ శివారు నాగార్జునసాగర్ హైవే నుండి పూర్వకాలం నుండి రైతులు వెళ్లే విధంగా 12 ఫీట్ల రోడ్డు ఉన్నది. సర్వేనెంబర్ 240 పోలేపల్లి రాంనగర్, చింతపల్లి మండలం నలుగురు రైతులు పడకండి నారయ్య, చెన్నయ్య, బక్కయ్య, వీరమ్మ పేర్ల మీద 7 ఎకరాల 30 గుంటల భూమి ఉన్నది, ఈ భూమిలోనుండి 30 ఫీట్ల రోడ్డు తీయడాన్ని రైతుల వ్యతిరేకించారు, గత ఎమ్మార్వో భూమిలో నుండి ఎలాంటి నక్షబాటగాని, బండ్లబాట గాని లేదని సర్టిఫైడ్ కాఫీ ఇచ్చారు. కానీ ఈ రైతులు వెనుకనున్న భూములకు పోవడానికి రైతులకు 12 ఫీట్లు వదిలి ఖడీలు వేసుకున్నారు.

**భూమి లాక్కుంటామని బెదిరిస్తున్నారు**



12 సీట్లు ఉన్న రోడ్డు అక్రమంగా అన్యాయంగా చింతపల్లి తాసిల్దార్ విజయ్ కుమార్ 30 ఫీట్ల రోడ్డు దగ్గరుండి జెసిబి లతోనే చేస్తున్నాడు, అడ్డుకుంటే మాపై అక్రమ కేసులు పెట్టి , భూమిని దున్నవద్దని రోడ్డును ఇవ్వకుంటే భూమి మొత్తం లాక్కుంటానని బెదిరిస్తున్నారు, పోలీసులు ప్రత్యక్షంగా జోక్యం చేసుకొని ఈ రోడ్డు మేము 12 ఫీట్ల కుదిరిస్తే పోలీసులు వచ్చి జెసిబి తీసుకొచ్చి మళ్లీ 30 ఫీట్ల వెడల్పు చేస్తున్నారు, రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి ఈ సంబంధించిన కంపెనీ అని అధికారులు బెదిరిస్తున్నారు.


– పడకండి శివ, యువరైతు, రాంనగర్ పోలేపల్లి చింతపల్లి మండలం నల్గొండ

కానీ చింతపల్లి తాసిల్దార్ విజయ్ కుమార్ కడీలు తొలగించి 30 ఫీట్ల రోడ్డును దగ్గరుండి జెసిబి సాయం చేశారని రైతుల ఆరోపిస్తున్నారు. 30 ఫీట్ల రోడ్డు ఇవ్వకుంటే భూములను మీరు శాశ్వతంగా దున్నొద్దని హెచ్చరిస్తున్నాడని, పోలీసులు దగ్గరుండి మరి ఈ దారిని చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

తాసిల్దార్ తోని ఇక్కడ 12 ఫీట్ల రోడ్డు మాత్రమే ఉందని వాదించినందుకు రైతులపై అక్రమ కేసులు పెట్టారు. చింతపల్లి ఎస్సై రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు, ఈ కంపెనీ రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి కి సంబంధించింది మీరు ఎక్కువగా మాట్లాడితే మీ భూములను లాక్కుంటామని అధికారులు రైతులను భయపెడుతున్నారని ఆరోపిస్తున్నారు. జంతు వ్యర్థాలతో, భరించరాని దుర్వాసనతో ఈ మనుషులకు హాని చేకూర్చే ఈ కంపెనీ కి అధికారుల అండదండలు ఉన్నాయంటే అర్థమవుతుంది, కంపెనీ వెనకాల పెద్ద పెద్ద హస్తాలు ఉన్నాయని, కంపెనీ కాసుల కోసం అధికారులు రైతులపై దౌర్జన్యం చేస్తున్నారు.

## వరద ఉధృతిలో చిక్కుకున్న పశువులు

- ఎట్టకేలకు బయటయపడడంతో కాపరుల ఆనందం





కుమ్రంభీం ఆసిఫాబాద్, జూన్ 28 (జనంసాక్షి) : జిల్లాలో వరద ఉధృతికి పశువులు కొట్టుకుపోయాయి. కాగజ్ నగర్ మండలం అందవెల్లి సమీపంలోని పెద్దవాగుకు శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వరద ప్రవాహం భారీగా పెరిగింది. ఎగువన కురిసిన భారీ వర్షానికి వరద ఉధృతి పెరగ్గా.. పశువులు కొట్టుకుపోయాయి. వాగును దాటే క్రమంలో దాదాపు 50 పశువులు ప్రవాహానికి వాగులో కొట్టుకుపోతూ కనిపించాయి. అయితే, దీన్ని చూసిన పశువులు కాపరి కేకలు వేస్తూ సాయం కోసం అర్థించాడు. అదృష్టవశాత్తు బ్రిడ్జి పిల్లర్ల వద్ద పశువులు ప్రవాహ ఉధృతిని తట్టుకుని ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరాయి. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ తతంగాన్ని స్థానికులు వీడియో తీయడంతో నెట్టింట వైరల్‌గా మారాయి. మరోవైపు, ఇదే ఆసిఫాబాద్ జిల్లా వరద ప్రవాహంలో చేపల కోసం జనం ఎగబడ్డారు. వాంకిడి మండలం నవేదరి గ్రామ చెరువులో భారీ వర్షానికి వరద ఉధృతి పెరిగింది. ఈ క్రమంలో ప్రవాహంలో చేపలు కొట్టుకుపోతుండగా గ్రామస్థులు అక్కడకి చేరుకుని వలలు, వస్త్రాలతో చేపలు పట్టేందుకు ఎగబడ్డారు. పెద్ద పెద్ద చేపలు చిక్కడంతో హర్షం వ్యక్తం చేశారు.

## ప్రత్యేక బస్‌లు నడపాలని విద్యార్థుల ధర్నా



బేల, జూన్ 28 (జనంసాక్షి) : మండలంలోని జూనోని గ్రామములో విద్యార్థులు రోడ్డు పై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లాలంటే బస్సు పూర్తిగా నిండి ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని విద్యార్థులు వాపోయారు. శుక్రవారం గ్రామానికి వచ్చిన బస్సును విద్యార్థులు ఆపి నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు పట్టించుకోని విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సును నడపాలని కోరారు.

## ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు అభినందనలు

- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ వెలిచాల



కరీంనగర్ బ్యూరో, జూన్ 28 (జనం సాక్షి) : పదోన్నతి కోసం 10 ఏళ్ల పాటు ఎదురు చూసి విసిగిపోయిన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు రావడం పట్ల కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని చెప్పడానికి ఈ పదోన్నతులే నిదర్శనం అన్నారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం మాటలతో కోటలు కట్టింది తప్ప ఏ ఒక్కరికి న్యాయం చేయలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ప్రభుత్వ రంగ విద్యపై ఉన్న మమకారాన్ని చూపిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరినీ ప్రభుత్వ పాఠశాలలో చదివించాలనే సదుద్దేశంతో నడుస్తున్న బడిబాట కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతున్న తరుణంలో ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించడం హర్షణీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్య బోధన చేసి ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు.

# టీచర్లల బదిలీతో విద్యార్థుల్లో ఉద్వేగం

- కన్నీరు మున్నీరయిన పిల్లలు



నల్లగొండ, జూన్ 28 (జనంసాక్షి) : ఉపాధ్యాయులతో పిల్లల అనుబంధం విడదీయరానిది. బదిలీపై వెళ్లినప్పుడు అక్కడున్న వారంతా బదిలీపై వెళుతున్న అధికారులను చూసి బాధపడుతుంటారు. కొందరు వెళ్లొద్దంటూ వేడుకొంటూ ఉంటారు. తాజాగా ఇటువంటి అనుభవమే కొందరు ఉపాధ్యాయులకు తెలంగాణలో ఎదురైంది. ఇన్నాళ్లు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించిన ఆ ఉపాధ్యాయులు బదిలీపై వెళుతుంటే.. పదుల సంఖ్యలో విద్యార్థులు వారి చుట్టూ చేరి వెళ్ళొద్దంటూ వేడుకున్నారు. తెలంగాణలోని రెండు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఈ ఘటనలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ మారాయి. దీనికి సంబంధించిన వివరాలు ఎలా ఉన్నాయి. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమల్ల జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా సైదులు గడిచిన 14 ఏళ్లుగా పని చేస్తున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పడంలో టీచర్ గా కాకుండా స్నేహితుడిగా వ్యవహరిస్తూ వచ్చిన ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఆప్తుడిగా మారిపోయారు. ఆ టీచర్ ఎప్పుడు రాకపోయినా ఆ విద్యార్థులు మనసు కలత చెందుతూ ఉంటుంది. అటువంటి ఉపాధ్యాయులకు కొద్ది రోజుల కిందట బదిలీ అయింది. ఆ మాస్టారు ఇకపై రారని తెలుసుకున్న విద్యార్థులు కన్నీరు మున్నీరుగా వినిపించారు. బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లేందుకు ఉపాధ్యాయుడు సిద్ధమవుతుండగా తమను వదిలి వెళ్ళవద్దు అంటూ ఉపాధ్యాయుడిని పట్టుకుని విద్యార్థులంతా ఏడ్చారు. అంతేకాకుండా పదుల సంఖ్యలో విద్యార్థులు ఉపాధ్యాయుడు కాళ్ళ మీద పడి మరి బోరున విలపించారు. మీరు ఇక్కడే ఉండాలి మాస్టారు అంటూ విలపించారు. ఉపాధ్యాయుడు సైదులు వెళ్లడాన్ని విద్యార్థులు జీర్ణించుకోలేకపోయారు. అయినా, సరే మాస్టారు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో.. విద్యార్థులు ఉపాధ్యాయుడు సైదులుకు ఘనంగా వీడ్కోలు పలికారు. సరిగ్గా ఇటువంటి ఘటనే జనగామ జిల్లాలోనూ చోటుచేసుకుంది. జనగామ జిల్లా శామీర్‌పేట ప్రాథమిక పాఠశాలలో సుధీర్ అనే ఉపాధ్యాయుడు గత కొన్నాళ్ల నుంచి పని చేస్తున్నారు. ఆయనకు తాజాగా మరోచోటకు బదిలీ అయింది. సుధీర్ మాస్టారు బదిలీపై వెళుతున్న విషయం తెలుసుకున్న విద్యార్థులు గేటుకు అడ్డుగా నిలబడి వెళ్ళవద్దు అంటూ మాస్టారును వేడుకున్నారు. మీరు ఇక్కడే ఉండాలి మాస్టారు అంటూ మాస్టారుకు విజ్ఞప్తి చేశారు. కన్నీటి పర్యంతమై అడ్డుకోవడానికి ప్రయత్నించిన విద్యార్థులను చూసి సుదీర్ మాస్టర్ కళ్ళల్లో కూడా నీళ్లు తిరిగాయి. మళ్లీ వస్తానంటూ విద్యార్థులకు ధైర్యం చెప్పి ఆయన బయలుదేరి వెళ్లారు. మాస్టారు వెళ్లిన తర్వాత కూడా విద్యార్థులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు చూసిన స్థానికులు భావోద్వేగానికి గురయ్యారు.

## నేడు కొండగట్టుకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్



- పవన్ కళ్యాణ్ రాకతో భారీగా ఏర్పాట్లు

హైదరాబాద్, జూన్ 28 (జనంసాక్షి) : జనసేన చీఫ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోనున్నారు. దీంతో పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఏపీ పోలీసులు పవన్ పర్యటన షెడ్యూల్‌ను విడుదల చేశారు. శనివారం ఉదయం 7 గంటలకు మాదాపూర్‌లోని తన నివాసం నుంచి రోడ్డు మార్గంలో కొండగట్టుకు బయల్దేరనున్నారు. ఉదయం 11 గంటలకు కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి ఆయన చేరుకోనున్నారు. గంటన్నర పాటు కొండగట్టు పుణ్యక్షేత్రంలో పవన్ గడపనున్నారు. ఆంజనేయస్వామికి పవన్ ప్రత్యేక పూజలు చేయను న్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు కొండగట్టు నుంచి మాదాపూర్‌కు రోడ్డు మార్గంలో తిరిగి రానున్నారు. సాయంత్రం 4.30కు మాదాపూర్ చేరుకోనున్నారు. శనివారం రాత్రికి హైదరాబాద్‌లోనే డిప్యూటీ సీఎం పవన్ బస చేయనున్నారు.

## బాసర ప్రసాదాల విక్రయంలో చేతివాటం



నిర్మల్, జూన్28 (జనంసాక్షి) : గుడిని గుడిలో లింగాన్ని మింగేస్తారంటే ఏమో అనుకున్నాం. కానీ కొన్ని సందర్భాల్లో అది మన కళ్లెదుట స్పష్టంగా తేటతెల్లమవుతూ ఉంటుంది. బాసర జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో కాదేదీ అవినీతి, అక్రమాలకు అనర్హం అన్నట్టుగా.. ప్రసాదాల విక్రయంలో సిబ్బంది చేతి వాటం ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. విషయాన్ని గమనించిన భక్తులు ఆలయ ఈవోకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టించారు. ఈ విషయమై ఈవో విజయరామారావు విచారణ జరుపుతున్నారు. అమ్మవారి ప్రసాదంలో చేతివాటం ప్రదర్శించడంపై భక్తులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.దేశంలోనే పేరుగాంచిన సరస్వతీ దేవి ఆలయాల్లో బాసర ఒకటి. ఈ ఆలయంలో ప్రసాదాల విషయంలో గతంలోనూ రచ్చ జరిగింది. గత ఏడాది బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో ప్రసాదం లడ్డూలు పాడయ్యాయని భక్తులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి కూడా సిబ్బంది నిర్లక్ష్యమే కారణం. పెద్ద ఎత్తున అభిషేకం లడ్డూలపై ఫంగస్ ఏర్పడటంతో అవి పాడైపోయాయి. ఇలా చాలాసార్లు ప్రసాదం పాడైపోవడం పడేయడం జరిగింది. ఇప్పుడు ఏకంగా చేతివాటం ప్రదర్శిస్తూ దొరికిపోయారు. ఇలా ఆలయ సిబ్బంది ఏదో ఒక విషయంలో వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు.

# ఉల్లాసంగా... ఉత్సాహంగా

- అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్లో ఫుడ్ షేరింగ్ డే



కరీంనగర్ బ్యూరో, జూన్ 28 (జనం సాక్షి) : విద్యార్థులకు ప్రాథమిక దశనుండే పౌష్టికకరమైన ఆహారం అందించాలని తద్వారా వారు ఉషారుగా ఉంటారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో "ఫుడ్ షేరింగ్ డే"ను పురస్కరించుకొని ఏర్పాటుచేసినటువంటి ప్రత్యేక ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పౌష్టికకరమైన ఆహారాన్ని తీసుకోవడం వలన చాలా ధృడంగా ఉండడమే కాకుండా వివిధ పనులను ఉషారుగా చేపడుతామని చెప్పారు. చాలామంది ఆహారాన్ని చక్కగా తీసుకోకపోవడం వలన వివిధ సమస్యలు తలెత్తుతాయని, కార్యకలాపాలు అసంపూర్తిగా ఉంటాయని తెలిపారు. విద్యార్థ్యులకు రోజు చక్కటి ఆహారాన్ని అందజేయాలని తెలుపుతూ తద్వారా ధృడంగా ఉంటారని అభిప్రాయపడ్డారు. ప్రత్యేకమైన దినోత్సవాన ఆహారం యొక్క ప్రాముఖ్యతను, స్నేహం యొక్క విశిష్టతను తెలియజేసిన వారు అవుతామని అభిప్రాయపడ్డారు. ఫుడ్ షేరింగ్ వివిధ దేశాలలో ప్రాచుర్యం పొందినదని చాలా మంది దీనిని అమలుపర్చి ప్రేమపూర్వకంగా ఉంటారని చెప్పారు. మన దేశంలో సైతం ఇటీవల కాలంలో ఈ అంశానికి ప్రత్యేకత సంచరించుకున్నదని తెలిపారు. ఫుడ్ షేరింగ్లో భాగంగా పాఠశాలలో విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకవచ్చి వారి ఉపాధ్యాయులతో , స్నేహితులతో పంచుకొని ఆనందాన్ని రెట్టింపు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఇతర విద్యార్థులతో స్నేహపూర్వకంగా పంచుకొని బంధుత్వాలను ఏర్పర్చుకుని వాటి విశిష్టతను తెలుసుకున్నారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి "మై షేరింగ్ ఫుడ్ షేరింగ్ లొవ్లీ షేరింగ్", "టేక్ ఫుడ్ – సేవ్ లైఫ్" నాటిక చాలా ఆలోచింపచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తూతూ మంత్రంగా సిడిపిఓపై విచారణ?

- విధులలో కొనసాగిస్తూనే విచారణ..!
- సానుకూలంగా చెప్పాలంటూ అంగన్వాడీ కార్యకర్తలపై ఒత్తిడి...?
- నిజానిజాలు చెప్పడానికి భయపడుతున్న అంగన్వాడీలు




నిర్మల్ బ్యూరో, జూన్ 27(జనంసాక్షి) : ఖానాపూర్ ఐసిడిఎస్ పరిధిలో సిడిపిఓ సరిత అవినీతి అక్రమాలకు పాల్పడుతుందని వివిధ వార్తాపత్రికలలో వచ్చిన వార్తా కథనాలకు స్పందిస్తూ, బాధితుల ఫిర్యాదు మేరకు గురువారం సిడిపిఓ సరితపై విచారణ మొదలైంది. నిర్మల్ సిడిపిఓ, జిల్లా ఇన్చార్జి విచారణ అధికారిగా కొనసాగు తున్నారు. గురువారం పలువురు అంగన్వాడీ కార్యకర్తలను ఖానాపూర్ కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయానికి పిలిపించుకొని విచారణ అధికారి పలు అంశాలను వారితో విచారించారు. ఈ ప్రక్రియ రేపు కూడా కొనసాగి అవకాశం ఉంది. కాగా ఈ విచారణ పై పలువురు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు.

ఇక్కడి వరకు విచారణ అంతా బాగానే ఉన్నా విచారణ తూతూ మంత్రంగా సాగుతుంది అని పలువురు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. సిడిపిఓ సరిత ను అక్రమాలపై విచారణ చేపట్టేందుకు నిర్మల్ సిడిపిఓ ను నియమించారు. ఒక సిడిపిఓ ను విచారించడానికి మరొక సిడిపిఓ ను నియమించడం ఇక్కడ పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లా ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నప్పటికీ వారు కూడా సిడిపిఓ కాబట్టి విచారణ పైపైనే చేపట్టే అవకాశం ఉందని, పూర్తిగా విచారణ చేపట్టే అవకాశం ఉండదేమో అని పలువురు నాయకులు భావిస్తున్నారు. దానికి ఆజ్యం పోసేలా విచారణ పలువురు కార్యకర్తలను మాత్రమే కార్యాలయానికి పిలిపించుకొని చేయడం కాస్త విడ్డూరంగా కనిపిస్తుందని అంటున్నారు. విచారణ అనేది లోతుగా విచారణ అనేది లోతుగా జరగాలంటే, నిజా నిజాలు బయటపడాలంటే ఉన్నత స్థాయి అధికారులు నియమించాలని హా పలువురు కోరుతున్నారు. అలాంటప్పుడే విచారణ సాధికారికంగా జరుగుతుందని అంటున్నారు. అభియోగాలు ఎదుర్కొం టున్న సదరు సిడిపిఓ ను విధులలో కొనసాగిస్తూనే విచారణ చేపట్టడంతో పలువురు విచారణ పారదర్శకంగా జరుగుతుందా అని అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. విచారణ పారదర్శకంగా కొనసాగాలంటే విచారణ పూర్తయ్యేంత వరకు సదరు సిడిపిఓ ను విధులకు దూరంగా ఉంచాలని పలువురు భావిస్తున్నారు. విచారణ సమయంలో సదరు సిడిపిఓ విచారణ తనకు అనుకూ లంగా జరిగేలా సంబంధిత అంగన్వాడీ కార్యకర్తలను ప్రేరేపించే అవకాశం ఉందని, విచారణ పూర్తయ్యే వరకు విధులకు దూరంగా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

**అంగన్వాడీ కార్యకర్తలపై ఒత్తిడి..?**

అభియోగాలు ఎదుర్కొంటున్న సిడిపిఓ సరిత విధులను నిర్వర్తిస్తూ ఉండటంతో నిజానిజాలు, వాస్తవా లను చెప్పడానికి అంగన్వాడీ కార్యకర్తలు ముందుకు వచ్చే అవకాశం లేదని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణ సమయంలో సదరు సిడిపిఓ తనకు అనుకూ లంగా చెప్పాలంటూ అంగన్వాడీ టీచర్ల పైన ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో అంగన్వాడీ టీచర్ల పరిస్థితి అడకత్తెరలో వక్కలాగా మారింది. జరిగిన వాస్తవాలను చెబితే ఎక్కడ తమను ఇబ్బందులకు గురి చేస్తారో అనే భయాందోళన మొదలైందని పలువురు భావిస్తున్నారు. అభియోగాలు ఎదుర్కొంటున్న సిడిపిఓ పై విచారణ అధికారిగా మరొక సిడిపిఓ ను నియమించడం వెనక మతలబు ఏంటో అర్థం కావడం లేదని పలువురు నాయకులు, ప్రజలు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. విచారణ సమయంలో విచారణ అధికారిగా ఉన్న సిడిపిఓ విచారణ పూర్తయిన తర్వాత ఎవరెవరు ఏం చెప్పారు తదితర విషయాలను అభియోగాలు ఎదుర్కొంటున్న సిడిపివో కు చెబితే తమ భవిష్యత్తు పరిస్థితి ఏంటని అంగన్వాడీలు భయపడు తున్నట్లు సమాచారం. దీంతో విచారణ సమయంలో వారు నిజాలు చెప్పడానికి ముందుకు వచ్చే అవకాశం లేదని పలువురు భావిస్తున్నారు. విచారణ పారదర్శకంగా జరగాలంటే ఇతర జిల్లా వారిని, లేదా ఆపై అధికారిని విచారణ అధికారిగా నియమిస్తే నిజానిజాలు బయటకు వస్తాయని ప్రజలు కోరుతున్నారు.

**బ్యాంకు లావాదేవీలు క్షుణ్ణంగా పరిశీలించాలి**

విచారణ కేవలం మౌఖికంగా కాకుండా పూర్తి క్షుణ్ణంగా జరగాలని ప్రజలు భావిస్తున్నారు. సదరు సిడిపిఓ అంగన్వాడీ టీచర్ల దగ్గర నుండి, ఆజాల దగ్గర నుండి 400 వసూలు చేసిందని, ప్లెక్సీల కొరకు వెయ్యి రూపాయలు వసూలు చేసిందని అభియోగాలు ఎదుర్కొం టున్నారు. ఇవ్వని వారిపై కక్ష కట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు అని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో వాస్తవాలు బయటపడాలంటే సదరు సిడిపిఓ, సూపర్వైజర్ల బ్యాంకు లావాదేవీలు, ఫోన్ పే గూగుల్ పే లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అప్పుడే వాస్తవాలు బయటపడతాయని ప్రజలు, పలువురు నాయకులు డిమాండ్ చేస్తున్నారు. విచారణ మౌఖికంగా నిర్వహిస్తూనే బ్యాంకు లావాదేవీలను పరిశీలించాలని కోరుతున్నారు.

# మన విద్యాలయాలు.. మన బాధ్యతలు

*27 జూన్ మహేష్ శ్రీ పొట్టి శ్రీరాములు ఆంధ్ర హైస్కూల్లో ఏర్పాటు చేసిన అసెంబ్లీ లో ఇద్దరు పూర్వ విద్యార్థులు, విరాళ దాతలు బాసిన రమేష్, కడి సుమన్ ముందుకు వచ్చి విద్యార్థులకు ప్రోత్సాహం కలిగించే మాటలు చెప్పారు. విజయవాడ లో ఉంటున్న వడగ నానాజీ కుటుంబం పదవీ విరమణ సందర్భంగా విద్యాలయానికి అందించిన మూడు ముచ్చటైన చైర్లను ఆవిష్కరించారు. నానాజీ సుపుత్రులు సైంటిఫిక్ ఆఫీసర్లు.*



జీవించడానికి ఎన్నో మార్గాలు ఉంటాయి. తను మాత్రమే జీవితంలోని ఆనందాన్ని అనుభవిస్తూ జీవించడం ఒక పద్ధతి. తను జీవిస్తూ తనతో పాటు మరికొందరికి తీసుకుంటూ పోతూ, వారికి చేయూతనిస్తూ వారి అవసరాల్లో ఆదుకుంటూ జీవించడం మరో పద్ధతి. శ్రీ వడగ నానాజీ గారి కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ ఈ రెండో పద్ధతిని ఎంచుకుంటూ ఇతరులకు ప్రేరణగా నిలుస్తుంటారు.గతంలో ఒక స్టాండ్ ఫ్యాన్ ను విద్యాలయానికి అందించారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో రోడ్డు మీద నిలబడి ఆహారం కార్మికులకు పంచారు. అత్యంత ఉన్నత పదవిలో సేవలు అందించి శ్రీ వడగ నానాజీ గారు ఈనెల ఆఖరులో రిటైర్ అవుతున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వడగ కుటుంబ సభ్యులు ఒక వినూత్నమైన పద్ధతిని ఎంచుకోవడం హర్షించదగ్గ విషయం. శ్రీమతి వడగ పుష్పలత గారు, వారి కుమారులు కలిసి ఎక్కడో విజయవాడ లో ఉంటూ కూడా పశ్చిమ బెంగాల్ లోని తెలుగు విద్యాసంస్థల అవసరాలను గుర్తించి ఈ శుభ సందర్భంలో ఏదైనా చిన్న సహకారం చేద్దామని ముందుకు వచ్చారు.

ఒక ఉద్యోగి రిటైర్మెంట్ కార్యక్రమాలు చేసేటప్పుడు సాధారణంగా మనం ఏం చేస్తామంటే ఏవైనా కొన్ని బహుమానాలు రిటైర్ అవుతున్న ఆయా ఉద్యోగులకు అందిస్తూ వారు ఆయా సంస్థలకు అందించిన సేవలను కొనియాడతాం. భావి జీవితంలో మరింత హాయిగా, ఆనందంగా జీవించమని కోరుకుంటాం. శ్రీ వడగ నానాజీ గారు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ లో అత్యంత ఉన్నతమైన పదవిలో సేవలు అందించి ఈ నెల ఆఖరులో రిటైర్ అవుతున్నారు.

అయితే ఈ కుటుంబ సభ్యులు ఎంచుకున్న కొత్త పద్ధతి ఇతరులకు ప్రేరణగా నిలిచింది. విద్యా సంస్థలకు, విద్యార్థులకు వివిధ రకాలుగా సహకరించి దాన్నే బహుమానంగా భర్తకు భార్య, తండ్రికి కుమారులు, అలానే మామయ్య గారికి కోడళ్ళు ఇవ్వాలని అనుకున్నారు. ఇదో కొత్త తరహా ఆలోచన. పశ్చిమ బెంగాల్ లోని తెలుగు విద్యాసంస్థలకు ఎన్నో సమస్యలు ఉన్నాయి. వారి అవసరాలు ఎప్పుడూ కూడా తీరవు.

ఇందులో భాగంగా మహేష్ శ్రీ పొట్టి శ్రీరాములు ఆంధ్ర ఉన్నత పాఠశాల గత కొన్ని నెలలుగా స్టాఫ్ కొరతను పరిష్కారం చేసే దిశలో ప్రజల సహకారం ఆర్థిస్తోంది. ఇతర సహకారాలు కూడా కోరుకుంటూ ఉంది. ఈ నేపథ్యంలో విద్యాలయానికి మూడు అందమైన, ముచ్చటైన చైర్లను పంపించారు. అలానే, హయ్యర్ సెకండరీ చదువుతున్న శ్రమించే ముగ్గురు పేద అమ్మాయిలు ఎక్కడ ట్యూషన్లు చదివినా ప్రతి ఒక్కరికీ రెండు వేలు తగ్గకుండా జాగృతి సమీక్ష త్రైమాసిక పత్రిక సమన్వయంతో అందిస్తున్నారు.

ఇక్కడి టిటాగడ్ ఆంధ్ర విద్యాలయం, జ్యోతిర్మయ యువజన విద్యా కేంద్రం, మహేష్ శ్రీ పొట్టి శ్రీరాములు ఆంధ్ర హైస్కూల్ విద్యా సంస్థలకు 'చిన్నోడికి ప్రేమతో' పుస్తకం జాగృతి సమీక్ష సమన్వయంతో అందిస్తున్నారు. వడగ నానాజీకి బెంగాల్ తెలుగు భాషీయుల తరుపున పదవీ విరమణ శుభాకాంక్షలు. పదవీ విరమణ తర్వాత జీవితం ఆనందంగా, హాయిగా, ఆహ్లాదకరంగా, ఆరోగ్యంగా గడుపుతారని అభిలషిస్తున్నాం. ఆయన కుటుంబ సభ్యులకు కూడా అభినందనలు.



**కేశవ్**

# నల్లనేల మీద బీఆర్ఎస్ దృష్టి!





**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223

**నల్ల నేల మీద బిఆర్ఎస్ దృష్టి సారించింది. తెలంగాణ ఉద్యమం లో కీలకంగా వ్యవహరించిన సింగరేణి కార్మికులు, వారి కుటుంబసభ్యులు మొన్న అసెంబ్లీ, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించారు. తెలంగాణ ఉద్యమం తర్వాత, ముందు కూడ బిఆర్ఎస్, దాని అనుబంధ యూనియన్ అయిన టీబిజీకెఎస్ వెంట ఉన్న వారు, వారిని నెత్తిన ఎక్కించుకుని ఎన్నికల్లో గెలిపించిన వారు, నేలకేసి కొట్టారు. టీబిజికెఎస్ ను కూడ ఓడించారు. సింగరేణి కార్మికులు ఏఐటీయూసీ కి యూనియన్ ఎన్నికల్లో గెలిపించి సింగరేణి లో గుర్తుంపు నిచ్చారు. ఐఎన్టియుసి కి రిప్రెసెంటిటివ్ హోదా ఇచ్చారు.సింగరేణి కార్మికులు తెలంగాణ ఉద్యమంలో యూనివర్సిటీ విద్యార్థులు,ఆర్టీసీ కార్మికుల మాదిరే ఫ్రంట్ లైన్ లో ఉన్నారు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ కోసం దీక్ష చేస్తూ అరెస్ట్ అయినపుడు ముందు స్పందించింది సింగరేణి కార్మికులే, తెలంగాణ ఉద్యమంలో మొదటి సమ్మె చేశారు.సకల జనుల సమ్మె కన్నా ముందుగా సింగరేణి లో వివిధ సందర్బంగా ఏడుసార్లు విధులు బహిష్కరించారు. సకల జనుల సమ్మె తెలంగాణ కోసం 35 రోజులు చేశారు.**

## అండ దండగా నల్ల నేల!

బిఆర్ఎస్ కు సింగరేణి ఎప్పుడు అండదండగానే ఉన్నది. అలాంటి కోల్ బెల్ట్ లో ఇప్పుడు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా పోరాడడానికి బిఆర్ఎస్ సిద్ధం అవుతున్నది. జులై 9 న గోదావరిఖని లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సింగరేణి కి వేలంలో పాల్గొనకుండానే బొగ్గు బ్లాకులు కేటాయించాలని ఒక్క రోజు నిరాహార దీక్ష చేయనున్నారు. టీబిజికెఎస్ ముఖ్య కార్యకర్తలతో కేటీఆర్ తెలంగాణ భవన్ లో గురువారం సమావేశం అయి సింగరేణి కి బొగ్గు బ్లాక్ల కేటాయింపు,ప్రైవేటీకరణ అంశాల మీద చర్చించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా క్యాడర్ కు దగ్గరగా వచ్చి కలిశారు. వారి అభిప్రాయాలు తీసుకున్నారు.అందరికీ ధైర్యం చెప్పారు. ప్రజలు తమకు ఇచ్చిన ప్రతిపక్ష హోదాను భాద్యతగా నిర్వహిస్తాము, అని, ఓటమి ని అంగీకరిస్తున్నామని, తప్పులను తెలుసు కుంటున్నామని, పేర్కొన్నారని, పార్టీ, యూనియన్ క్యాడర్ పేర్కొన్నారు.

## ఆత్మ విమర్శ లైన్ లోకి వచ్చినట్టేనా!

సింగరేణి మీద కేంద్రికరించడం ద్వారా, తిరిగి ఉత్తర తెలంగాణాలో పార్టీని బలోపేతం చేయవచ్చు అని బిఆర్ఎస్ భావిస్తున్నది. ఆత్మ విమర్శ లైన్ లోకి పార్టీ వచ్చినట్లు కనిపిస్తుంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల అనంతరం బిఆర్ఎస్ సంస్తాగతంలో ఇదో మంచి మార్పులా కనిపిస్తున్నది. కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి పార్టీ తంటాలు పడుతున్నది. ఇందులో భాగంగానే కోల్ బెల్ట్ క్యాడర్ తో కేటీఆర్ సమావేశం అయినట్లు,కోల్ బ్లాకులు వేలం లో పాల్గొనకుండా, కేటాయించాలానే డిమాండ్ తో దీక్ష చేయడానికి నిర్ణయించినట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. అయితే ఏ మేరకు, ఎంత మేరకు బిఆర్ఎస్ పార్టీ ఉత్తర తెలంగాణకు ఊపిరి లాంటి సింగరేణి లో నిలబడుతుందో, పీపుల్, ముఖ్యంగా కార్మికులు ఎలా స్పందిస్తారో, వేచి చూడాల్సిందే!మొత్తానికి వెనుక పడేసిన ఉత్తర తెలంగాణాలోని సింగరేణి మీద బిఆర్ఎస్ కేంద్రికరణ రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసే పరిస్థితి ఉంటుంది. కోల్ బెల్ట్ కు సంబంధించి సింగరేణి కి కొత్త బొగ్గు బ్లాకులు రాక పది ఏండ్లు దాటింది. మరో ఐదు ఏండ్లలో 10 పాత బావులు ఉత్పత్తి అయిపోయి మూత పడే పరిస్థితి ఉన్నది. ఈ నేపథ్యంలో కొత్త బొగ్గు బ్లాకులు రాకుంటే సింగరేణి దివాళా తీస్తుంది అనడంలో అతిషయోక్తి కాదు! రాజకీయాలు ఎలా ఉన్నా, కొత్త బొగ్గు బ్లాక్ల కోసం రాజకీయాలకు అతీతంగా అందరు కృషి చేయాలి! ముఖ్యంగా కోల్ బెల్ట్ ఎంపీ లు శ్రద్ధ తీసుకోవాలి!

# సప్తసముద్రాల ఆవలా తెలుగువెలుగు



*ఎక్కడ చూసినా తెలుగే... ఎక్కడ విన్నా తెలుగే... అది యూనివర్సిటీలలో అయితేనేమీ, ఆఫీసుల్లో నైతేనేమీ ఎక్కడైనా తెలుగు స్వరం వినిపిస్తూనే ఉంది. మరి అది ఎక్కడ అనుకుంటున్నారు. మన రాష్ట్రం సరిహద్దు ప్రాంతాల్లోనో... మనవారు మనదేశంలో ఇతర రాష్ట్రాల్లో వృత్తి బాధ్యతలు ఉపాధి నేపథ్యంగా వెళ్లిన ప్రాంతమో కాదు. ఖండాలు దాటి అగ్రరాజ్యమైన అమెరికాలో 350 భాషలలో 11వ స్థానంగా మన తెలుగు మాట్లాడే వారి సంఖ్య గణనీయంగా పెరిగి తెలుగు వెలుగు విశ్వవ్యాప్తం అయ్యింది. గత నాలుగేళ్లలో తెలుగు మాట్లాడే వారు,తెలుగు వారు వృద్ధి శాతం అధికంగా పెరిగి మన తెలుగు స్వరం వినబడుతుంది అంటే ఎంతో సంతోషమే కదా!!*

గతంలో మన తెలుగు భాష కంటే ముందుగా భారతీయ భాషలను మాట్లాడే వారి సంఖ్య హిందీ, గుజరాతి స్థానాన్ని ఆక్రమించింది. మన దేశం నుండి అమెరికాకు ప్రయాణిస్తున్నటువంటి వారిలో తెలుగు వారి యొక్క సంఖ్య అధికంగా ఉండడం వల్ల ఈ పరిణామం జరిగిందని చెప్పవచ్చు.

ఉపాధి కోసమో, వృత్తి బాధ్యతల కోసమై అమెరికాకు పయనం అవుతున్న మన తెలుగువారు ఎక్కువగా ఉన్నారు. అప్పట్లో 2016లో కొన్ని గణాంకాలలో అప్పటి పరిస్థితులను ఉద్దేశించి నేడు 2024 తో పోలిస్తే నాలుగు రెట్లు తెలుపుతుందని సెన్సర్ బ్యూరో డేటా నివేదికలో వెల్లడి అయ్యింది అప్పట్లో మూడు లక్షల వరకు తెలుగు మాట్లాడే వారి సంఖ్య ప్రస్తుతం 12 లక్షల పైబడి చేరింది. కాలిఫోర్నియాలో 2,00,000ల మంది, టెక్సాస్ లో 1,50,000ల మంది, న్యూ జెర్సీ, ఇల్లినాయ్, వర్జినియా, జార్జియా లలో మూడు లక్షల ముప్పై వేలు గా ఉన్నారు. ప్రతి సంవత్సరం అమెరికాకు వెళుతున్న తెలుగువారి వృద్ధి ప్రతి సంవత్సరం కి పెరుగుతుంది. ఇతర దేశాల నుంచి వచ్చే వారి కంటే తెలుగువారి సింహభాగం అధికం. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ నుంచి 1,30,000 మంది విద్యార్థులు అందులో 10,000 మందికి పైగా హెచ్ వన్ బి వీసా తీసుకోవడం జరుగుతుంది. అమెరికాలో ఉండే అన్ని దేశాల వారు బయట మాట్లాడేది ఇంగ్లీష్ ఐనా మనవారు మాత్రం ఇంట్లో తెలుగే.

ఇకపోతే అమెరికాలో కష్టాలు, సుఖాలను మరోసారి తెలుసుకుంటే... క్వాలిటీ ఆఫ్ లైఫ్ లో చూసినట్లయితే బాగుంటుందని చెప్పవచ్చు. మన దేశంతో పోల్చితే అమెరికా 3 రెట్లు పెద్దదిగా ఉంటుంది. జనాభాలో మాత్రం మూడు వంతులు తక్కువే ఉంటుంది. వాతావరణ పరిస్థితులు కూడా కాలుష్య రహితంగా ఉండడం ఒక ప్రత్యేకత. ఎవరికి వారు ఎవరి పని వారు చేసుకొని పోతూ ఉంటారు. అవకాశాలు ఎక్కువే ఉంటాయి. మంచి నిర్మాణాత్మకమైనటువంటి విద్యాసంస్థలు, మైదానాలు మెరుగైన రవాణా సదుపాయాలు అక్కడి విద్యాసంస్థలు పాటించడం ప్రత్యేకత. 12 గ్రేడ్ (అంటే ఇంటర్మీడియట్ అయిపోయేంతవరకు కూడా ) వరకు విద్య ఉచితంగా ఉంటుంది. ఆ తరువాత ఉద్యోగంలో వచ్చేటువంటి పెద్ద మొత్తాల జీతాలతో ఇల్లు కొనుక్కోవడం కూడా సులభంగా ఉంటుంది. ఉద్యోగాలలో ప్రత్యేకంగా ఎవరిని కూడా పొజిషన్తో పిలవాల్సిన అవసరం కూడా ఉండదు. ఎవరినైనా గాని పేరు పెట్టి పిలవచ్చు. ఎటువంటి కులమతాలకు తావు లేకుండా జీవనం కొనసాగుతుంది. పనిమనిషి నుండి మొదలుకొని ప్రెసిడెంట్ వరకు కూడా అందరికీ సమానంగా చూడాల్సిందే. మరో ప్రత్యేకత ఏమిటంటే ప్రతి వారంలో రెండు రోజులు సెలవులుగా ఉంటుంది. కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించే అవకాశం ఉంటుంది. ఎవరి పని వారు చేసుకోవాల్సిందే పిల్లల్ని పెంచే బాధ్యత భర్త, భార్య ఇద్దరిదీ సమాన బాధ్యత ఉంటుంది. అక్కడ పరిస్థితుల్లో చూసినట్లయితే వేరే దేశాల నుంచి అక్కడికి వచ్చే వారికి ఎవరికైనా గాని సహజంగా ఆత్మీయులైన తనయులను చూడడానికి అవకాశం తక్కువ ఎక్కువ అనే విషయం మన యొక్క ఆర్థిక పరిస్థితిని బట్టి ఉంటుంది. దూర భారం,( ప్రయాణ వ్యయ ప్రయాసలు ) కలవడం గురించి అని చెప్పవచ్చు. ఏది ఏమైనా ఖండాంతరాలు దాటి అగ్రరాజ్యంలో మన తెలుగు భాష ప్రాధాన్యత పెరుగుతుందంటే మన మంతా గర్వించదగ్గ విషయం.



**డా. చిటికెన కిరణ్ కుమార్**
**రచయిత,విమర్శకులు**
**సభ్యులు, ఐ. బి. ఆర్. ఎఫ్**
**9490841284**

# భారత్‌లో సరికొత్త రికార్డు కల్కి!

*కల్కి 2898 ఏడి.. అమితా బచ్చన్ అద్భుతంగా నటించారు. 80 ఏండ్ల వయస్సులో కూడ ఆయన నటన చాలా బాగుంది. ఇక ప్రభాస్, కమలహాసన్ నటన, దీపిక పడుకొన్ ల నటన సూపర్! విజువల్స్ అద్భుతంగా ఉండటం.. పురాణాల నేపథ్యంలో సినిమా రావడంతో ఎలా ఉండబోతుందో అనే అంచనాలు అందరిలోనూ ఉన్నాయి. మరి కల్కి సినిమా నిజంగానే అంచనాల అందుకున్నది. ఇండియన్ సినిమా చరిత్ర లో మరో బాహుబలి, షోలే సినిమా ల రికార్డు లను బద్దలు కొడుతుంది, అనక తప్పదు!*

బాహుబలితో పాన్ఇండియా స్టార్‌గా మారాక ప్రభాస్ నుంచి వచ్చిన ఏ సినిమాకీ రానంత హైప్ 'కల్కి 2898ఏడీ'కి వచ్చింది. దర్శకుడిగా నాగ్ అశ్విన్ చేసింది రెండు సినిమాలే అయినా.. రెండూ గొప్ప సినిమాలు కావడం, ప్రతిష్టాత్మక వైజయంతీమూవీస్ నుంచి వస్తున్న సినిమా కావడం, నాగ్అశ్విన్ ఎంచుకున్న కథ కావడం.. అన్నింటినీ మించి అమితాబ్, కమల్ లాంటి ఆలిండియా సూపర్‌స్టార్లు ఇందులో భాగం కావడం... అద్భుతమైన కలయిక గా పేర్కొనక తప్పదు!

600కోట్ల కు పైగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 800కోట్ల బిజినెస్ ఇప్పటికే చేసింది. అసలు కథ ఏమిటంటే? 6వేల సంవత్సరాల క్రితం జరిగిన కురుక్షేత్ర సంగ్రామం చివరి అంకం నుంచి ఈ కథ మొదలవుతుంది. బ్రహ్మాస్త్ర ప్రయోగంతో ఉత్తర గర్భాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించాడు అశ్వత్థామ(అమితాబ్). కానీ కృష్ణపరమాత్మ బ్రహ్మాస్త్రానికి అడ్డుపడి అపాండవం జరగకుండా అడ్డుకున్నాడు. ఈ దుశ్చర్యకు పాల్పడ్డ అశ్వత్థామను 'మానని గాయాలతో ఇలా చావు లేకుండా పడివుండు' అని శపించాడు. అశ్వత్థామ శాపవిమోచనం అడగ్గా.. 'ఉత్తర గర్భంలోని బిడ్డను చంపడానికి ప్రయత్నించి పాపం మూటగట్టుకున్న నువ్వు.. నా వచ్చే అవతారంలో తల్లి గర్భంలో ఉన్న నన్ను కాపాడి పుణ్యాన్ని మూటగట్టుకుంటావ్.. అప్పుడే నీకు శాపవిమోచనం' అని కృష్ణుడు చెప్పాడు. ఇది జరిగిన ఆరువేల సంవత్సరాల తర్వాత అసలు కథ మొదలైంది.

కురుక్షేత్ర యుద్ధం జరిగిన 6 వేల ఏళ్ళ తర్వాత భూమి పూర్తిగా నాశనం అవుతుంది.. అధర్మంతో మరో ప్రపంచాన్ని తనకోసం సృష్టించుకుని మనుషులను పురుగుల కంటే హీనంగా చూస్తుంటాడు సుప్రీమ్ యస్కిన్ (కమల్ హాసన్). యాస్కిన్ అన్యాయాలపై శంబాల అనే ప్రపంచం నుంచి యుద్ధం చేస్తుంటారు కొందరు రెబెల్స్. కాలక్రమేనా మనుషులు ప్రకృతిని నాశనం చేస్తుండటంతో.. కాంప్లెక్స్ పేరుతో కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తాడు యస్కిన్. అక్కడ కొంతమందికి మాత్రమే ప్రవేశం ఉంటుంది. అక్కడికి వెళ్లాలని ఎంతోమంది ప్రయత్నిస్తుంటారు. అందులో భైరవ (ప్రభాస్) కూడా ఒకడు. కాంప్లెక్స్‌లోకి వెళ్లలన్నది అతడి కల. మరోవైపు అన్యాయాలు పెరిగిపోవడంతో దేవుడు మళ్లీ కల్కి అవతారంలో జన్మిస్తారని శంబాలా ప్రజలు నమ్ముతుంటారు. తమ దేవుడికి జన్మనిచ్చే అమ్మ కోసం చూస్తున్న వాళ్లకు.. సుమతి (దీపికా పదుకొనే) కనిపిస్తుంది. ఆమె యస్కిన్ ప్రపంచం నుంచి తప్పించుకుంటుంది. సుమతిని తమకు పట్టిస్తే కాంప్లెక్స్‌లోకి ప్రవేశం కల్పిస్తామని కమాండర్ మానస్ (శశ్వతా ఛటర్జీ) భైరవతో ఒప్పందం కుదుర్చుకుంటాడు. అప్పుడు భైరవ బారి నుంచి సుమతిని రక్షించే బాధ్యతను అశ్వత్థామ (అమితాబ్ బచ్చన్) తీసుకుంటాడు. అసలు అశ్వద్ధామ ఎక్కడ్నుంచి వచ్చాడు..? కురుక్షేత్ర యుద్ధం జరిగిన 6 వేల ఏళ్ళ తర్వాత కూడా అశ్వద్ధామ ఎలా బతికి ఉంటాడు..? ఆయనేం చేసాడు..? సుమతిని ఎలా కాపాడాడు.. శంబాల ప్రజల్ని కాపాడాడా లేదా అనేది అసలు కథ..నిజంగా సుమతి ని కాపాడే దృశ్యం, చిత్రికరణ అద్భుతంగా జరిగింది. అమితాబ్, ప్రభాస్ మధ్యన ఫైట్స్ దృశ్యాలు అలరించాయి.చిత్రంలో అన్నీ అద్భుతాలే వాటిని ఆస్వాదించాలి. తెలుగు ఇండస్ట్రీలో కల్కి అలాంటి ఒక అద్భుతం. మహాభారతంలోని పాత్రలు తీసుకొని.. మన పురాణాలకు లింక్ పెడుతూ.. రెండు సరికొత్త ప్రపంచాలను సృష్టించాడు దర్శకుడు నాగ్ అశ్విన్. అది సక్సెస్ అయ్యిందా..? లేదంటే సాగదీసాడా..? ఇవన్నీ పక్కన పెడితే.. ముందు ఆ ఆలోచన విధానానికి, చిత్రం కథ, స్క్రీన్ ప్లే,.విజువల్ ఎఫెక్ట్స్ అద్భుతం! ఫస్టాఫ్ లో చివరి 20 నిముషాలు బోరింగ్ అనిపించినా, సెకండాఫ్ చాలా ఆసక్తి రేపుతుంది. మొత్తంగా ఏమి జరుగబోతుంది, అనే ఆసక్తి పాఠకునికి కలుగుతుంది.నెక్స్ట్ లెవెల్. మరీ ముఖ్యంగా మహాభారతం ఎపిసోడ్ వచ్చిన ప్రతిసారి గూస్ బంప్స్ గ్యారంటీ. ఒక్కొక్క క్యారెక్టర్ ప్రవేశం అద్భుతంగా ఉంది. దిశాపఠాణి పాత్ర చిన్నది అయినా చాలా బాగా చేసింది. అశ్వద్ధామ క్యారెక్టర్ మనల్ని ఎక్కడికో తీసుకుని వెళుతుంది.ఇదో కాం ప్లికేటెడ్ కథ అనిపిస్తుంది.రెండు ప్రపంచాలను సృష్టించి వాటి నడుమ లింకు పెడుతూ కథ రాసాడు!ప్రభాస్ ఫ్యాన్స్ కోసం ఈ సినిమా పండుగ చేసుకునే విధంగా ఉంది. ఆయనకు యాక్షన్ సీన్లు ఎక్కువ పెట్టారు. బుజ్జి, భైరవ కెమిస్ట్రీ చిత్రానికి హైలెట్!. సినిమాలో ప్రభాస్ కు హీరోయిన్ . బుజ్జినే. సినిమా అంతా ఒకెత్తు అయితే.. మొదటి, చివరి 15 నిమిషాలు మరొక ఎత్తు. క్లైమాక్స్ అయితే జస్ట్ ఎక్స్పీరియన్స్ చేయాలంతే.. మాటల్లేవు. ఫస్టాఫ్ కారెక్టర్స్ ఇంట్రోస్ కోసం చాలా నెమ్మదిగి సాగింది. దానికితోడు ప్రభాస్ సీన్స్ కూడా పెద్దగా అనిపించవు. దిశా పటానీ, ప్రభాస్ ఎపిసోడ్ కూడా అంతగా ఎక్కలేదు.. అదేదో టైమ్ పాస్ కోసం పెట్టినట్లు అనిపిస్తుంది. ఇంటర్వెల్ నుంచి సినిమా ఊపందుకుంటుంది. ముఖ్యంగా దేవుడి రిఫరెన్స్ తీసుకున్న ప్రతీసారి అదరగొట్టాడు నాగ్ అశ్విన్. చివరి 15



నిమిషాలు కూడా సినిమా ఆ స్థాయికి వెళ్లడానికి అదే కారణం.

**నటీనటులు:**

ప్రభాస్ మరోసారి అదరగొట్టాడు.. కామెడీ పోర్షన్ కూడా తనే తీసుకున్నాడు. సినిమా అంతా ఒకెత్తు అయితే.. క్లైమాక్స్‌లో కనిపించే ప్రభాస్ మరో ఎత్తు. ఈ సినిమాకు అసలైన హీరో అమితాబ్ బచ్చన్.. ఆయన కాకుండా అశ్వద్ధమగా ఇండియాలో ఇంకే నటుడు సరిపోడు. కథను తన భుజాలపై మోసాడు బిగ్ బి. కమల్ హాసన్ ఉన్నది కాసేపైనా మ్యాజిక్ చేశాడు. దీపికా పదుకొనే క్యారెక్టర్ కూడా బాగానే ఉంది. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, మృణాళ్ ఠాకూర్ కామియోస్ బాగున్నాయి. మానస్‌గా శశ్వతా ఛటర్జీ యాక్టింగ్ బాగుంది. పశుపతి, శోభన సహా మిగిలిన వాళ్ళంతా ఓకే..

**టెక్నికల్ టీం:** కల్కి సినిమాకు ప్రాణం నేపథ్య సంగీతం. సంతోష్ నారాయణన్ అందించిన మ్యూజిక్ అదిరిపోయింది. సినిమాటోగ్రఫీ కూడా నెక్స్ట్ లెవల్ అంతే. ఇక విజువల్ ఎఫెక్ట్స్ పరంగా ఇండియాకు ది బెస్ట్ సినిమా ఇచ్చాడు నాగ్ అశ్విన్. ఈ విషయంలో నూటికి 100 మార్కులు వేయొచ్చు కల్కి 2898 సినిమాకు. తన ఇమాజినేషన్‌కు సరైన రూపం ఇచ్చాడు. ఎడిటింగ్ కాస్త వీక్ అనే చెప్పాలి. అయితే కథను నడిపించే క్రమంలో ఆ స్లో నెస్ తప్పదు కాబట్టి దర్శకుడిని కూడా తప్పు బట్టలేం. దర్శకుడిగా నాగ్ అశ్విన్ ఆలోచనలు అద్భుతం. దాన్ని ఆయన సాకారం చేసుకున్నారు కూడా. అంత కాంప్లికేటెడ్ కథను చాలా బాగా చెప్పాడు ఈ దర్శకుడు. టెక్నికల్ గా కల్కికి తిరుగులేదు.ఓవర్ ఆల్ గా కల్కి ఒక టెక్నికల్ గా రూపొందించిన భారీ బడ్జెట్ చిత్రం! విజువల్స్ ప్రదానం గా ఇందులో తీసుకున్న రిస్క్ కనిపిస్తుంది. మొత్తానికి ప్రభాస్ కు మంచి సూపర్ డూపర్ హిట్ లభించింది, అని పేర్కొనక తప్పదు, మూడు దశాబ్దాల తరువాత అమితాబచ్చన్, కమల్ హాసన్ కలిసి నటించారు. వారిద్దరితో కలిసి నటించే అవకాశం ప్రభాస్ కు లభించడం కూడా అదృతమే! ఇదో మల్టి స్టారర్ వండర్స్ చిత్రం!

**-ఎండి. మునీర్, సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,**
**9951865223,**

# ఉర్రూతలూగించిన వందేమాతరం

స్వాతంత్యోద్యమంలో కోట్లాది భారతీయులను ఉర్రూతలూగించిన వందేమాతరం గీత రచయిత బంకించంద్ర చటర్జీ. ఆనందమఠం అనే నవలలో మాతృభూమిని దుర్గాదేవితో పోలుస్తూ ఈ స్తోత్రాన్ని వ్రాశారు. ఆయన బెంగాలీ భాషలో ఇంకా అనేక నవలలు, కథలు, కథానికలు రచించారు. బంకించంద్ర జూన్ 27, 1838న బెంగాలు రాష్ట్రంలోని నైహతి అనే గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు యాదవ చంద్ర చటర్జీ, దుర్గాదేవి. యాదవ చంద్ర చటర్జీ మిడ్నాపూర్ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. బంకించంద్ర విద్యాభ్యాసం హుగ్లీ మరియు కలకత్తాలో జరిగింది. 1857లో కలకత్తా ప్రెసిడెన్సి కాలేజి నుంచి డిగ్రీ పొందారు. తండ్రివలేనే బంకించంద్ర కూడా డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. 1891లో డిప్యూటీ మెజిస్ట్రేటుగా పదవీ విరమణ చేశారు. వారి ఉద్యోగ సమయంలో ఎప్పుడు బ్రిటిష్ అధికారులకు తలవంచలేదు. బెంగాలీ భాషలో మొదటి నవల దుర్గేష్ నందిని 1865లో బంకించంద్ర రచించారు. 'బంగదర్శన్' అనే మాస పత్రికను ఏప్రిల్ 1872లో ఆయన ప్రారంభించారు. వందేమాతర గీతం అనగానే బంకించంద్ర ఛటర్జీ స్ఫురినిస్తారు.ఆ ప్రఖ్యాత రచయిత ఒక సందర్భంలో రామకృష్ణ పరమహంసను దర్శించుకోగా, 'నీ జీవన లక్ష్యం ఏమిటి? ' అనడిగారాయన. 'కుటుంబ పోషణ' అన్నారు బంకించంద్ర. పరమహంస తీవ్రంగా స్పందిస్తూ 'ముల్లంగి తింటే ఆ త్రేన్పులే వస్తాయి. సంసారమే సర్వమని భావిస్తే ఆలోచనలు ఇలాగే ఉంటాయి' అని, ఆధ్యాత్మిక జీవన ప్రాముఖ్యం గురించి చెప్పారు. పరమహంస సాంగత్యంతో బంకించంద్రుని ఆలోచనా ధోరణెళి మారిపోయింది. మనసు ప్రాపంచిక విషయాల నుంచి ఆధ్యాత్మికత వైపు మరలి, క్రమంగా వేదాంతిగా మారిపోయారు. లౌకిక కథనాలతో కూడిన సాహిత్యాన్ని వదిలేశారు. దైవచింతన పెంచుకుని ఆధ్యాత్మిక రచనలు చేస్తున్న రోజుల్లో ఒకసారి బంకించంద్ర తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. అయినా శరీర అస్వస్థతను పట్టించుకోకుండా ఆధ్యాత్మిక గ్రంథ పఠనంలో లీనమయ్యారు. అప్పుడో ప్రముఖ వైద్యుడు వారి ఇంటికి వచ్చి 'ఔషధం' తీసుకోకపోతే ఎలా ప్రాణాపాయాన్ని కొనితెచ్చుకుంటారా? !' అంటూ హెచ్చరించారు. దానికి స్పందిస్తూ బంకించంద్ర 'మందులు తీసుకోకపోవటమేంటి! రోజూ ఒక ఔషధాన్ని వాడుతున్నానే!' అన్నారు. వైద్యుడు ఆశ్చర్యంగా 'ఏదీ చూపండి' అనడిగారు. 'ఇదిగో' అంటూ చెంతనే ఉన్న భగవద్గీత చూపి, 'పారమార్థిక అన్వేషణకే కాదు, ప్రాపంచిక రుగ్మతలకూ ఇంతకంటే దివ్య ఔషధం లేదు' అన్నారు.

# ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే ధ్యేయం



## సొంతగూటికి చేరిన చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, జూన్ 28 (జనంసాక్షి)**

చేవెళ్ల బిఆర్ఎస్ ఎమ్మెల్యే కాలే యాదయ్య తిరిగి సొంత గూటికి చేరారు. కాంగ్రెస్ పార్టీ నుండి నవాబ్ పేట ఎంపిపి, జెడ్పీటీసీగా చేశారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమిపాలైయ్యారు. ఆ తరువాత 2014 లొ కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన ఎమ్మెల్యే కాలే యాదయ్య అప్పటికె అధికారంలో బిఆర్ఎస్ఎస్ పార్టీలో చేరారు. 2018 మరియు 2023 రెండు ధపాలుగా బిఆర్ఎస్ పార్టీ నుండి గెలుపొందారు. ఆయన శుక్రవారం బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ దీపా దాస్ మున్షీ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే కాలే యాదయ్యకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సంపత్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు





**కొల్లాపూర్ / నాగర్ కర్నూల్ బ్యూరో, జూన్ 28(జనంసాక్షి):**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పథకం ద్వారా ఖరీఫ్ కు ప్రతి ఎకరానికి సాగు నీరు అందించాలని, రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఇరిగేషన్ అధికారులతో కలిసి కొల్లాపూర్ ప్రాంతంలోని నర్లాపూర్ వద్ద పాలమూరు ప్రాజెక్టు పనులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపుల పురోగతిని మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాపాలన లో ప్రతీ ఎకరాకు రైతులకు సాగునీరు అందించాలన్నదే మా ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కే ఎల్ ఐ ద్వారా ఖరీఫ్ సీజన్లో రైతులకు ప్రతి ఎకరానికి సాగునీరును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అందించాలన్నదే తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రాజెక్టులు కట్టడం ఎంత ముఖ్యమో ప్రతీ రైతు యొక్క పొలంలోకి సాగు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యంమని, చివరి ఆయకట్టుకు సాగునీరందించడానికి చిత్తశుద్ధితో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు కెనాల్స్ ను పరిశీలించి వారంరోజుల్లో పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కెనాల్స్ పూడిక, పిచ్చి మొక్కలను తొలగించేందుకు వ్యయ అంచనాలు రూపొందించి పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఫీల్డ్ చానల్స్ కు రైతులు సహకరించాలని సూచించారు. ఫీడల్ కెనాలను పూడ్చి వేస్తే సంబంధిత రైతులపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్దార్ తిప్ప ప్రాజెక్ట్ క్రింద ఉన్న ఆయకట్టుకు నీరందించడానికి బాచారం కాలువ సర్వే చేసి సాధ్యసాధ్యాలు పరిశీలించి నివేదికలను రూపొందించి ఇవ్వాలని మంత్రి సూచించారు పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ను త్వరగా పూర్తి చేయాలని, కృష్ణా జలాల నుంచి మన పూర్తిస్థాయి వాటాను ఉపయోగించుకివాలని ఆయన సూచించారు. మోటార్లు త్వరగా బిగించి,పనులు త్వరగా పూర్తి చేయాలని, పనుల పురోగతి కంట్రోల్ రూమ్ ను ఆయన పరిశీలించారు నార్లాపూర్ నుంచి మిషీన్ భాగీరథి పనులు పంప్ హౌస్ పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టు కింద కోల్పోయిన గ్రామాల ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ద్వారా బోడబండ, సున్నపు తాండ, అంజనా గిరి తండ, ఒడ్డే గుడిసెలు, దుల్యానాయక్ తాండ పునరావాస గ్రామాలకు పునరావాస సౌకర్యాలు రహదారులు ఎల్లూరు నుంచి నార్లాపూర్ ఎల్లూరు నుంచి మొల చింతలపల్లి రహదారుల ఇండ్ల స్థలాలు, మౌలిక వసతులు, కల్పించాలని సూచించారు. మంత్రి వెంట సీఈ విజయ భాస్కర్ రెడ్డి, ఎస్ఇ సత్యనారాయణ రెడ్డి, ఈఈలు శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, మురళీ, శ్రీకాంత్ , పార్ధసారధి తదితరులు పాల్గొన్నారు.



## ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్ జూన్ 28 (జనం సాక్షి)**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్‌లో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను ఎమ్మెల్యే కేపీ వివేకానంద శుక్రవారం అధికారాలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల అభివృద్ధి కోసం కేటాయించిన ఖాళీ స్థలంలో ఇండోర్ స్టేడియం ,పార్కులు తదితర ప్రజా అవసరాల కోసం అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, యూసుఫ్, ప్రభాకర్, ఎస్సార్ నాయక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు టిటికే శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, బాబి, పూర్ణచందర్ గుప్తా, శేషాచారి, భాస్కర్ రెడ్డి, అనిల్, రమణ, రామకృష్ణ, దుర్గారావు, కిరణ్, రాజు, హరిబాబు, వర్మ, రామస్వామి, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలి



- **ఆస్పత్రి వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

తాండూరు జూన్ 28(జనంసాక్షి)

ఆసుపత్రికి వచ్చే పేసెంట్ లకుమెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు ,సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డును సునిశితంగా పరిశీలించి అక్కడి పరిస్థితులు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఎంత మంది ఉన్నారు, ప్రతి రోజు ఎంత మంది పెషేంట్‌లు వస్తారని పూర్తి వివరాలుఅడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలతో వచ్చే పేషెంట్లకు వెంటనే మెరుగైన చికిత్సలు అందించే విధంగా డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.మహిళా, పురుషుల వార్డ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్స్ నమోదు వివరాలు తెలిపే వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రదీప్, ఆర్‌డిఓ శ్రీనివాస్, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి ఎమ్మెల్యే అరికెపూడి ఆర్థిక ప్రోత్సాహం..!



**శేరిలింగంపల్లి, జూన్ 28 (జనంసాక్షి) :**

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో విద్యనభ్యసిస్తున్న ఓ నిరుపేద విద్యార్థినికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శుక్రవారం ఆర్థిక చేయూతను అందించారు. ఈ మేరకు ఆఫీస్ పెట్ డివిజన్ పరిధి హుడా కాలనీకి చెందిన మాజీ దివంగత ఉద్యమకారుడు రామ్ కుమార్, లతా దంపతుల కుమార్తె ధరణి ప్రస్తుతం పదవ తరగతి చదువుతూ ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతుంది. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రామ్ కుమార్తె ధరణిని పిలిపించి స్కూల్ ఫీజు నిమిత్తం 20 రూపాయల చెక్కును అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రామ్ కుమార్ తెలంగాణ ఉద్యమకారుడే కాకుండా... బిఆర్ఎస్ పార్టీ నిర్మాణం కోసం, పార్టీ గెలుపు కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. చదువు విషయంలో ఎల్లప్పుడూ మంచి దృక్పథాన్ని కలిగి ఉంటామని, చదువుకోవడానికి పేదరికం, డబ్బులోటు ఎప్పుడు అడ్డుకాకూడదని స్పష్టం చేశారు. పేదరికం విద్యార్థులకు ఎప్పుడు శాపంగా మారకూడదని, విద్యతోనే సామాజిక స్థితిగతులను మార్చడం సాధ్యపడుతుందని తాను భావించి నిరుపేద విద్యార్థులకు బలవంతు సహాయ సహకారాలు స్వచ్ఛందంగా అందిస్తూ ఉంటానని తెలియజేశారు. ఎంతో కష్టపడితే గాని ఇద్దరం ముందుకు వెళ్లలేరని, 10వ తరగతి చదువుతున్న విద్యార్థినికి చదువు ఆగిపోకూడదని తనకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మిద్దెటల మల్లారెడ్డి, ధరణి తల్లి శ్రీలత, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన నిధులతో పనులను ప్రారంభించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్**



**కొడంగల్ జూన్28(జనం సాక్షి):**

కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి కి కడ క్రింద ఇప్పటికే మంజూరైన నిధులతో పనులను ప్రారంభించాలని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అధికారులకు సూచించారు.శుక్రవారం కొడంగల్ కడ కార్యాలయం లో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై నారాయణపేట్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తో కలిసి నారాయణపేట్, వికారాబాద్ జిల్లాల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు తమ శాఖలకు నిర్దేశించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు. మంజూరు అయిన పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులకు ప్రారంభించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల విస్తరణ, రోడ్ల బలోపేతంకు సంబంధించి పంచాయతి రాజ్, ఆర్ అండ్ బి శాఖల ఇంజనీయర్లు ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. వివిధ కాలేజీల నిర్మాణం నిమిత్తం భూసేకరణ చేపట్టాలని, భూసేకరణ విషయంలో ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. కొడంగల్‌లో ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల నిర్మాణాల నమూనాలు, వైద్యుల నియామకానికి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. మిషన్ భగీరథ కింద ప్రతి ఇంటికి మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సమీక్షా సమావేశంలో కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,వివిధ శాఖల అధికారులు, డిసిహెచ్ఎస్ ప్రదీప్, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- **మండల అభివృద్ధికి 2.17 కోట్లలతో శంకుస్థాపనలు**
- **అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**నందిగామ, జూన్ 28 (జనంసాక్షి)**

కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.షాద్ నగర్ నియోజక వర్గంలో నందిగామ మండలంలో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నందిగామ మండల పరిషత్ అధ్యక్షురాలు ఎం. ప్రియాంక శివశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలలో శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు జరిగాయి. నందిగామ మండల పర్యటనలో భాగంగా మండల కేంద్రంతో పాటు అంతి రెడ్డి గూడ , నరసప్ప గూడ, చేగుర్ గ్రామాల్లో పర్యటించి ఆయా పనులకు సంబంధించి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసినట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. నందిగామ మండల కేంద్రంలో మన ఊరు మన బడి క్రింద 22 లక్షల రూపాయలతో మంజూరైన ప్రైమరీ స్కూల్ ను ఎమ్మెల్యే శంకర్ ప్రారంభోత్సవం చేశారు. అదేవిధంగా నందిగామ మండల కేంద్రంలో ఎస్‌డిఎఫ్ నిధులు రూ.1 కోటి రూపాయలతో నిర్మించే మండల ప్రజా పరిషత్ కార్యాలయం నూతన భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండలం ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు.అలాగే మహిళా సమాఖ్య భవనం, కిచెన్ షెడ్‌ను నిర్మించుటకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా అంతి రెడ్డిగూడెం గ్రామంలో ఎస్‌డిఎఫ్ నిధులు 25 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మించటకు ఎమ్మెల్యే శంకర్ జిల్లా పరిషత్ చైర్పర్సన్ అనితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.అంతి రెడ్డిగూడెం గ్రామంలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రం భవనం ఈ సందర్భంగా వారు ప్రారంభించారు. అదేవిధంగా మండలంలోని నరసప్ప గూడ లో హెచ్‌ఎండిఏ నిధులు 5 లక్షలతో నిర్మించే సిసీ రొడ్డులకు శంకుస్థాపన చేశారు. చేగూర్ గ్రామంలో హెచ్‌ఎండిఏ నిధుల ద్వారా మంజూరైన దాదాపు 15 లక్షల సిసి రోడ్డులను ఎమ్మెల్యే శంకర్ ప్రారంభోత్సవం చేశారు. నందిగామ మండల పర్యటనలో భాగంగా దాదాపు 2.17 కోట్ల రూపాయల పనులకు సంబంధించి ప్రారంభోత్స వాలు, శంకుస్థాపనలు చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధికి నయవంచన లేకుండా కృషి చేస్తానని దానికి ప్రతి ఒక్కరు సహకరించాలని అందరి సహకారంతోనే పూర్తిస్థాయిలో అభివృద్ధి రేవంత్ రెడ్డి పాలనను తెలంగాణ రాష్ట్రంతో పాటు షాద్ నగర్ నియోజకవర్గం కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్‌తో పాటు మండల ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీడీవో, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అర్ధంతరంగా ఆగిన బ్రిడ్జిలు వెంటనే పూర్తి చేయాలి

**ఇబ్రహీంపట్నం, జూన్ 28(జనం సాక్షి):**

ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని శ్రీ ఇందు కళాశాల వద్ద అర్ధంతరంగా ఆగిన బ్రిడ్జిలు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం.ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథులుగా బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు యాదిష్ , బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రవీందర్ రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షులు నర్సింహారెడ్డి శ్రీశైలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,,బ్రిడ్జి నిర్మాణం లేక చాలా ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు.గత సంవత్సరం కాలం నుండి నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోవడం చాలా నాయకుల చేతగాని తనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసంపూర్తి బ్రిడ్జి నిర్మాణం వల్ల ఇప్పటికే చాలామంది తీవ్ర గాయాల పాలయ్యారని, అంతేకాకుండా ఇటీవల వ్యక్తి కూడా మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు..ఇంత జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం నాయకులు స్పందించి అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ వన్నవాడ రవీందర్ రెడ్డి రాష్ట్ర నాయకులు శాంతికుమార్ ,బీజేవైఎం జిల్లా మరియు మండల నాయకులు విజయ్ కుమార్, ఐలేష్, మహేష్, శేఖర్ రెడ్డి, వినయ్, నర్సింహారెడ్డి, రాజు, విష్ణు, రఘు, శశి, సందీప్, బీరప్ప, వెంకటేష్, లింగం శ్రీకాంత్, కృష్ణ, శ్రీశైలం పాల్గొన్నారు.

## నీట్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

### ఎంపీ ఈటల రాజేందర్ ఇంటిముందు యువజన విద్యార్థి సంఘాల ధర్నా




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 28 (జనంసాక్షి)**

నీట్ పేపరు లీకేజీల వల్ల నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలి అన్ని, ఎంపీ ఈటల రాజేందర్ పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తవించాలని, పేపర్ అవకతవకలు, లీకేజీల నిర్లక్ష్యం వహించిన కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి అన్ని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగ సంఘాల నాయకులు రాథోడ్ సంతోష్, రాహుల్ యాదవ్, సత్యప్రసాద్ లు మాట్లాడుతూ.. నీట్ పరీక్ష ఫలితాలను తక్షణమే రద్దు చేసి, పరీక్షను మళ్ళీ నిర్వహించాలని, బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ ఇంటి దగ్గర ర్యాలీ,ధర్నా బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు ఖబర్దార్ మోడీ ప్రభుత్వం అంటూ నినాదాలు చేశారు. నీట్ పరీక్ష లీకేజీపై కేంద్రం స్పందించకుండా, ఎవరైతే గ్రేస్ మార్కులు పొందారో, వారి స్కోర్ కార్డులు రద్దు చేసి, వారికి మళ్ళీ రీ ఎగ్జామ్ నిర్వహించడం అంటే నీట్ అవకతవకలు ప్రక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. దీని వల్ల నీట్ ర్యాంకులు తారుమారు అయ్యి గందరగోళం ఎర్పడుతుంది. నీట్ పరీక్షపై ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయి. వాటిని నివృత్తి చేయకుండా ఎన్‌టిఏ ఎకపక్షంగా వ్యవరిస్తుంది. పరీక్ష కంటే ముందు రోజు బీహార్ రాష్ట్రంలో పాట్నాలో 13 మందిని పేపర్ లీకేజీ విషయంలో అరెస్టు చేశారు, హర్యానాలో కూడా ఒకే సీరియల్ నెంబర్ కల్గిన ఎనిమిది మంది విద్యార్థులకు టాప్ ర్యాంకులు వచ్చాయి. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రలలో కూడా ఇలాంటి లీకేజీ అంశాలు ముందుకొచ్చాయని వాటిపై విచారణ జరపకుండా కేవలం గ్రేస్ మార్కులు మాత్రమే రద్దు చేసి, రీ ఎగ్జామ్ పెట్టడం అంటే నీట్ అవకతవకలు ప్రక్కన పెట్టి విస్మరించడం అవుతుంది. కేంద్రం, బిజెపి పాలిత రాష్ట్రలలో మాత్రమే నీట్ ర్యాంకులు, పేపర్ లీకేజీ ఆరోపణలు ఉన్నాయన్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్ళీ పరీక్ష నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, శ్యామ్ రావు, శివ, శివాజీ నాయక్ విద్యార్థి యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన దరఖాస్తులను ఆయా కేంద్రాల్లో సరి చేసుకోండి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్ రూరల్ జూన్ 28 (జనం సాక్షి)**



ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఏవైనా సవరణలు చేసుకోదలచిన వారు ప్రజా పాలన సేవ కేంద్రాల్లో సరి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక తెలిపారు. ప్రజా పాలన సేవ కేంద్రాలను మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయంలో, మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో వివిధ పథకాలకు ప్రజా పాలనలో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, కొందరు అర్జీదారులు దరఖాస్తుల్లో తప్పులు దొర్లిన సందర్భంగా అర్హులైన వారు లబ్ధి పొందకుండా ఉన్నారని ఆయన తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా ప్రజా పాలన పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు వీలుగా తప్పులను సరి చేసేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. గృహ జ్యోతి కింద విద్యుత్ బిల్లు, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పొందని పక్షంలో రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు లు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రసీదుతో పాటు ప్రజాపాలన సేవా కేంద్రాల వద్దకు వెళ్లి తమ దరఖాస్తులో ఉన్న తప్పులను సరి చేసుకొని అర్హులైన అర్జీదారులు ప్రజా పాలన పథకాల ఫలితాలను పొందాలని కలెక్టర్ తెలిపారు.

# ధరణి సమస్యలను పరిష్కరిస్తాం



## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**వెల్దుర్తి జూన్ 28 (జనంసాక్షి)**

జిల్లా వ్యాప్తంగా ధరణి ద్వారా భూసమస్యల పరిష్కారానికై రైతులు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 12 వేల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు అన్నారు. శుక్రవారం వెల్దుర్తి లోని తాసిల్దార్ కార్యాలయం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పశు వైద్య ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు అనంతరం మాట్లాడుతూ జిల్లాలో రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. ఇందులోముఖ్యంగా పార్ట్ బి కోర్టుకేసులో ఉన్న భూత తగాదాలు, కుటుంబ గొడవల్లో ఉన్న భూములు పరిష్కారం కోసం చేసుకున్న దరఖాసులే ఎక్కువగా ఉన్నాయన్నారు. కొన్ని భూములు ఎల్లారీస్లో ఉన్నట్లు తెలిపారు. ఇందులో ఇప్పటికే చిన్నచిన్న సమస్యలు ఉన్న వాటిని వారం రోజుల క్రితమే పరిష్కరించామన్నారు. గతంలో భూసమస్యల పరిష్కారం కలెక్టర్ స్థాయిలో ఉండేదని ప్రస్తుతం నేరుగా పరిష్కరించేందుకు ఆర్డీవో లాగిన్ ద్వారా తహసిల్దార్ కార్యాలయంలోనే సమస్యలను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయ రికార్డ్ గదిని, భూములు రిజిస్ట్రేషన్ ధరణి కేంద్రాన్ని పరిశీలించారు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో తనిఖీ చేసి ఆస్పత్రి రికార్డులతో పాటు మందుల పంపిణీ రిజిస్టర్ను అలాగే రోగులకు సక్రమంగా వైద్యంతో పాటు ఉచిత మందులు ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పశు వైద్య ఆస్పత్రి తనిఖీ చేసి మూగజీవాలకు అందజేసే మందులను పరిశీలించి ఆసుపత్రి పనితీరును డాక్టర్ రేఖను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేసే రుణమాఫీపై తమకు ఎలాంటి గైడెన్స్ రాలేదని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తులసీరామ్, ఎంపీడీవో విశ్వేశ్వర్ వైద్యురాలు సౌజన్య అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో జూన్ 28 (జనంసాక్షి)**



వనపర్తి జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి నార్కోటిక్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించగా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న గంజాయి సాగు కేసులు, మాదక ద్రవ్యాలు వాడుతున్న వారి కేసులపై ఆరా తీయగా డిఎస్పీ కృష్ణ కిషోర్ వివరాలు తెలిపారు. 2016 నుండి జిల్లాలో (3) గంజాయి సాగు చేస్తున్న వారిపై కేసులు ఉన్నాయని, వాడిన వారు 17 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. స్పందించిన జిల్లా కలెక్టర్ గంజాయి సాగు పై వ్యవసాయ విస్తీర్ణాధికారుల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సాగును గుర్తించాల్సిన బాధ్యత ఏ.ఈ.ఒ ల పై ఉందన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో యాంటి డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని, కమిటీలు ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి ధ్రువీకరణ చేసి ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అన్ని సంక్షేమ హాస్టళ్లలో ను, గురుకుల, కేజిబివి ల్లోనూ కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల ఉత్పత్తి కానీ వాడకం కానీ జరిగినట్లు తెలిస్తే 8712671111 టోల్ ఫ్రీ నెంబర్కు ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం వాటి అనర్థాల పై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత గంగ్వార్, డిఎఫ్ఓ నవీన్ రెడ్డి, ఆర్డీఓ పద్మావతి, డిఎస్పీ కృష్ణ కిషోర్, అబ్కారీ శాఖ సుపటిండెంట్ ప్రభు వినయ్, రవాణా శాఖ అధికారి మానస, విద్యా శాఖ అధికారి గోవిందరాజులు, సంక్షేమ శాఖ అధికారులు, డ్రగ్ ఇన్స్పెక్టర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

**నాగర్ కర్నూల్ ఆర్సీ జూన్ 28(జనంసాక్షి):**

నాగర్ కర్నూల్ ప్రభుత్వం దివ్యాంగులకు ప్రత్యేక వసతులు కల్పించడం జరుగుతుందని వారిని ఆదుకోవడమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు సదరన్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సముదాయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలోని ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి వారు దివ్యాంగులకు పరికరాలతో పాటు స్కూటీలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రంగాలలో రాణించి అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పైరవి కారుల మాటలు నమ్మొద్దు

- జులై తర్వాత కళ్యాణ లక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం
- కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో జూన్28 (జనంసాక్షి)**

కళ్యాణ లక్ష్మి చెక్కులను ఇప్పిస్తామని చెబుతూ డబ్బులు వసూలు చేసే పైరవీ కారులను నమ్మకూడదని, నేను కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతోందని ఎక్కడ ఎవరికి ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దమందడి మండల పరిధిలోని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 36 మందికి షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, చెక్కులు మంజూరయ్యాయని, పెండింగ్లో ఉన్న మరో 105 చెక్కులను త్వరలోనే అందిస్తామని ఎంఎల్ఏ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ



నిరుపేద కుటుంబాలలోని ఆడబిడ్డల ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఉండాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఘు ప్రసాద్, జడ్పిటిసి రఘుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ భారతి, సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి ఎంపీడీవో సద్గుణ, ఎంపీటీసీలు మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు



## జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం దామరగిద్ద మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతూ వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరిగేలా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి అవసరం అయ్యే మందులు, తదితర వాటిపై చర్చించారు. అయితే ఆస్పత్రికి ఆలస్యంగా వచ్చిన వైద్యురాలికి కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

# పోలీస్ ఉద్యోగం మహోన్నతమైనది

- ఉద్యోగికి పదవి విరమణ అనివార్యం
- ఎస్పి యోగేష్ గౌతం

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**



ఉద్యోగులకు పదవి విరమణ అనివార్యమని శేష జీవితం ఆనందంగా గడపాలనీ నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతం అన్నారు. పోలీస్ శాఖలో తేది:30.06.2024 నాడు పదవి విరమణ పొందుతున్న అదనపు ఎస్పీ నాగేంద్రుడుని, కంట్రోల్ రూమ్ ఎస్సై వేమన్న లని జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ ,పోలీసు అధికారులు, సిబ్బంది పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందించారు. అదనపు ఎస్పి నాగేంద్రుడు 1992 బ్యాచ్ ఆర్ ఎస్సీ5గా సెలెక్ట్ అయి వివిధ హోదాలో వివిధ జిల్లాలలో 32 సంవత్సరాల, 8 నెలల సర్వీస్ పూర్తి చేసుకుని ఈరోజు పదవి విరమణ పొందారు. కంట్రోల్ రూమ్ ఎస్సై వేమన్న1984 బ్యాచ్ కానిస్టేబుల్గా సెలెక్ట్ అయి వివిధ హోదాలో పదవులు పొంది 9 పోలీస్ స్టేషన్లో 41 సంవత్సరాల 05 నెలలు పనిచేసి నేడు ఎస్సైగా పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా రిటైర్డ్ పొందుతున్న అధికారులు తమ సర్వీసు కాలంలో పనిచేసిన విధానాన్ని గుర్తు చేసుకొని, పోలీసు ఉద్యోగం ద్వారా ప్రజలకు సేవలు అందించడం జీవితంలో అత్యున్నత ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ సమాజంలో ఎన్ని సమస్యలు ఎదురైనా వాటిని పరిష్కరిస్తూ శాంతియుత వాతావరణంలో ప్రజలు జీవించే విధంగా సేవలందించే అవకాశం పోలీస్ ఉద్యోగం ద్వారా లభిస్తుందని, పోలీస్ ఉద్యోగం ఎంతో ఉన్నతమైనదని పదవీ విరమణ తర్వాత ప్రజలలో పోలీసుల గౌరవం పెరిగే విధంగా వారితో మమేకం కావాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లు రియాజ్, నాగర్ కర్నూల్ ఎస్పీ భరత్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సిఐలు శివ శంకర్, రామ్ లాల్, రాజేందర్ రెడ్డి, సోమ నర్సయ్య, ఆర్ ఐ4 నరసింహ, ఆర్ఎస్ఐ శివశంకర్, ఎస్సైలు పోలీస్ సిబ్బంది,అర్ముడు రిజర్వు పోలీసు సిబంది డిపిఓఎస్బి, డిసిఆర్బీఐటి కోర్ స్టాఫ్, రిటైర్మెంట్ పొందుతున్న అధికారుల బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై పూర్తిస్థాయి పర్యవేక్షణ

- ఆకస్మికంగా గ్రామాలలో పర్యటించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి
- తహసిల్దార్ కార్యాలయంలో ధరణి సమస్యలపై పరిశీలన

**చిన్నంబావి జూన్ 28 (జనం సాక్షి)**

చిన్నంబావి మండల పరిధిలోని అమ్మాయి పల్లి, వెల్లటూరు, చిన్నంబావి గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకస్మికంగా గ్రామాలలో పర్యటించారు. వర్షాకాలంలో పరిసరాల్లో నిలువ నీరు ఉండకుండా శుభ్రం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి చిన్నంబావి మండలాల్లో పర్యటించి డ్రై డే నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు, పరిసరాలు ఎలా ఉన్నాయి అనే విషయాలు పరిశీలించారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాల చుట్టూ, మిద్దెల మీద పాత టైర్లు, కుండలు, కొబ్బరి చిప్పలు, రోళ్ళు, బాటిల్ యొక్క మూతలు వంటి వాటిలో వర్షపు నీరు చేరడం వల్ల వాటిలో దోమలు గుడ్లు పెట్టి దోమల వ్యాప్తి శరవేగంగా జరుగుతుందన్నారు. దోమల వల్ల ప్రాణాంతక డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని అందు వల్ల నిలువ నీరు ఉండకుండా ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. డ్రై డే రోజున పంచాయతీ సెక్రెటరీ, అంగన్వాడి టిచర్లు, ఆశ వర్కర్లను ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాలు పరిశీలించడమే కాకుండా ప్రజలకు దోమల వ్యాప్తి ఎలా జరుగుతుందో వివరించాలన్నారు. కలెక్టర్ స్వయంగా ఇళ్ల పరిసరాలు పరిశీలించారు. పాత డబ్బాలు, కుండల్లో నిలువ ఉన్న నీటిని పడేయాల్సిందిగా ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు, అంగన్వాడి, ఆశా వర్కర్లు ప్రజలకు డ్రై డేపై అవగాహన కల్పిస్తున్నారా, అని ప్రజలతో ఆరా తీశారు. ప్రతి గ్రామ పంచాయతీలో డ్రైనేజ్ నిర్వహణ, మిషన్ భగీరథ నీటి ట్యాంకుల నిర్వహణ, మల్టి పర్పస్ వర్కర్ల హాజరు రిజిస్టరు (3) రిజిస్టర్లు తప్పకుండా పెట్టి సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. అనంతరం చిన్నంబావి మండలం తహశీల్దార్ కార్యాలయంలో ధరణి ఫిర్యాదుల ను పరిశీలించారు. ధరణి ఫిర్యాదులు తహసిల్దార్ లాగిన్ లో వచ్చిన వాటిని ఎప్పటికప్పుడు సమగ్ర పరిశీలన జరిపి పరిష్కరించాలని తహసిల్దార్ ను ఆదేశించారు. చిన్నంబావి మండలం వెల్టూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. అదేవిధంగా మండలంలోని గ్రోమోర్ రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డిఎల్పిఓ రఘునాథ్ రెడ్డి, చిన్నంబావి తహసిల్దార్ ఇక్బాల్, ఎంపీడీఓ రమణారావు, వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్, డిటి శ్రీనివాస్, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, ఎంపిఓ రామస్వామి, ఏపీఓ ధనుంజయ్ రాజ్, ఆర్ఐ రాము, పంచాయతీ సెక్రటరీలు ప్రజాప్రతినిధులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.



# ఎన్నికల వాగ్దానాలు..
# పాలక పార్టీలకు తల నొప్పులు

### కౌలు రైతులకు రైతుభరోసాను ఎలా ఇస్తారు..?
### పట్టాదారుకు కూడా వర్తిస్తదా లేదా అన్న అనుమానాలు

**వనపర్తి, జూన్ 28 (జనంసాక్షి):**



ఎన్నికల సందర్భంగా ఎడా పెడా చేసే వాగ్దానాలు అధికారంలోకి వచ్చాక పాలక పార్టీలకు తల నొప్పులుగా మారుతున్నాయి. గత ఐదేళ్ళ క్రితం జరిగిన ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని, స్విస్ బ్యాంకులో దాచిన నల్ల ధనాన్ని వెలికి తీసి దేశ వ్యాప్తంగా ఉన్నప్రజల అకౌంట్లలో రూ .15 వేలు వేస్తామన్న హామీలు అమలు చేయక పోవడంతో ఈ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజారిటీ ఇవ్వకుండా ప్రజలు తమ అసంతృప్తిని వెళ్ళబుచ్చారు. బొటా బొటి మెజార్టీతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడినా ఓటర్ల నిర్ణయంతో 5 ఏళ్ళ పాటు ఎన్డీఏ ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా ఉంటుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఉద్యోగాలు ఇవ్వడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని, ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించిందని, స్వయం ఉపాధి కోసం రుణాలు ఇవ్వలేదన్న కోపంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వర్గాలు గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేసి కాంగ్రెస్కు అధికారం వచ్చేలా చేశాయి.

### గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ సతమతం

తాము అధికారం చేపట్టిన వెంటనే ఆరు గ్యారెంటీలతో పాటు కౌలు దారులకు రైతు భరోసా, ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు, వరి ధాన్యానికి క్వింటాలుకు రూ 500 బోనస్, గ్యాస్ సిలిండర్లకు రూ. 500 ల ప్రకారం సబ్సిడీ తదితర ప్రధాన హామీలు ఇచ్చారు .కాని వాటిని వెంటనే అమలు చేయనందున ఆ ప్రభావం ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో చూపడంతో కాంగ్రెస్కు ఓట్లు, సీట్లు తగ్గాయి. అంతే కాకుండా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్ నగర్ పార్లమెంటు స్థానంతో పాటు ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ ఓడిపోవడం ఆ పార్టీకి కోలుకోలేని ఫలితాలు ఎదురయ్యాయి కూడా.

### కౌలు రైతులకు రైతుభరోసా అమలు ఎప్పుడో..?

కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీల్లో భాగమైన కౌలు రైతులకు కూడా ఈ సీజన్ నుంచే రైతుభరోసా (రైతుబంధు) అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. దీనిపై క్యాబినెట్ సబ్కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది. పట్టాదారులతో పాటు కౌలు రైతులకు కూడా ఎకరాకు ఏడాదికి రూ.15 వేల చొప్పున పెట్టుబడిసాయం అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్నది. అయితే, కౌలు రైతులను ఏ విధంగా గుర్తిస్తారనేది పెద్ద ప్రశ్నగా మారింది. రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది పట్టాదారులు ఉండగా, కౌలు రైతులు 25 లక్షల వరకు ఉంటారని కౌలురైతు సంఘాల నేతలు చెప్తున్నారు.

### కౌలు రైతులను ఎలా గుర్తిస్తారు..!

కౌలు రైతులను ఎలా గుర్తిస్తారన్న అంశంపై 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన కౌలు రైతుల చట్టం ప్రకారం కౌలు రైతులను గుర్తిస్తామని ఎన్నికలకు ముందు రేవంత్రెడ్డి వెల్లడించారు. ఆనాడు కౌలు రైతులు రుణాలు పొందే రుణ అర్హత కార్డు (ఎల్ఈసీ) కోసం ఒక నిర్ణీత ఫార్మాట్ తీసుకొచ్చారు. కౌలుదారుకు ఇచ్చిన భూమి విస్తీర్ణంపై కౌలుదారు, యజమాని ఒప్పందంపై సంతకం చేయాలి. ఆ ఒప్పందం గ్రామ సభ ద్వారా ఆమోదం పొందాలి. ఆ తర్వాత కౌలు రైతులు ఎల్ఈసీ పొందేవారు. సీఎం రేవంత్ చెప్పిన దాని ప్రకారం.. ఇప్పుడు రైతు భరోసాకు కూడా ఆ పద్ధతినే అనుసరించాలి. భూమిని కౌలుకు ఇచ్చే యజమాని, కౌలుదారు ఒప్పందంపై సంతకం చేయాలి. ఆ ఒప్పందాన్ని గ్రామ సభ ఆమోదించాలి. ప్రస్తుతం చాలామంది రైతులు నోటిమాట ద్వారా, పరస్పర నమ్మకాల ప్రాతిపదికగానే తమ భూములను కౌలుకు ఇస్తున్నారు. అయితే రైతు భరోసా కోసం కౌలుదార్లు చట్టపరంగా కౌలుకు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ చట్టం ప్రకారం కౌలు రైతులకు అనేక హక్కులు సంక్రమిస్తాయి. కౌలు రైతు కోసం అసలు రైతులు పెట్టుబడి సాయాన్ని కోల్పోయేందుకు సిద్ధంగా ఉంటారా? అనేది పెద్ద ప్రశ్న. ఎవరైనా ఒప్పందం కోసం పట్టుబడితే తమ భూమినే కౌలుకు ఇచ్చేది లేదని అసలు రైతులు తేల్చి చెప్పే అవకాశమూ లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కౌలు రైతులను ఏవిధంగా గుర్తిస్తారనేది పెద్ద ప్రశ్నగా మారింది.

# మున్సిపల్ కాంటాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



## ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేసిన యూనియన్ నాయకులు

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

మున్సిపల్ కాంటాక్ట్ ,ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని సివిఆర్ భవనంలో ఎమ్మెల్యే చిట్టెంపర్ణిక రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ,సిఐటియు జిల్లా కార్యదర్శి బి బాల్ రామ్ మాట్లాడుతూ పారిశుద్ధ పారిశుధ్య,ఎలక్ట్రిషన్ ,వాటర్ సప్లై తదితర విభాగంలలో అహర్నిశలుగా పనిచేస్తున్న కార్మికులను గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని అన్నారు. కార్మికుల యూ శ్రమ దోపిడీ చేసిందని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. అంతలోపు నూతన పిఆర్సిలో కనీస వేతనం 26,000 అమలు అయ్యే విధంగా చూడాలని, గత పిఆర్సిలో మున్సిపల్ ఉద్యోగ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్లో మున్సిపల్ ఉద్యోగ కార్మికులకు కనీస వేతనం 21 వేల రూపాయలు అమలు చేస్తున్నారని తెలియజేశారు. ఈ సందర్భంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నారాయణపేట యూనియన్ నాయకులు కే సాయిలు, వనిత, ఉమా, పాండు ,కేశవులు, గోపి, వెంకటేష్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పీడియాట్రిక్ కార్డియాలజీ శిబిరాన్ని ప్రారంభించిన కూచుకుల్ల దామోదర్ రెడ్డి

**నాగర్ కర్నూల్ ఆర్సీ జూన్ 28(జనం సాక్షి):**

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా అపోలో ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఏర్పాటు చేసిన పిడియాట్రిక్ కార్డియాలజీ శిబిరాన్ని ఎమ్మెల్సి కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ, ఉచితంగా గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి. అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహించడం అభినందనయమన్నారు, ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల అమలు పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా కె సుధాకర్ లాల్ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అమలు తీరును, అంగన్వాడీ సెంటర్లు పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయిస్తూ అవసరమైన వారికి ఉచితంగా శస్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేసషన్ అధికారి డా, రవి కుమార్ నాయక్, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా స్వరాజ్యం
తెలంగాణ
శనివారం
29 జూన్ 2024
జనంసాక్షి
www.janamsakshi.org







# ప్రకృతి విత్తనం వందనా శివ

**మన రక్షణకి పరమశివ.. పర్యావరణ పరిరక్షణకి ప్రకృతి ప్రేమి.. వందనా శివ**
**విత్తనం జీవితానికి మూలం మాత్రమే కాదు ఇది మన ఉనికికి పునాది... వందనాశివ**
**ప్రకృతిలో మమేకమైన జీవనం సకల ప్రాణుల హితం**

ఇది పుట్టుకలో ఉ ఊన్న పరమార్థం నేటి డిజిటల్ యుగంలో ప్రజలలో వైజ్ఞాని విజ్ఞానం పరిధిలో దాటి వాటి పరికరాల వినియోగం సక్రమ రీతిలో కాక విచక్షణారహితంగా వినియోగం పెరగటం మూలంగా పర్యావరణ తన ఉనికిని కోల్పోసాగింది తిరిగి ఆ పర్యావరణాన్ని నిర్మలాకాశం లో తొలకరి జల్లులతో పరిచిన ఆకుపచ్చని చీరలు మన భూమాత కప్పి ఉంచాలి అనే దృఢ సంకల్పంతో, ఆశతో తమ జీవితాలను ఫణంగా పర్యావరణ పరిరక్షణగా వారి జీవిత లక్ష్యంగా వ్యవహరించిన కొందరిలో మన వందనా శివ గారు ముఖ్యులు, వందనా శివ గారు ప్రపంచ పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారిణి, సైన్స్ తత్వవేత్త, పర్యావరణ స్త్రీవాది, రచయిత, పర్యావరణ కార్యకర్త, భారతీయ భౌతిక శాస్త్రవేత్త, సైన్స్ పాలసీ న్యాయవాది, గొప్ప సామాజిక కార్యకర్త మరియు ప్రపంచీకరణ వ్యతిరేకి. పర్యావరణ స్త్రీవాదం పర్యావరణ మరియు స్త్రీల సంబంధాన్ని చూసే స్త్రీ వాదం. ప్రకృతి నీ నారీ మణులతో పోల్చటం కాక ఈ రెంటి నీ పురుష ప్రపంచం





ఏలుతుందనేది వారి అభిప్రాయం. పర్యావరణ స్త్రీవాదులు స్త్రీలు మరియు పర్యావరణం రెండు పురుషా ధీనంలో ఉన్నారు అనీ అంగీకరిస్తారు.

భారతదేశంలో చిప్కో ఉద్యమం నర్మదా బచావో మహిళా శక్తికి ఒక ఉదాహరణలు.

1974లో ఫ్రాంకోయిస్ దుబెన్నే ఇకో ఫేమీ నిజం అనే పదాన్ని ఉపయోగించారు.

వందనా శివ నవంబర్ 5 1952 హిమాలయ పాదాల సమీపాన ఉన్న డెహ్రాడూన్ నందు జన్మించారు. ఆమె తండ్రి అటవీ సంరక్షణ అధికారి మరియు తల్లి ప్రకృతి ప్రేమికురాలు. ఆమె నైనీటాల్ సెయింట్ మేరీ కాన్వెంట్ మరియు కాన్వెంట్ ఆఫ్ జీసస్ అండ్ మేరీలో చదువుకున్నారు .1972లో బిఎస్సి చండీగర్ పంజాబ్ విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రం నుంచి పట్టభద్రు రాలయ్యారు .1977లో 12 విశ్వవిద్యాలయం విజ్ఞాన శాస్త్రం ఉన్నత చదువులకు కెనడా వెళ్లి కాంతి ఆవర్తన భావనల్లో మార్పులు అని పేరుతో పరిశోధన పత్రాన్ని రాశారు. 1978లో అంటాలియా విశ్వవిద్యాలయాల్లో భౌతిక తత్వశాస్త్రం నందు దృష్టి సారించి పి.హెచ్.డి పూర్తి చేశారు. తర్వాత ఆమె ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు మరియు ఇండియన్ ఇన్సిట్యూట్ అండ్ మేనేజ్మెంట్ శాస్త్ర సాంకేతిక పర్యావరణ విధానాలకి అనేక పరిశోధనలు కొనసాగించారు. %=ఖీూ ఃజు% రీసెర్చ్ ఫౌండేషన్ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఏకాలేజీ స్థాపన మరియు దాని ఉద్దేశాలు

సాంప్రదాయ వ్యవసాయ అభివృద్ధి, రైతుల సుస్థిరత కై వందనా శివ గారి స్థాపించిన సంస్థ .1982లో ఆమె ఆర్ ఎఫ్ ఎస్ .టి ఎన్ ని స్థాపించారు ఆ తర్వాత దానిని తల్లి గోశాలలో రీసెర్చ్ ఫౌండేషన్ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఎకాలజీ అనే పేరుతో మార్చి కొనసాగించారు. 1960లో ప్రారంభమైన అంతర్జాతీయంగా అభివృద్ధి చెందిన దేశాల్లో తక్కువ ప్రయత్నాలతో అధిక దిగుబడిని ఇచ్చే విత్తన నిల్వలు, పురుగుమందులు మరియు ఎరువులు ఉపయోగించడం ద్వారా ఆహార ఉత్పత్తిని పెంచే మార్గాలు, జీవవైవిధ్యం జీవ సాంకేతికత ,జన్యు ఇంజనీరింగ్ ,విత్తన వైవిధ్యం మరియు సంప్రదాయ రైతుల గురించి రైతులు అవగాహన కోల్పోయారని సన్నకారు రైతులు ఖరీదైన రసాయనాలపై ఆధారపడటం వలన వారి ఆర్థిక అభివృద్ధి కుంటుపడుతుందని వారి ఆర్థిక సమస్యలతో పాటు పర్యావరణం కూడా దెబ్బతింటుందని వీటన్నిటికీ ప్రతిస్పందనగా ఆర్ ఎఫ్ ఎస్ టి ఈ శాస్త్రవేత్తలు భారతదేశం అంతట విత్తన బ్యాంకులు స్థాపించారు. దీని ద్వారా రైతులకు సంప్రదాయ దేశీయ వ్యవసాయ పద్ధతులలో శిక్షణ ఇచ్చారు.

వందన గారు రీసెర్చ్ ఫౌండేషన్ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఎకాలజీ చేసిన వైవిధ్యం, సమగ్రత, స్థానిక విత్తనం, సేంద్రియ వ్యవసాయ వాణిజ్య నిజాయితీలను ప్రోత్సహించే పనులకు 1991లో నవధాన్య ప్రాజెక్టును స్థాపించడానికి కారణభూతమయ్యాయి. ఈ ప్రాజెక్టు ఏక సంస్కృతి పట్ల పెరుగుతున్న ధోరణి పెద్ద సంస్థల అసత్య ప్రచారాలను ఎదుర్కోవడానికి కృషి చేస్తుంది. భారతదేశం 40 కి పైగా విత్తన బ్యాంకులను స్థాపించి ఆ పంటలపై ఆధారపడి ప్రత్యేక జీవజాతులను కూడా రక్షించడంపై రైతులకు కలిగే ప్రయోజనాలను గురించి రైతు అవగాహన సదస్సులను నిర్వహించారు. అంతేకాక గోధుమ, వేప, బాస్మతి ,జీవ దొంగిలింపులను సవాలు చేస్తూ జీవవైవిధ్య రంగంలో మేథో సంపత్తులు హక్కులు విషయాలపై ప్రభుత్వ నిపుణురాలుగా పనిచేశారు.

శ్రీమతి వందన శివ 20 కి పైగా పుస్తకాలు రచించారు ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమంలో అంతర్జాతీయ సభలలో పాల్గొన్న నాయకురాలు. రాంచరణ్ రాసిన వేదసాయం పుస్తక కొరకు ఇచ్చిన ఆమె ఇంటర్వ్యూలో అనేక సంప్రదాయ పద్ధతులకు మద్దతుగా వాదించింది.

1997లో బయో పైరసీ ప్రకృతి మరియు జ్ఞానాన్ని దోచుకోవడం ఈ పద్ధతులు జీవ దొంగతనాలతో సమానమని ఆమె ఆరోపించారు. 2002లో నీటి వనరులను ప్రైవేటీకీకరించటం కు ప్రయత్నిస్తున్న కార్పొరేషన్లను విమర్శించారు. పేద దేశాల జీవ సంపద గ్లోబల్ కార్పొరేషన్లు తరచుగా స్వాధీనం చేసుకుంటున్నాయని దీనికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు ఉద్యమించాలని వందన గారు భావించారు. రైతులు తమ పంట నుండి లభించే విత్తనాలు ఆధార చేయడం నుంచి వాటిని నాటడం బదులుగా ప్రతి సంవత్సరం కొత్త విత్తనాలను కొనుగోలుకై బలవంతం చేయటం అనేది ఆమె ఆలోచన ప్రకారం నేరం. వ్యవసాయ వికేంద్రీకరణ విధానం స్థానిక విత్తనాల సేకరణ విధానంపై ఆధారపడి ఉంటుందని వందన గారి అభిప్రాయం అంతేగాక డబ్ల్యూటిఓ ద్వారా వచ్చే ప్రమాదాలను సైతం ఈమె ఆలోచించారు ట్రేడ్ మరియు మేధాసంపత్తి హక్కులు, స్థానిక రకాల తొలగింపుల తర్వాత రైతులు తమ విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పడం ద్వారా కార్పొరేషన్ల ఆదిత్యానికి పెద్దపీట వేసిందని దీనికి వ్యతిరేకంగా సియాటెల్ లో జరిగిన డబ్ల్యూటీవో సమావేశంలో ఆమె మాట్లాడారు.

పురస్కారాలుజి

శ్రీమతి వందన శివ 1993లో నోబుల్ బహుమతి కి ప్రత్యామ్నాయ గా పరిగణించబడే రైట్ లివ్లీ హుడ్ పురస్కారాన్ని అందుకున్నారు. 2010లో సిడ్ని పీస్ ప్రైస్ 2012లో ఫుకుయోగ ఆసియన్ కల్చర్ ప్రైజ్, 2016లో మిరోదీ పురస్కారా లను పొందారు.

పర్యావరణ పతనం మరియు జాతుల వినాశనాన్ని నివారించడానికి మనం భూమిపై పోరాటం ఆపాలి అంతేకాక శాంతిని నెలకొల్పడానికి మన వంతు కృషి చేయాలి పర్యావరణ చట్టాలను గౌరవించడం గ్రహాల సరిహద్దులను మరియు అన్ని జాతులను గౌరవిస్తూ సామరస్యంగా తోటి జీవజాతులను మానవులను గౌరవించాలి.



"కేర్ ఆఫ్ ది ఎర్త్" ద్వారా చీలిపోయిన సమాజాల పునరుత్పత్తిని చేయడం ద్వారా శాంతిని నెలకొల్పవచ్చు. పర్యావరణాన్ని అవసరం మేరకే వారు వాడుకోవడం, ఆహార భద్రత పాటించటం, జీవవైవిధ్య పరిరక్షణ చేయటమే... శాంతికి బాట

ప్రకృతి మనందరికి లభించిన వరం కనులారా తరచి చూస్తే ఎన్నో వర్ణాలతో మనసుని పులకరింపజేస్తుంది అలాంటి ప్రకృతి మాత ఒడిలో సేద తీరుతూ జీవితాన్ని ఆస్వాదించాలి.



**డా: నల్లాన్ చక్రవర్తుల కృష్ణజ్యోతి**

---

### ధరణి పోర్టల్‌తో నిండా మునిగిన రైతులకు

# పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలి





**ప్రజావాణిలో మొరపెట్టుకున్న కొత్వాల్ గూడ రైతులు**

**శంషాబాద్, జూన్ 28 (జనంసాక్షి)**
ధరణి పోర్టల్ ఏర్పాటుతో నిలిచిపోయిన పట్టాదారు పాసు పుస్తకాల ను తిరిగి ప్రారంభించాలని రైతులందరికీ కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని శంషాబాద్ మండల పరిధిలోని కొత్వాల్ గూడ గ్రామ రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజి గూడ లోని మహాత్మ జ్యోతిరావు పూలే భవన్ లో ప్రజావాణి ఇన్చార్జి చిన్నారెడ్డికి కోత్వాల్ గూడ రైతుల వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సుమారు వంద సంవత్సరాల నుం చి గ్రామ రైతులు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నార నము. వంశపారపర్యంగా తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసా యం ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నాము. రైతుల సమస్యలను పరిష్కరించడానికి గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 38 ఇ కింద రైతులకు అన్ని హక్కులు కల్పించి పట్టాదారు పసు పుస్తకాలు ఇచ్చిందన్నారు. ఇవ్వడంతో గ్రామ రైతులు హక్కులు పొంది భూమి క్రయ విక్రయాలు జరిపే అవకాశం ఏర్పడిందన్నారు. తద్వారా రైతు రుణమాఫీ, రైతుబంధు ఇతర సదుపాయాలను పొందే వారమన్నారు. గత తెలంగాణ ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చి కొత్వాల్ గూడ రైతుల భూములను నిషేధిత జాబితాలో చేర్చారని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటినుంచి గ్రామ రైతులకు ప్రభుత్వం వైపు దిగినంగా ఎదురుచూస్తూన్నాము. ఎలాంటి హక్కులు లేకుండా రైతుబంధు, రైతు బీమా ఇతర రుణ సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాము. గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌లో విధించిన నిషేధాన్ని ఎత్తివేసి గ్రామ రైతులందరికీ కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజావాణి ఇంచార్జ్ చిన్నారెడ్డికి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ప్రజావాణి ఇంచార్జి చిన్నారెడ్డి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారం అయ్యేటట్లు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పి. శ్రీనివాస్ గౌడ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ జ్ఞానేశ్వర్ యాదవ్, డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, మాజీ వార్డ్ మెంబర్ కృష్ణ ముదిరాజ్, రాజేష్ గౌడ్ పాల్గొన్నారు.

# క్షతగాత్రులకు కలెక్టర్ శశాంక పరామర్శ





**షాద్ నగర్, జూన్ 28 (జనంసాక్షి) :**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని బూర్గుల గ్రామ శివారులో ఉన్న సౌత్ గ్లాస్ ప్రైవేటు కంపెనీలో జరిగిన ప్రమాద ఘటన పట్ల జిల్లా కలెక్టర్ శశాంక దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే కలెక్టర్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ ప్రమాదంలో 10 మంది గాయపడ్డారని, సుమారు ఐదుగురు వ్యక్తులు మృతి చెందినట్లు ఇప్పటివరకు ప్రాథమిక సమాచారం అందిందని కలెక్టర్ తెలిపారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఘటన స్థలానికి తనతో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులు, పోలీసులు, అధికార యంత్రాంగం అంతా హుటాహుటిన చేరుకుని తక్షణ సహాయక చర్యల్లో నిమగ్నమ య్యిందని అన్నారు. గాయపడిన కార్మికులను ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నామని, తొమ్మిది మంది షాద్ నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, పరిస్థితి కొంత విషమంగా ఉన్న మరో కార్మికుడిని శంషాబాద్ ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

ఘటనా స్థలంలో సహాయక చర్యలను ముమ్మరం చేశామన్నారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కార్మిక శాఖ, పరిశ్రమలు, వైద్య శాఖ బృందాలు ఘటనా స్థలంలోనే ఉండి సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం పరిస్థితి సాధారణ స్థాయిలో నే ఉందని తెలిపారు. అనంతరం కలెక్టర్ శశాంక షాద్ నగర్ ఆసుపత్రిని సందర్శించి, గాయపడిన కార్మికులను పరామర్శించారు. క్షతగాత్రులను కలిసి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారిని కలెక్టర్ ఆదేశించారు. మృతుల కుటుంబీకుల వివరాలను సేకరించి, వారికి ప్రమాద ఘటన గురించి సమాచారం తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఇదిలావుండగా, షాద్ నగర్ గ్లాస్ ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు ప్రమాద ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను కలెక్టర్ శశాంకను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

---

### ఆరోగ్య ప్రధాయిని

# అరటి పండు



అన్ని కాలలలో దొరికే విలువైన ఆరోగ్యపరమైన మంచి పండు అరటి పండు దీనిలో పొటాషియం, విటమిన్లు అధికముగా ఉంటాయి. అరటి పండు మనకు ఎదురయే కొన్ని ఆరోగ్యసమస్యలకు పరిష్కారము చూపుతుంది. ఆ విషయాలు తెలుసుకుంటే మీరు అరటి పండును "సూపర్ ఫ్రూట్" అని నిస్సందేహముగా అంటారు.

**1. అరటిపండు శరీరానికి శక్తిని ఇస్తుంది:**
అరటిపండులో మూడు రకాల చక్కెరలు ఉంటాయి అవి గ్లూకోజ్ ,ఫ్రక్టోజ్ ,సుక్రోజ్, వీటితోపాటు అధిక మొత్తములో పీచు ఉంటుంది. కాబట్టి శరీరానికి శక్తిని ఇచ్చేదిగా అరటి పండు గుర్తించబడింది. శాస్త్ర వేత్తల అధ్యయనము ప్రకారము రెండు అరటి పళ్ళు 90 నిముషాల పాటు శారీరక శ్రమ చేయటా నికి అవసరమైన శక్తిని ఇస్తాయి. అందుకనే ప్రపంచ వ్యాప్తముగా క్రీడాకారులు అరటిపండ్లను తినటం అలవాటు చేసుకుంటారు.

**2. డిప్రషన్ (కృంగుబాటు) ను అధిగమించటానికి:**
ఈ మధ్య జరిపిన పరిశోధనలలో క్లినికల్ డిప్రషన్ రోగులు అరటి పండ్లు తినటం వలన వారిలో అభివృద్ధి కనిపించింది అని తెలియజేస్తున్నాయి. అరటి పండు లోని ట్రిప్టోఫాన్ అనే పదార్థము ఆవశ్యక అమైనో ఆమ్లము తయారు అవటానికి తోడ్పడి దానిద్వారా మెలటోనిన్ అనే హార్మోన్ ను,సెరోటోనిన్ అనేన్యూరో ట్రాన్స్ మీటర్ లను ఉత్పత్తిచేసి శరీరాన్ని రిలాక్స్ అయేటట్లు చేస్తుంది ఫలితముగా డిప్రషన్ తగ్గుతుంది. ట్రిప్టోఫాన్ ఆందోళనను కృంగుబాటును తగ్గించి, మైగ్రెన్ (పార్శ్వ తలనొప్పి) రాకుండా చూస్తుంది అరటి పండులోని లైసిన్ అనే అమైనో ఆమ్లము కొలెస్టరాల్ స్థాయిలను తగ్గించటానికి ఉపయోగపడుతుంది ఫలితముగా కార్డియో వాస్కులార్ సమస్యలు తగ్గుతాయి.

**3. స్త్రీలలో బహిష్టు ఇబ్బందులనుండి ఉపశమనము :**
అరటిపండులా ట్రిప్టోఫాన్‌తో పాటు బి6 విటమిన్ కూడా అధికముగా ఉంటుంది ఇది రక్తములోని గ్లూకోజ్ స్థాయిల సమతుల్యతను కాపాడుతుంది. ఈరెండు పదార్థాలు స్త్రీలలో బహిష్టు సమయములో ఏర్పడే నొప్పులనుండి ఉపశమనాన్ని కలిగిస్తాయి.

**4. మెదడుకు శక్తినిస్తుంది:**
అరటిపండులోని పొటాషియం, చక్కెరలు మెదడు మీద మంచి ప్రభావాన్ని చూపుతాయి ఫలితముగా మెదడు ఏదైనా సమస్యలపై కేంద్రీకరించే శక్తిని పెంచుతుంది విద్యార్థులపైన జరిపిన ప్రయోగాల వల్ల అరటిపండ్లు ప్రతిరోజూ ఉదయాన్నే తిన్న విద్యార్థులు ఇతరులకన్నా వారి చదువుల్లో ముందుటున్నారని తెలిసింది.

**5. రక్తవిహీనత (ఎనీమియా)తో బాధపడే వారికి అరటి పండు మేలు చేస్తుంది:**
అరటిపండులోని ఐరన్ ఆక్సిజన్ వాహకమైన హీమోగ్లోబిన్ ఉత్పత్తికి దోహదప డుతుంది. కాబట్టి ఎనీమియాతో భాధపడేవారికి హీమోగ్లోబిన్ తక్కువగా ఉంటుంది కాబట్టి అరటి పండ్లు తింటే హీమోగ్లోబిన్ ఉత్పత్తి పెరిగి ఎనిమీయా నుండి ఉపశమనాన్ని పొందగలరు.

**6. రక్త పీడనములో సమతుల్యత ఉంటుంది:-**
అధిక రక్త పీడనమును తగ్గించటానికి అరటి పండులోని ఎక్కువగా ఉండే పొటాషియం ,లవణము ఏమాత్రము లేకపోవటము బాగా ఉపయోగ పడుతుంది. అమెరికాలోని ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రక్షన్ వారు స్ట్రోక్స్‌ను అధిక రక్త పీడనాన్ని నివారించటానికి అరటిపండ్లు బాగా ఉపయోగిస్తాయి అని తెలిపారు.

**7. గుండెల్లో మంటను తగ్గిస్తుంది :**
ఎక్కువగా క్రొవ్వు పదార్థాలను తినటమువల్ల ,కార్బోనేటేడ్ డ్రింక్స్ త్రాగటం వల్ల గుండెల్లో మంట ఏర్పడుతుంది. అరటి పండ్లు తినటం వల్ల జీర్ణాశయములో ఏర్పడే ఎసిడిటీని తగ్గిస్తుంది. కొన్ని సందర్భాల్లో పూర్తిగా తొలగిస్తుంది కూడా.

**8. మలబద్ధకాన్ని నయముచేస్తుంది:-**
అరటిపండులోని పోషక పీచు పదార్థము అసౌకర్యము కలిగించే చికాకైనా సమస్య మలబద్ధకం నుండి విముక్తి కలిగిస్తుంది. ఉదయాన్నే అరటిపండు బ్రేక్ ఫాస్ట్ గా తీసుకుంటే సాధారణ బవుల్ కదలిక లను కలుగజేస్తుంది కాబట్టి మలబద్ధకాన్ని రసాయన విరేచన కారిణులను తీసుకొనే అవసరము ఉండదు.

**9. మానసిక ఆందోళనను ఒత్తిడులను తగ్గిస్తుంది:-**
మన శరీరానికి గుండె కొట్టుకోవటాన్ని నియంత్రించటానికి పొటాషియం అవసరము ఫలితముగా మెదడు కణాలకు ఆక్సిజన్ అంది శరీరములోని ద్రవాలు సమతుల్యముగా ఉంటాయి ఈ చర్య మానసిక ఆందోళనను తట్టుకోవటంలో ముఖ్యపాత్ర వహిస్తుంది. మన శరీరములో రక్త ప్రసరణ లో పొటాషియం లేకపోతె మనము అప్పుడు ఒత్తిడికి గురి అవుతాము.గుండె వేగముగా కొట్టుకోవటం మొదలవుతుంది. మెదడు వేగముగా నిర్ణయాలను తీసుకోలేదు చేతులు కొద్దిగా వణకటం మొదలవు తుంది. అరటి పండు తినటం ప్రారంభిస్తే కనిపించవు.

**10. పొగత్రాగటం మానటానికి మంచి సాధనము:-**
మీరు ధూమపాన ప్రియులయితే, ధూమపానం మానాలనుకున్నప్పుడు అరటి పండు బాగా ఉపయోగిస్తుంది అరటి పండులోని బి విటమిన్లు, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు నికోటిన్ విత్ డ్రాయల్ లక్షణాలను ఎదుర్కోవట ములో బాగా పనికి వస్తాయి. కాబట్టి సిగరెట్ త్రాగాలి అన్న కోరిక నశిస్తుంది సులభముగా పొగత్రాగటం మానవచ్చు.

**11. పులిపిర్లను నయము చేయటానికి:**
అరటి పండుతొక్కతో పులిపిర్లకు వైద్యము చేయవచ్చు అరటి పండు తొక్కను పులిపిర్లు ఉన్న ప్రాంతముపై ఉంచి బ్యాన్డ్ ఎయిడ్ లేదా టేప్ ను తొక్క కదలకుండా అతికించి ఒక రోజు ఉంచితే పులిపిరి మాయము అవుతుంది.

**12. స్నాక్స్ గా మంచి ఆహారము:-**
బరువు ఎక్కువ ఉన్నవారు తీపి పదార్థాలను స్నాక్స్ గా తినాలని కోరిక ఉన్న బలవంతముగా చంపుకుంటారు. అటువంటి వారికి అరటి పండ్లు తీపి పదార్థాలు, చాకోలెట్లు వంటి వాటికి బదులుగా పనికివస్తాయి. ఇవి మధ్యాహ్న భోజనము తరువాత రాత్రి భోజనము మధ్య కాలములో శక్తి నివ్వటానికి పనికీ వస్తాయి. కాబట్టి లావు ఉన్నవారు స్నాక్స్‌గా అరటి పండ్లను వాడవచ్చు.

**13. మార్నింగ్ సిక్ నెస్‌ను తగ్గిస్తుంది:**
శరీరములోని హార్మోనుల స్థాయిలలో వచ్చే మార్పులు, షుగర్ లెవెల్స్ లో మార్పుల వల్ల ఈ మార్నింగ్ సిక్ నెస్ ఏర్పడుతుంది. అరటి పండు తినటము వల్ల ఈ రెండు సమస్యలు తగ్గుతాయి. ఈ మార్నింగ్ సిక్ నెస్ గర్భిణీ స్త్రీలలో పరగడుపునే వాంతి అయేటట్లు ఉండటం వంటి లక్షణాలతో ఉంటుంది అరటి పండులోని పోషకాలు గర్భిణీ స్త్రీలకు బాగా ఉపకరిస్తాయి. ఇవండీ అరటి పండుతో మనము తగ్గించుగోగల కొన్ని ఆరోగ్య సమస్యలు అరటిపండు ద్వారా మనకు అందే పోషకాలు మన ఆరోగ్యాన్ని కాపాడుతాయి మనకు మందుల అవసరము తగ్గుతుంది ఆరోగ్యము బాగు పడుతుంది. ఈ మధ్య కొన్ని రసాయనాలు ఉపయోగించి పచ్చి అరటికాయలు కృత్రిమముగా పండిస్తున్నారు అటువంటి పండ్లు ఆరోగ్యానికి మంచి చేయకపోగా హాని చేస్తాయి కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.

**వ్యాస రచన: అంబడిపూడి శ్యామసుందర రావు**

# పామాయిల్ సాగుకు బాటలు వేసి మార్గదర్శిగా నిలిచిన మంత్రి తుమ్మల..

## రైతన్న ఇంట సిరులు కురిపిస్తున్న పామాయిల్ సాగు

## తెలంగాణ వ్యాప్తంగా పామాయిల్ సాగు విస్తరణలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ముద్ర

**ఖమ్మం జూన్ 28 (జనంసాక్షి):**
మన వంటనూనెల చరిత్ర చూస్తే దిమ్మతిరిగే లెక్కలు కనిపిస్తాయి.. అవును మీరు విన్నది నిజమే. గత ఏడాది మన దేశం దిగుమతి చేసుకున్న వంటనూనె ల విలువ ఎంతో తెలుసా? అక్షరాలా లక్షా 38 వేల కోట్లు.అందులో సగంకు పైగా అరవై శాతం పామాయిల్ నూనెదే సింహభాగం.ఏడాది కి నూట అరవై లక్షల టన్నుల వంట నూనెలు ఎందుకు దిగుమతి చేసుకుంటున్నాం.? మన దేశ జనాభా కు తగ్గ స్థాయిలో వంట నూనెల పంటల సాగు లేదా? మన దేశంలో పామాయిల్ సాగు ఎలా మొదలైంది..? తెలుగు రాష్ట్రాల్లో పామాయిల్ సాగు ఎలా ఉంది.?.. రైతన్న ఇంట సిరులు కురిపిస్తున్న పామాయిల్ సాగుకు బాటలు వేసి మంత్రి తుమ్మల మార్గదర్శిగా మారారా... పామాయిల్ సాగు విస్తరణకు కేంద్ర ప్రభుత్వ విధానాలు అడ్డంకిగా మారాయా?.. తెలుగు రాష్ట్రాల్లో పామాయిల్ సాగు ప్రస్థానం ఇలా..

పామాయిల్ వంట నూనె గా సుపరిచితం.పామాయిల్ చరిత్ర చూస్తే ఏడాది కి మన దేశం దిగుమతి చేసుకునే పామాయిల్ చిన్న రాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువగా ఉంది.2022 ..23 ఏడాదికి గాను మన దేశం 164 లక్షల టన్నుల వంట నూనెలు దిగుమతి చేసుకుంటే అందులో 59 శాతం పామాయిల్ దే సింహభాగం.ఏడాది కి మన దేశం లక్షా 38 వేల కోట్ల రూపాయల విలువైన వంట నూనెలు దిగుమతి చేసుకుంటే అందులో 85 వేల కోట్లు పామాయిల్ వాటా.అంతలా డిమాండ్ ఉన్న పామాయిల్ చరిత్ర చూస్తే 5 వేల సంవత్సరాల క్రితం పామాయిల్ సాగు మొదట ఆఫ్రికా దేశాల్లో మొదలైంది.దక్షిణ ఆఫ్రికా లో మొదలైన పామాయిల్ సాగు ప్రపంచమంతావిస్తరించింది.పారిశ్రామిక విప్లవంతో యంత్రాల కందెన గా పామాయిల్ వాడేవారు.దాంతో బ్రిటీష్ వ్యాపారులచే ఆఫ్రికా నుంచి పామాయిల్ ఎగుమతులు మొదలైయ్యాయి.ఇండోనేషియా మలేషియా నైజీరియా థాయ్ లాండ్ దేశాలు పామాయిల్ ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నాయి.తెలుగు రాష్ట్రాల్లో ఆయిల్ పామ్ సాగుకు బాటలు వేసారు ఎన్టీఆర్ అండ్ తుమ్మల ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఉన్న సమయంలో నాడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెదవేగి నుంచి ఓ పామాయిల్ మొక్క తెప్పించి నాటి జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పామాయిల్ సాగుకు శ్రీ కారం చుట్టారు.పామాయిల్ సాగు చూస్తే...ఎకరం లో 57 మొక్కలు నాటాలి. సబ్సీడీ పై మొక్కలు ఉద్యాన శాఖ వారు అందిస్తారు.నాలుగు సంవత్సరాల వరకు రాయితీ ల రూపంలో ఎకరంకు 50వేలు రైతులకు అందుతాయి.పామాయిల్ మొక్కలు పాతిక నుంచి నలభై సంవత్సరాల పాటు దిగుబడి ఇస్తాయి.నాలుగో ఏట నుంచి పంట దిగుబడి వస్తుంది.అంతర పంటలుగా కోకో జాజికాయ పలు ఉద్యాన పంటుల సాగు చేయొచ్చు.దిగుబడి మొదలైన తరువాత నెల నెల ఆదాయం ఉంటుంది.గత ఏడాది టన్ను గెలల దర 20 వేల వరకు ఉంది.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నే కాదు తెలంగాణలో పామాయిల్ తొలి సాగుకు బాటలు వేసారు మంత్రి తుమ్మల.ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పామాయిల్ తొలి మొక్క ను నాటించారు.తొలుత తన వ్యవసాయ క్షేత్రం దమ్మపేట మండలం గండుగులపల్లి లో పామాయిల్ సాగుకు శ్రీ కారం కట్టారు .తుమ్మల తో పాటు మరికొంత మంది ఔత్సాహిక రైతులు పామాయిల్ సాగు చేసారు.అలా మొదలైన పామాయిల్ సాగు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే ప్రస్తుతం 50 వేల ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు.అశ్వారావుపేట లో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పామాయిల్ రైతులు సాగు విస్తీర్ణం పెంచారు.పామాయిల్ సాగు కు బాటలు వేసిన తుమ్మల కేసీఆర్ క్యాబినేట్ లో మంత్రిగా ఉన్న సమయంలో దమ్మపేట మండలం అప్పారావుపేటలో నూతన పామాయిల్ ఫ్యాక్టరీ నెలకొల్పారు.దాంతో పామాయిల్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారింది.వ్యవసాయం చేయడమే కాదు తోటి రైతులను రాజుగా మార్చి తెలంగాణ వ్యాప్తంగా 20 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగుకు క్యాబినేట్ లో ఆమోదం చేయించి తుమ్మల చరిత్రలో నిలిచారు.

### మంత్రి తుమ్మల పై పామాయిల్ రైతాంగం ప్రశంసలు

మంత్రి తుమ్మల వల్లే పామాయిల్ రైతులు సంతోషంగా ఉన్నామని ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవ రావు అభిప్రాయం వ్యక్తం చేసారు.పామాయిల్ రైతాంగంకు ఎదురైతున్న ఇబ్బందులపై ఏపీ రైతులు మంత్రి తుమ్మల ను కలిసి సమస్యలు వివరించారు.ఆ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ మహానుభావుడు ఎన్టీఆర్ చేతుల మీదుగా నాటిన పామాయిల్ మొక్క



వేలాది మంది రైతుల ఇళ్లల్లో సంతోషం నింపుతుంది .సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు పొలం బాట పట్టేలా వ్యవసాయం ఉండాలని అందుకే పామాయిల్ విస్తరణకు పెద్ద పీట వేసినట్లు తుమ్మల తన ఆలోచనలు పంచుకున్నారు.ఒకరి మీద ఆధారపడకుండా రైతే కొంత మందికి ఉఫాది నిచ్చేలా పంటల సాగు ఉండాలని అందుకే పామాయిల్ సాగు విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చానని రైతులతో అభిప్రాయం పంచుకున్నారుమట్టి వాసన తెలిసిన రైతు బిడ్డ నిత్యం పంట పొలాల్లో తిరిగే నిఖార్సయిన రైతైన తుమ్మల తను ఆదర్శంగా ఉంటూ ఎందరో రైతులకు మార్గదర్శిగా మారారని తెలంగాణ ఏపీ పామాయిల్ రైతాంగం మంత్రి తుమ్మల పై ప్రశంసలు కురిపిస్తున్నారు..





## సీతారామ ఎత్తిపోతల పధకం పంపు హౌస్‌ను పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్..

**కొత్తగూడెం, జూన్ 28 (జనంసాక్షి):**
అశ్వాపురం మండలంలోని బిజీ కొత్తూరు సమీపంలో గల సీతారామ ఎత్తిపోతల పధకం పంప్ హౌస్ ను శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఆయనకు మ్యాప్ ద్వారా ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను వివరించారు. ఈ పంపు ద్వారా 1500 క్యూసెక్కుల నీరు వస్తుందని,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 4 పంపుల ద్వారా 104 కిలోమీటర్లు నీరు పంపుటకు ప్రధాన కాలువ సిద్ధంగా ఉందని, ఆగస్టు మాసంలో నీరు విడుదల చేయుటకు అన్ని పనులు పూర్తి చెయ్యాలని అధికారులను ఆదేశించారు.ఈ కాలువకు ఏన్కూరు వద్ద నాగార్జునసాగర్ కాలువకు అనుసంధానం చేయబడుతుందని తెలిపారు . తద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో1.20 లక్షల ఎకరాలకు మొదటి విడతగా నీటి లభ్యత కల్పించబడును.ఈ విధంగా రాబోయే మూడు సంవత్సరాలలో విడతల వారీగా సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేసి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలలో 6.74 లక్షల ఎకరాలకు నీరు అందించబడునని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి సూపరిండెంట్ ఇంజనీర్లు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మరియు కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ల తో చర్చలు సఫలం

**నల్లగొండ బ్యూరో, జూన్ 28, (జనంసాక్షి)**
కలెక్టర్ జిల్లా ప్రధాన ఆస్పత్రి ని జిల్లా అధికారులతో తనిఖీ చేయించే విషయంలో గత రెండు రోజులుగా మెడికల్ కళాశాల,ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు,ప్రొఫెసర్లు,విభాగాల అధిపతులు చేస్తున్న నిరసనను విరమించుకున్నారు.ఈ విషయమై శుక్రవారం నలుగురు సభ్యులతో కూడిన నల్గొండ వైద్య కళాశాల అసిస్టెంట్ తెలంగాణ డాక్టర్ల బోధన సిబ్బంది అసోసియేషన్ బృందం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణ చంద్ర ను అదనపు కలెక్టర్ ఛాంబర్ లో కలిసి చర్చలు జరిపారు.చర్చల అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర మాట్లాడుతూ,తనతో డాక్టర్ల బృందం జరిపిన చర్చలు సఫలం అయ్యాయని తెలిపారు.చర్చల వివరాలను ఆయన వెల్లడిస్తూ శుక్రవారం నల్గొండ వైద్య కళాశాల నుండి ఇద్దరు, తెలంగాణ డాక్టర్ల బోధన సిబ్బంది అసోసియేషన్ కి చెందిన ఖమ్మం, సూర్యాపేట వైద్య కళాశాలల నుండి వచ్చిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల బృందం తన దగ్గరికి వచ్చిందని,నల్గొండ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని అధికారులతో తనిఖీ చేయించే విషయం తనతో చర్చించడం జరిగిందని,చర్చల సందర్భంగా జిల్లా అధికారులతో ప్రధానాస్పత్రిని ఆసుపత్రి పర్యవేక్షకులు ఏర్పాటు చేసిన ఒక ఆర్ ఎం ఓ తో కలిపి తనిఖీ చేసేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వారు ఒప్పుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించు విషయములో అందరు కలిసి పని చెయ్యాలని నిర్ణయించుకున్నారని తెలిపారు.వైద్య బృందంతో జరిపిన చర్చల ప్రకారం నల్గొండ జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎంపిక చేసిన ఆర్ఎంవో తో కలిసి రేపటినుండి జిల్లా అధిలారులు యధావిధిగా నల్గొండ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ప్రజలకు అవసరమైన పరిపాలనపరమైన విభాగాలను తనిఖీ చేస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తో చర్చలు జరిపిన వారిలో నల్గొండ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.శ్రీకాంత్ వర్మ, ఎల్ రమేష్,ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు తెలంగాణ డాక్టర్ల బోధన సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమార్, జోనల్ కార్యదర్శి,సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ గిరిధర్ నాయక్ మరియు జి.జి.హెచ్ పర్యవేక్షకులు ప్రొఫెసర్ నిత్యానందంలు ఉన్నారు.

## సంపద వనాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి

- విద్యార్థులకు ఏకరూప దుస్తులు
- అందజేయకపోవడంపై ఆగ్రహం
- విద్యార్థుల హాజరు శాతం పెరగాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
సంపద వనాలపై ఎక్కువ దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆత్మకూర్(ఎస్) మండలంలో విస్తృతంగా పర్యటించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అన్నారు.కోటీనాయక్ తండా, పాత సూర్యాపేట, దుబ్బ తండా గ్రామాల్లో సంపద వనాలు పరిశీలించి చనిపోయిన మొక్కల స్థానాల్లో సత్వరమే మొక్కలు నాటాలని సూచించారు.ఉపాధి హామీ పనుల్లో భాగంగా నర్సరీలలో పని చేస్తున్న కూలీలతో మాట్లాడి,వారికి వేతనాలు సక్రమంగా అందాలని ఎంపీడీఓ ను ఆదేశించారు.తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ధరణి పెండింగ్ దరఖాస్తుల వివరాలు తెలుసుకొని, అట్టి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని, విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సత్వరమే అందచేయాలని, రికార్డ్ రూమ్ ను ఫైల్స్ ను సరైన రీతిలో ఉంచాలని సూచించారు.జడ్పి ఉన్నత పాఠశాల తనిఖీలో భాగంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా భోదనకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని,ఆదిశగా విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.తదుపరి ప్రైమరీ పాఠశాలను సందర్శించి పిల్లలకు ఏకరూప దుస్తులు అందజేయక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేసి మిగిలిన పుస్తకాలను గదిలో చిందరవందరగా పడేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికారం అందజేయుటలో ఎక్కడ కూడా రాజీ పడకుండా విద్యతో పాటు మంచి నాణ్యమైన ఆహారం అందించాలని,పిల్లలకు అందించే అంశాలపై అడిగి తెలుసుకొని, రిజిస్టర్లను తనిఖీ చేసి పెండింగ్ ఉన్న రికార్డ్స్ పూర్తి చేసి అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్ కుమార్, ఎంపీడీఓ ఎండీ.ఖాసీం,ఎంపీఓ సంజీవ్, జిపి కార్యదర్శులు భాస్కర్, సుధాకర్, స్వప్న, ఏపీఓ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్ వల్లనే సీతారామ కల సాకారం

### సీతారామ సక్సెస్ పట్ల నామ నాగేశ్వరరావు హర్షం

### రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్

**ఖమ్మం ఆర్సి, జూన్ 28 (జనంసాక్షి) :**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అవిరళ కృషి, భగీరథ అద్భుత ప్రయత్నంతో సీతారామ ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతమై, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల చిరకాల జల సంకల్పం నెరవేరిందని ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నీటితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షలాది ఎకరాలు సస్యశ్యామలమై, అన్నదాతల కలలు సాకారం అవుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ ప్రాజెక్టు ఘనత కేసీఆర్దేనని పేర్కొన్నారు. కేసీఆర్ ఎంతో ముందు చూపుతో ప్రతిష్టాత్మకంగా తీసికొని ఈ ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి, కరవును పారదోలే కల్పతరవుగా ప్రాజెక్టును పూర్తి చేశారని చెప్పారు.ఈ మొదటి దశ పంపు హౌస్ ద్వారా గోదావరి జలాలు ఊరూరా పరుగులిడి, లక్షలాది ఎకరాలకు చేరతాయని అన్నారు.కేసీఆర్ ఉక్కు సంకల్పం వల్లనే ఈ ప్రాజెక్టు కల



సాకారమైందని చెప్పారు.ఈ ప్రాజెక్టు ఖమ్మం జిల్లా రైతుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపుతుందని తెలిపారు.ఈ ప్రాజెక్టు ను జిల్లా రైతాంగానికి అంకితం చేస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలోనే దాదాపు పనులన్నీ పూర్తి అయ్యాయని చెప్పారు.ఈ విజయంలో భాగస్వాములైన నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బందిని కూడా అభినందిస్తున్నట్లు నామ నాగేశ్వరరావు తెలిపారు.

## బొగ్గు గనులను సింగరేణి లిసంస్థకే కేటాయించాలి : సిపిఎం డిమాండ్

**ఖమ్మం జూన్ 28 (జనంసాక్షి):**
కేంద్ర బిజెపి ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను ఆపి సింగరేణికి నేరుగా కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక సరిత క్లినిక్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్




అధ్యక్షతన జరిగిన సభలో నున్నా మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర బిజెపి ప్రభుత్వం వేలంపాటను వేస్తున్నదని సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలం పాటలో పోటీపడాలనే స్థితికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. వాస్తవానికి శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలి. కానీ వేలంపాట ద్వారా ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పించి బొగ్గు గనులను కేటాయించడం సరైంది కాదన్నారు. మన రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలంపాటను ప్రారంభించడం సిగ్గుచేటని అన్నారు. బొగ్గు గనులన్నీ ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణికి మిగిలేదేముంటుందని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ వలన క్రమంగా సింగరేణి సంస్థను బలహీనపరిచి నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. నగదీకరణ పేరుతో దేశంలో ఆరు లక్షల కోట్ల విలువైన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిందని. అందులో భాగంగానే కోట్ల విలువైన గనులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయాన్ని తీసుకుందని విమర్శించారు. గత పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం దాదాపుగా 200 బొగ్గు బావులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టారని, ప్రభుత్వ రంగంలో గనులు లేకపోయువతకు ఉపాధి అవకాశాలు కనుమరుగవుతాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకోలేకపోయారని విమర్శించారు. ప్రస్తుతం సింగరేణి 40 వేల మంది పర్మినెంట్ కార్మికులకు, మరో 26 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నదని, రికార్డు స్థాయిలో అతి తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ఘనత సింగరేణి సంస్థకే చెందుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అనేక రూపాలలో ఆదాయాన్ని తీసుకొస్తున్న సింగరేణిని ప్రైవేటీకరణ అప్పజెప్పి ప్రభుత్వ ఉపాధి అవకాశాలను కొల్లగొడుతున్న కేంద్ర ప్రభుత్వ ధమననీతిని రాష్ట్ర ప్రజానీకం ఖండించాలని అన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ వేగంగా జరిగితే విద్యుత్తు ధర విపరీతంగా పెరుగుతుందని అన్నారు. సింగరేణికి చెందిన 22 బొగ్గు బావుల్లో బొగ్గు నిల్వలు అడగండి పోయాయని కొత్త బ్లాకులో తవ్వకాలు ప్రారంభించాలని కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇందుకు అనుమతించకుండా మోకాలు అడ్డుతున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణ ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని వేలంపాట ప్రారంభ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనటం ఆశ్చర్యకరమని ఇది వేలంపాట ప్రక్రియను ఆమోదించడమే కదా అని ఆయన అన్నారు. కాబట్టి శ్రావణపల్లి బ్లాకుతో పాటు మిగతా బ్లాక్‌లను కూడా తక్షణమే సింగరేణికి అప్పగించాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకొని శాసనసభ తీర్మానం చేయాలని లేని పక్షంలో ప్రజానీకాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం, సింగరేణి బొగ్గుగని కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, సిపిఎం రాష్ట్ర నాయకులు తాళ్ళ నాగరాజు, జిల్లా కమిటి సభ్యులు మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, ఎస్.కె.బషీరుద్దీన్, ఆర్.ప్రకాష్, పార్టీ 2 టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, 3 టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీను, అర్బన్ మండల కార్యదర్శి బత్తిని ఉపేందర్, జిల్లా నాయకులు ఎస్.కె.వి.ఎ.మీరా, చింతల రమేష్, వజినేపల్లి శ్రీను, బండారు యాకయ్య, పి.నాగసులోచన, శీలం వీరబాబు, భాగం అజిత, బేగం, బూబి, పగడాల నాగేశ్వరరావు, సత్యనారాయణ, గణపతి, ఉమ్మినేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు దోపిడీ కథనంపై స్పందన

### - ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం

### ఎంఈఓ సలీం షరీఫ్

**మునగాల, జూన్ 28 (జనంసాక్షి):**
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పుస్తక విక్రయాలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం జనంసాక్షిలో ప్రచురితమైన ప్రైవేటు దోపిడీ అనే కథనంపై మండల ఎంఈఓ సలీం షరీఫ్ శుక్రవారం చరవాణి ద్వారా స్పందించారు. అన్ని ప్రైవేట్ పాఠశాలలకు నిబంధనలకు అనుగుణంగా ఫీజులు వసూలు చేయాలని, పాఠశాల ఆవరణలో ఎటువంటి పుస్తకాలు అమ్మరాదని, ఈ విషయంలో ఆదేశాలు కూడా జారీ చేయడం జరిగిందని, గతంలో కోదాడకు చెందిన న్యూ విజన్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధన అతిక్రమించినందున పుస్తకాల నిలువ గదులను సీజ్ చేయడం జరిగిందని అన్నారు. సంబంధిత తల్లిదండ్రులు వారికి ఏ విధమైన అసౌకర్యం కలిగినా.. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


జనంసాక్షి
www.janamsakshi.org
ప్రైవేటు దోపిడీ

# విపణి



## నష్టాల్లో ముగిసిన దేశీయ సూచీలు

ముంబయి: గురువారం సరికొత్త రికార్డులను అధిగమించిన దేశీయ స్టాక్‌మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీలు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది.నేటి ట్రేడింగ్‌లో బీఎస్‌ఈ సెన్సెక్స్ 210 పాయింట్ల నష్టంతో 79,032 వద్ద ముగియగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 33.90 పాయింట్ల నష్టంతో 24,010 పాయింట్ల వద్ద స్థిరపడింది.నిన్నటి లాభాల జోరును కొనసాగిస్తూ ఉదయం మార్కెట్లు ఉత్సాహంగా ఆరంభమయ్యాయి. ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 253 పాయింట్ల లాభంతో 79,496 పాయింట్లు లాభపడి సరికొత్త గరిష్ఠాలను తాకింది. నిఫ్టీ సైతం 74 పాయింట్ల లాభంతో 24,120 పాయింట్లకు పైనే ట్రేడింగ్‌ను కొనసాగించింది. మధ్యాహ్నం 12 గంటల వరకూ సానుకూలంగా కదలాడిన సూచీలు మదుపరులు జాగ్రత్త చర్యలకు దిగి, లాభాల స్వీకరణ మొదలుపెట్టడంతో పడుతూ లేస్తూ కదలాడాయి. చివరకు నష్టాలతో ముగిశాయి.శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో ఓఎన్‌జీసీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ లైఫ్ టాటా మోటార్స్ తదితర షేర్లు లాభపడగా, ఇండస్ ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకు, కోటక్ మహీంద్ర బ్యాంకు తదితర షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. ముఖ్యంగా హెల్త్‌కేర్, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, ఆయిల్ అండ్ గ్యాస్, రియల్టీ రంగ షేర్లు పుంజుకోగా, బ్యాంకింగ్ ఇండెక్స్ 1శాతం తగ్గింది. అలాగే మూలధన వస్తువుల ఇండెక్స్ 0.4శాతానికి పడిపోయింది.




# జియో బాటలో ఎయిర్‌టెల్

**వినియోగదారులపై టారిఫ్ దాడి**
**భారీగా పెరగనున్న రీఛార్జ్ ధరలు**
**జూలై 3నుంచి అమల్లోకి కొత్త ధరలు**



**ముంబై, జూన్ 28 (జనంసాక్షి):**
మొబైల్ ఫోన్ వినియోగదార్లకు వరుసగా రెండు షాక్‌లు తగిలాయి. ఎలాన్ ధరలు పెంచుతూ రిలయన్స్ జియో ప్రకటించిన వెంటనే, భారతి ఎయిర్‌టెల్ కూడా రేట్లను పెంచింది. ఎయిర్‌టెల్ సిమ్ వినియోగించాలంటే యూజర్లు ఇకపై 10 శాతం నుంచి 21 శాతం ఎక్కువ డబ్బులు ఖర్చు చేయాలి. పెరిగిన భారతి ఎయిర్‌టెల్ టారిఫ్‌లు జులై 3 నుంచి అమలులోకి వస్తాయి. ఆ తేదీ నుంచి పోస్ట్ పెయిడ్ / ప్రి-పెయిడ్ ఎ÷-లాన్ల రేట్లు పెరుగుతాయి. ఎయిర్‌టెల్ కస్టమర్లకు ప్రస్తుతం ఉన్న రేట్లు జులై 2వ తేదీ వరకు వర్తిస్తాయి. భారతదేశంలోని టెలికాం కంపెనీలు ఆర్థికంగా బలంగా ఉండాలంటే 'ప్రతి వినియోగదారు నుంచి వచ్చే సగటు ఆదాయం' రూ. 300 పైగా ఉండాలని భారతి ఎయిర్‌టెల్ స్టాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది. 300 దాటితే... నెట్‌వర్క్ టెక్నాలజీ , స్పెక్ట్రమ్ కోసం పెద్ద మొత్తంలో అవసరమయ్యే పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయని, మూలధనంపై సాధారణ రాబడిని పొందగమని తాము నమ్ముతున్నట్లు ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో భారతి ఎయిర్‌టెల్ పేర్కొంది. సామాన్య ప్రజల బడ్జెట్‌పై ఎలాంటి భారం లేకుండా, ఎంట్రీ-లెవల్ ప్లాన్ రేట్లను చాలా తక్కువ మొత్తంలో అంటే రోజుకు 70 పైసల కంటే తక్కువ పెంచినట్లు వెల్లడించింది. గురువారం, రిలయన్స్ జియో కూడా తన మొబైల్ ప్లాన్ రేట్లను 12 శాతం నుంచి 27 వరకు పెంచింది. జియో కొత్త టారిఫ్‌లు కూడా జులై 3 నుంచి అమల్లోకి వస్తాయి. జులై 2వ తేదీ వరకు ప్రస్తుత రేట్లే అమల్లో ఉంటాయి. రిలయన్స్ జియో... తన నెలవారీ (28 రోజులు) ప్లాన్‌లు, 2 నెలలప్లాన్లు (56 రోజులు), 3 నెలల ప్లాన్లు (84 రోజులు), వార్షిక ప్లాన్ల (335 / 336 రోజులు) మొత్తాన్ని పెంచింది. 28 రోజుల ప్లాన్ ధరలను 27 శాతం వరకు, 84 రోజుల ప్లాన్లను 20 శాతం వరకు రిలయన్స్ జియో పెంచింది. డేటా యాడ్-ఆన్ ప్యాక్‌లు, పోస్ట్ పెయిడ్ టారిఫ్ రేట్లను సైతం జియో పెంచింది. దీంతో... కొత్త ప్లాన్లు కనిష్టంగా రూ. 189 నుంచి గరిష్టంగా రూ. 3,599 వరకు చేరాయి. ప్రస్తుతం ఇవి కనిష్టంగా రూ. 155 - గరిష్టంగా రూ. 2,999 మధ్యలో ఉన్నాయి. జియో యాడ్-ఆన్ ఎలాన్ల కొత్త ధరలు కనిష్టంగా రూ. 29 నుంచి గరిష్టంగా రూ. 69 వరకు ఉన్నాయి. పోస్ట్ పెయిడ్ ఎ÷-లాన్ల విషయానికి వస్తే... ప్రస్తుతం రూ. 299 ఎలాన్ జులై 03 నుంచి రూ. 349 అవుతుంది. ప్రస్తుతం రూ. 399గా ఉన్న ప్లాన్ కోసం జులై 03 నుంచి రూ. 449 చెల్లించాల్సి వస్తుంది. వాస్తవానికి, టెలికాం కంపెనీలు ఈ ఏడాది ప్రారంభంలోనే టారిఫ్ రేట్లు పెంచాల్సి ఉంది. అయితే, లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు ఆగాయి.

## గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.15
వరంగల్ ₹ 5.17

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్
₹65,150 (22 క్యారెట్లు)
₹72,160 (24 క్యారెట్లు)

చెన్నై
₹66,660 (22 క్యారెట్లు)
₹72,720 (24 క్యారెట్లు)

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్
₹ 94,500

# జులై 3న రెండు ఐపీఓలు.. రూ.2,700 కోట్ల సమీకరణ




దిల్లీ: ఎంక్యూర్ ఫార్మా ఐపీఓ జులై 3-5 మధ్య జరగనుంది. ధరల శ్రేణిని రూ.960- 1,008గా కంపెనీ నిర్ణయించింది. గరిష్ఠ ధర వద్ద రూ.1,952 కోట్లు సమీకరించనుంది. కొత్తగా రూ.860 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.1,152 కోట్లు విలువ చేసే షేర్లు విక్రయించనుంది. మదుపర్లు కనీసం రూ.14,112తో 14 షేర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, జెఫరీస్ ఇండియా, యాక్సిస్ క్యాపిటల్, జేపీ మోర్గాన్ ఇండియా ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.
ఈ ఐపీఓలో ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా కొన్ని షేర్లను రిజర్వ్ చేశారు. అర్హత గల సంస్థాగత మదుపర్లకు 50 శాతం, రిటైల్ మదుపర్లకు 35 శాతం, సంస్థాగతేతర మదుపర్లకు (%చీ××ం%) 15 శాతం షేర్లను కేటాయించారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తామని ఎంక్యూర్ ఫార్మా తెలిపింది. పుణె కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ వివిధరకాల ఔషధాల అభివృద్ధి, తయారీ, మార్కెటింగ్ వంటి కార్యకలాపాలు చేపడుతోంది.
బన్సల్ వైర్ ఐపీఓ..
స్టీల్ వైర్ల తయారీ సంస్థ బన్సల్ వైర్ ఇండస్ట్రీస్ సైతం జులై 3-5 మధ్య ఐపీఓకి రాబోతోంది. రూ.745 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. షేరు ధరల శ్రేణిని రూ.243-256గా నిర్ణయించింది. ఈ ఐపీఓ పూర్తిగా కొత్త షేర్ల జారీ ద్వారానే జరుగుతోంది. ఆఫర్ ఫర్ సేల్ కింద ఎలాంటి షేర్లు అందుబాటులో లేవు. మదుపర్లు కనీసం రూ.14,848తో 58 షేర్లకు బిడ్లు దాఖలు చేయాలి. ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, డీఏఎం క్యాపిటల్ అడ్వైజర్స్ ఈ ఐపీఓకి బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా ఉన్నాయి.
ఈ ఐపీఓలో సమీకరించిన నిధులతో కంపెనీ కొత్తరకం వైర్ల తయారీలోకి ప్రవేశించే యోచనలో ఉంది. అందుకనుగుణంగా దాద్రీలోని తయారీకేంద్రంలో మార్పులు చేయనుంది. అర్హతగల సంస్థాగత మదుపర్లకు 50 శాతం, రిటైల్ మదుపర్లకు 35 శాతం, సంస్థాగతేతర మదుపర్లకు 15 శాతం షేర్లను కేటాయించారు. ఈ కంపెనీ హై కార్బన్ స్టీల్ వైర్, మైల్డ్ స్టీల్ వైర్, స్టెయిన్‌లెస్ స్టీల్ వైర్.. ఇలా మూడు విభాగాల్లో వైర్లను తయారుచేసి ఎగుమతి చేస్తోంది.


## సునాక్ విజయావకాశాలపై అనుమానం

లండన్: బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీని గెలిపించగలరా అని అనుమానాలు రేకెత్తుతున్నాయి. గడచిన ఐదు వారాల ఎన్నికల ప్రచారంలో ఆయన వేసిన తప్పటడుగులే ఈ సందేహానికి బలం చేకూరుస్తున్నాయి. ఎన్నికలు జులై 4న జరుగుతాయని పందెం కాసిన సొంత పార్టీ అభ్యర్థులను ఆయన సస్పెండ్ చేయడం మొదటి విఘాతం. అన్నింటికన్నా పెద్ద పొరబాటు- ఈ నెల 6న ఫ్రాన్స్‌లోని నార్మండీలో జరిగిన డి-డే ఉత్సవ కార్యక్రమం నుంచి త్వరగా నిష్క్రమించడం. అది అమరవీరుల త్యాగాలను అగౌరవపరచడమేనని విమర్శలు వచ్చాయి. సునాక్ క్షమాపణ చెప్పినా అప్పటికే నష్టం జరిగిపోయింది. ప్రజాభిప్రాయ సేకరణల్లో సునాక్, ఆయన కన్జర్వేటివ్ పార్టీ రేటింగ్‌లు పడిపోతూ వచ్చాయి. 14 ఏళ్ల తరవాత తొలిసారి కన్జర్వేటివ్ పార్టీ ఓడిపోతుందని సర్వేలు సూచిస్తున్నాయి. ఇంతవరకు ఎన్నడూ ఓడిపోని సునాక్ ఈ ఎన్నికల్లో గెలుస్తారని భావించేవారూ ఉన్నారు.

# ఒక్క వ్యక్తి కోసం 986మందితో భద్రతా ?

**జగన్ రక్షణ వలయంపై సిఎం చంద్రబాబు ఆశ్చర్యం**

**అమరావతి,జూన్ 28 (జనంసాక్షి):**
రాజకీయ నేరస్థులకు రాష్ట్రంలో ఎక్కువ భద్రత ఉందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఒక ముఖ్యమంత్రికి 986 మందితో భద్రతా? అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పోలవరంపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా గత సీఎం జగన్ భద్రత అంశంపై విలేకర్లు అడిగిన ప్రశ్నపై చంద్రబాబు స్పందించారు. ఒక ముఖ్యమంత్రి భద్రతకు 986 మంది సిబ్బంది కావాలా? అదీ పరదాలు కట్టుకొని తిరగడానికి..! మేం వెళ్లినా పరదాలు కట్టేస్తున్నారు.. ఏంటయ్యా ఇది అని అడిగితే అలవాటైపోయింది సర్ అంటున్నారు. పరదాలు కట్టడం, చెట్లు కొట్టేయడమేంటి? అవసరమైన మేరకే ట్రాఫిక్ ఆపాలని చెబుతున్నా. నాకు రెండు నిమిషాలు లేటైనా ఫర్వాలేదు.. నేను నిలబడతాను. వాళ్లంతా వెళ్లాకే వెళ్తానని చెబుతున్నా. ఎక్కువ టైం ఎక్కడా ఆఫ్ చేయొద్దని మంత్రులకు, కేబినెట్ సమావేశంలోనూ చెప్పాను. ఎలాంటి ఆర్భాటాలూ వద్దని చెప్పా. మనమేం రాజులం కాదు.. డిక్టేటర్లం కాదు.. ఇష్టానుసారం చేయడానికి. ప్రజాసేవకులుగా ప్రవర్తించమంటున్నా అని చంద్రబాబు అన్నారు.



## జాతీయం అంతర్జాతీయం



### భారత్‌లో మైనారిటీలపై దాడులు ఆందోళనకరం

వాషింగ్టన్:
భారత్‌లో తీసుకొస్తున్న మతమార్పిడి నిషేధ చట్టాలు, విద్వేష వ్యాఖ్యలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని అమెరికా వ్యాఖ్యానించింది. మైనారిటీలకు సంబంధించిన ఇళ్లను, ప్రార్థనా స్థలాలను కూల్చివేయడమూ ఇబ్బందికరమేనని అభిప్రాయపడింది. అంతర్జాతీయ మత స్వేచ్ఛపై బుధవారం నివేదిక విడుదల చేసిన సందర్భంగా అమెరికా విదేశాంగశాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా మత స్వేచ్ఛ కోసం పలువురు పని చేస్తున్నారని తెలిపారు.'భారత్‌లోని 28 రాష్ట్రాల్లో 10 రాష్ట్రాలు మత మార్పిడి నిషేధిస్తూ చట్టాలు చేశాయి. ఇందులో కొన్ని బలవంతపు మత మార్పిడికి పాల్పడితే భారీ జరిమానాలను విధిస్తున్నాయి. దీనిపై అమెరికా అధికారులు ఎప్పటికప్పుడు భారత్ అధికారులతో మాట్లాడి ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు' అని అంతర్జాతీయ మత స్వేచ్ఛపై విడుదల చేసిన 2023 నివేదిక పేర్కొంది.

**భారత్ దర్యాప్తు ఫలితాల కోసం ఎదురుచూస్తున్నాం**

తమ దేశంలో జరిగిన ఖలిస్థాన్ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్ను హత్య కేసులో భారత్ దర్యాప్తు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నామని అమెరికా పేర్కొంది. ఈ హత్యలో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తా ప్రమేయముందని అమెరికా అధికారులు గత నవంబరులో అభియోగాలు మోపారు. గత ఏడాది జూన్‌లో చెక్ రిపబ్లిక్‌లో నిఖిల్‌ను అరెస్టు చేసి అమెరికాకు తీసుకొచ్చారు. 'ఈ కేసులో విచారణ జరుపుతున్నామని భారత్ అధికారులు తెలిపారు. ఆ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాం' అని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి బుధవారం వాషింగ్టన్‌లో వ్యాఖ్యానించారు.

### ఇరు దేశాల సంబంధాలు మరింత విస్తృతం

**అమెరికా రాయబారి గార్సెట్టీ వెల్లడి**

ఆక్సన్ హిల్:
భారత్, అమెరికా సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత అత్యుత్తమంగా ఉన్నాయని, అవి మరింత విస్తృతమవుతున్నాయని భారత్‌లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ ఇంత దగ్గరగా రెండు దేశాలు లేవని, అమెరికాలో భారతీయులు 1.5 శాతం ఉన్నారని, వారు దేశ పన్నుల్లో 6శాతం చెల్లిస్తున్నారని తెలిపారు. అమెరికాలో భారతీయులు అత్యంత విజయవంతమైన వలస వర్గమని వ్యాఖ్యానించారు. భారత్ నుంచి భారీగా తరలివచ్చిన ప్రతినిధులతో వాషింగ్టన్‌కు సమీపంలోని ఆక్సన్ హిల్‌లో నిర్వహించిన సెలక్ట్ యూఎస్‌ఏ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. 'భారత్, అమెరికా సంబంధాలంటే కూడిక కాదు.. మల్టిప్లికేషన్. ఇది అమెరికా ప్లస్ ఇండియా కాదు. గుణింతం లాంటిది' అని గార్సెట్టీ పేర్కొన్నారు. అమెరికన్లకు మరిన్ని భారత్ బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.

# విభజన కన్నా జగన్ వల్లనే ఎక్కువ నష్టం

**పోలవవారన్ని గోదావరిలో ముంచిన ఘనుడు**
**ప్రాజెక్టును చూస్తే కళ్లవెంట నీళ్లు వచ్చాయి**
**నిపుణుల సాయంతో ప్రాజెక్టును పూర్తి చేస్తాం**
**పోలవరం జీవనాడి..నదులు అనుసంధానానికి పునాది**
**పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు**

**అమరావతి,జూన్ 28 (జనంసాక్షి):**
పోలవరాన్ని జగన్ గోదావరిలో ముంచారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. విభజన వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టం కంటే జగన్ చేసిన నష్టమే ఎక్కువన్నారు. పోలవరం ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు శుక్రవారం శ్వేతపత్రం విడుదల చేశారు. గత ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించిన పురోగతిని రాష్ట్ర ప్రజల ముందుంచిన ఆయన.. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పరిస్థితి చూసి తన కళ్ల వెంట నీళ్లొచ్చాయన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..' పోలవరం గురించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలిపేందుకే శ్వేతపత్రం విడుదల చేస్తున్నాం. ఏడు శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నాం. మేధావులు, నిపుణులు సహా అందరి సలహాలూ తీసుకుంటాం. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి. కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువగా నిధులు తెచ్చుకోవాలి. 25 రోజుల్లో బ్జడెట్ ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. వెబ్‌సైట్ల ద్వారా పత్రాలన్నీ అందుబాటులో ఉంచుతాం' అన్నారు. పోలవరం ప్రాజెక్టుపై గత సీఎం జగన్ అసెంబ్లీ వేదికగా ఏటా చేసిన ప్రసంగాలతో పాటు మంత్రిగా అంబటి రాంబాబు చేసిన ప్రకటన వీడియోలను మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రదర్శించారు. పోలవరంపై మొదటి శ్వేతపత్రం విడుదల చేస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టులపై రెండో శ్వేతపత్రం ఇస్తాం. రాష్ట్ర అభివృద్ధికి జీవనాడి పోలవరం. నదుల అనుసంధానానికి గుండెలాంటిది. ఇలాంటి పోలవరానికి జగన్ ఒక శాపంలా మారారు. ఈ ప్రాజెక్టు విషయంలో క్షమించరాని నేరం చేశారు. రాష్ట్రానికి అమరావతి, పోలవరం రెండూ ప్రధాన ప్రాజెక్టులు. ఈ రెండూ రాష్ట్రానికి రెండు కళ్లులాంటివి. ఈ రెండూ పూర్తి చేసుకుంటే విభజనలో జరిగిన అన్యాయాన్ని, నష్టాన్ని పూడ్చుకొనే అవకాశం ఉంటుంది. రాష్ట్రాన్ని నాశనం చేసే హక్కు ఎవరికీ లేదు. పోలవరం ధ్వంసం జాతికి జరిగిన విద్రోహం. రాష్ట్ర అభివృద్ధికి జలవిద్యుత్ కీలకం. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే వ్యవసాయ రంగానికి ఊతం వస్తుంది. విభజన వల్ల జరిగిన నష్టం కంటే జగన్ చేసిన నష్టమే అధికం. 2014-19 మధ్య పోలవరానికి రూ.11,762 కోట్లు ఖర్చు చేశాం. వైకాపా ప్రభుత్వం కేవలం రూ.4,167 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. జగన్ మూర్ఖత్వం వల్లే డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. జగన్ ప్రమాణం చేస్తూనే పోలవరం పనులు ఆపేశారు' అన్నారు.ప్రత్యామ్నాయం లేకుండా కాంట్రాక్టర్లను తొలగించారు. సమర్థులైన అధికారులను బదిలీ చేశారు. డయాఫ్రమ్‌వాల్ దెబ్బతిందని హైదరాబాద్ ఐఐటీ బృందం చెప్పింది. ఆ విషయం జగన్‌కు రెండేళ్ల తర్వాత తెలిసింది. కాంట్రాక్టర్లను మార్చొద్దని పీపీఏ హెచ్చరించింది. 2009లోనూ వైఎస్ కాంట్రాక్టర్‌ను మార్చారు. వైఎస్ కాంట్రాక్టర్‌ను మార్చడం వల్ల హెడ్ వర్క్స్ నిలిచిపోయాయి. ఆయన చేసిన తప్పే జగన్ కూడా చేశారు. పీపీఏ హెచ్చరికలను జగన్ పెడచెవిన పెట్టారు. 2019 ఆగస్టు 16న సీఎస్‌కు పీపీఏ లేఖ రాసింది. ఏజెన్సీలను మార్చొద్దని స్పష్టంగా చెప్పింది. నీతిఆయోగ్ బృందం నాటి సర్కారు తప్పిదాలను ఎత్తి చూపింది. కాఫర్ డ్యామ్ గ్యాప్‌లు పూర్తి చేసేటప్పుడు ఏజెన్సీని మార్చారు. 2018లో డయాఫ్రమ్‌వాల్‌ను రూ.436 కోట్లతో మేం పూర్తి చేస్తే.. దాని మరమ్మతులకే రూ.447 కోట్లు ఖర్చయింది. కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి రూ.990 కోట్లు ఖర్చవుతుంది. దీని నిర్మాణానికి కనీసం రెండు సీజన్లు అవసరం. కాఫర్ డ్యామ్ సీపేజ్ వల్ల ఏ పనులూ చేసే పరిస్థితి లేదు. జగన్ చేసిన విధ్వంసంతో పోలవరం ప్రాజెక్టు భౌగోళిక పరిస్థితులు మారాయి. జగన్ సర్కార్ అసమర్థతతో గైడ్‌బండ్ కుంగిపోయింది. రూ.80 కోట్లతో నిర్మించిన ఈ గైడ్‌బండ్ నిరుపయోగంగా మారింది. తెదేపా హయాంలో పోలవరం 72 శాతం పూర్తయితే.. వైకాపా హయాంలో కేవలం 3.84 శాతం పనులే జరిగాయి. పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధుల్లో రూ.3,385 కోట్లు మళ్లించారు. తెదేపా హయాంలో పోలవరం పనులకు ప్రశంసలు దక్కితే.. వైకాపా హయాంలో పీపీఏ, ఐఐటీ నిపుణుల చీవాట్లు దక్కాయి. పోలవరం మరమ్మతుల కోసం అమెరికా, కెనడా నుంచి నిపుణుల్ని రప్పిస్తున్నాం. వాళ్లు ఇక్కడే ఉండి పర్యవేక్షిస్తారు. ఏజెన్సీని మార్చకపోతే 2020 నాటికే ప్రాజెక్టు పూర్తయ్యేది. జగన్ సర్కారు నిర్లక్ష్యంతో రూ.4,900 కోట్ల నష్టం జరిగింది. ఖర్చు 38 శాతం పెరిగింది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యుత్ ఉత్పత్తి కోల్పోయాం. దీని ద్వారా రూ.3 వేల కోట్లు నష్టపోయాం. పోలవరం ఆలస్యంతో రైతులకు రూ.45 వేల కోట్ల నష్టం జరిగింది' అని వివరించారు. అంతర్జాతీయ, దేశీయ నిపుణుల సాయంతో సమస్యని అధిగమిస్తాం. కేంద్ర ప్రభుత్వ తోడ్పాటుతో సవాళ్లు అధిగమిస్తాం. ప్రాజెక్టు కట్టడం కంటే మరమ్మతు ఇంకా కష్టమైన పని. పోలవరం కోసం మేం పడిన శ్రమను జగన్ వృథా చేశారు. అర్హత లేనివారికి అధికారం వస్తే అరాచకాలే జరుగుతాయి. కాఫర్ డ్యామ్ ఎక్కడ ఉందో తెలియని వారు మాపై విమర్శలు చేశారు. పోలవరం ఎంతకాలంలో బాగు చేయగలమో నిపుణులే తేల్చాలి. జగన్ అరాచకంతో నిపుణులు కూడా భయపడే పరిస్థితి వచ్చింది. పోలవరంలో తప్పులు చేసిన అధికారుల్ని మారుస్తున్నాం. పోలవరంలో ప్రధాన దోషిని జనం ఇంటికి పంపారు. పోలవరం ఎత్తు విషయంలో రాజీ లేదు. అందరం సమష్టిగా పనిచేసి ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని చంద్రబాబు అన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిలా భావిస్తున్న పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంత చిత్తశుద్ధితో ఉన్నారో చాటి చెప్పే విషయం ఒకటి వెలుగుచూసింది. ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా మొదటి నుంచి ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అందులో భాగంగా తెలంగాణలోని నాటి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భాగమైన ఏడు ముంపు మండలాలను విజయవంతంగా ఏపీలో విలీనం చేయించారు. ఈ ఏడు మండలాలను ఇవ్వకపోతే ప్రాజెక్టు నిర్మాణం జరగదని భావించిన ఆయన.. ఎట్టి పరిస్థితుల్లోనూ మండలాల విలీనానికి పట్టుబట్టారు. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి ఖరాఖండిగా చెప్పారు. విలీనం చేయకపోతే సీఎంగా తాను ప్రమాణ స్వీకారం చేయబోనని కేంద్ర పెద్దలకు చంద్రబాబు తెగేసి చెప్పారు. 2014 అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన ఈ కీలక పరిణాన్ని చంద్రబాబు శుక్రవారం వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా ప్రస్తావించారు. ఃూగా 2024 ఎన్నికల మాదిరిగా 2014లో కూడా బీజేపీ-టీడీపీ కలిసి పోటీ చేయగా జనసేన మద్దతు ఇచ్చింది. ఇక 2014-2019 మధ్యకాలంలో పోలవరం ప్రాజెక్టు పనులను చంద్రబాబు పరుగులు పెట్టారు. ప్రాజెక్టుకు సంబంధించి ప్రతి పనికి పీపీఏ, కేంద్ర జలవనరుల శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. ప్రతి సోమవారం రివ్యూలు చేపట్టి రికార్డు స్థాయిలో పనులు చేపించారు. టీడీపీ హయాంలోనే పోలవరం ప్రాజెక్టు పనులు 72 శాతం పూర్తయ్యాయి. 5 ఏళ్ల కాలంలో ఏకంగా 28 సార్లు క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లారు. అంతేకాదు 82 సార్లు వర్చ్యువల్‌గా సమీక్షలు నిర్వహించారు. టీడీపీ 5 ఏళ్ల కాలంలో మొత్తం 72 శాతం పనులు జరగగా అందుకు రూ.11,537 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది. ఒక్క రోజులోనే స్పిల్ ఛానల్‌లో 32,215 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేసి నాటి ప్రభుత్వం గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించింది. రెండు కిలోమీటర్ల పొడవుతో 100 మీటర్ల పైగా లోతుతో డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టారు. స్పిల్ వే గేట్ల డిజైన్లు సిద్ధం చేసి.. గేట్ల అమరిక సైతం అప్పట్లోనే ప్రారంభించారు. అప్పట్లో జల వనరుల శాఖా మంత్రులుగా ఉన్న ఉమాభారతి, నితిన్ గడ్కరీలు పోలవరం వచ్చి పనులు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.





# నేడే తుది సమరం

## ముగింపు దశకు చేరుకున్న టీ20 వరల్డ్ కప్

- తొలిసారి ఫైనల్లో ఢీ కొట్టనున్న భారత్, దక్షిణాఫ్రికా జట్లు
- ఒక్క ఓటమిని కూడా చూడని ఇరు జట్లూ
- ఫైనల్ మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారన్నది సర్వత్రా ఆసక్తి
- నేడు ఇరుజట్ల మధ్య టైటిల్ కోసం అమీతుమీ
- ఫైనల్ మ్యాచ్‌కు వరుణగండం..?

*దక్షిణాఫ్రికాతో జరిగే టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్స్ కోసం టీమిండియా బార్బడోస్‌లో అడుగుపెట్టింది. భారత జట్టులోని సభ్యులు హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్ వంటి పలువురు విమానాశ్రయం నుండి వారి బస్ ఎక్కేందుకు వెళ్తుండటం చూడొచ్చు. జట్టు సభ్యులతో పాటు.. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ కూడా విమానాశ్రయం నుండి బయటకు వస్తున్నట్లు వీడియోలో కనిపించారు. ఇండియా-దక్షిణాఫ్రికా మధ్య టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్, కెన్సింగ్టన్ ఓవల్‌లో జరగనుంది. ఈ మ్యాచ్ స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కానుంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది. శనివారం జరిగే ఫైనల్ పోరులో ఇరు జట్లు టైటిల్ సాధించాలనే కసితో ఉన్నాయి. పదేళ్ల తర్వాత ఫైనల్ చేరిన భారత్ రెండో కప్పు గెలవాలని, చరిత్ర తిరగరాయాలనే కసితో ఉంది. మరోవైపు దక్షిణాఫ్రికా మొట్ట మొదటి ఐసీసీ వరల్డ్ కప్ గెలిచి రికార్డ్ క్రియేట్ చేయడానికి ఎదురుచూస్తోంది. ఈ మెగా టోర్నీలో ఇరు జట్లు ఒక్క మ్యాచ్ ఓడకుండానే ఫైనల్ వరకు చేరాయి.*





టీ20 ప్రపంచకప్ తొలి సెమీఫైనల్‌లో ఆఫ్ఘనిస్థాన్ జట్టుపై దక్షిణాఫ్రికా జట్టు అద్భుత విజయంతో ఫైనల్‌లోకి ప్రవేశించింది. దీని ప్రకారం జూన్ 29న జరిగే ఫైనల్ మ్యాచ్‌లో భారత్, దక్షిణాఫ్రికా జట్లు తొలిసారి ఫైనల్లో ఢీ కొట్టనున్నాయి. విశేషమేమిటంటే.. ఈ ప్రపంచకప్‌లో రెండు జట్లూ ఒక్క ఓటమిని కూడా చూడలేదు. ఇప్పుడు రెండు జట్లూ వరుస విజయాలతో ఫైనల్స్‌లోకి ప్రవేశించగా ఫైనల్ మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారన్నది ఆసక్తిగా మారింది. దక్షిణాఫ్రికా తొలి రౌండ్‌లో 4 మ్యాచ్‌లు, రెండో రౌండ్‌లో 3 మ్యాచ్‌లు గెలిచింది. సెమీఫైనల్‌లో విజయం సాధించడం ద్వారా మొత్తం 8 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. టీమ్ ఇండియా తొలి రౌండ్‌లో 3 విజయాలు సాధించగా (వర్షం కారణంగా 1 మ్యాచ్ రద్దు చేశారు). రెండో రౌండ్‌లో 3 విజయాలు నమోదు చేసింది. ఇప్పుడు సెమీఫైనల్లోనూ విజయం సాధించి ఫైనల్లోకి ప్రవేశించింది. దీంతో వరుసగా 7 విజయాలు సాధించిన భారత్.. ఇప్పుడు 8 విజయాలు సాధించిన దక్షిణాఫ్రికాను ఢీ కొట్టనుంది. ఓటమి ఎరుగని అగ్రగామిగా ఇరు జట్లూ ఫైనల్స్‌లోకి ప్రవేశించడంతో రెండు జట్లూ గెలుపు ధీమాతో ఉన్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా విజయోత్సవాల ద్వారా తమ సత్తాను చాటుకున్నారు. దీంతో ఫైనల్ మ్యాచ్‌లో ఇరు జట్ల నుంచి హోరాహోరీ పోటీ నెలకొనే అవకాశం ఉంది. జూన్ 29న భారత్-దక్షిణాఫ్రికా మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. బార్బడోస్‌లోని కెన్సింగ్టన్ ఓవల్ మైదానంలో జరిగే ఫైనల్ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది. టీ20 ప్రపంచ కప్ 2024 ఫైనల్ పోరులో భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా జట్లు బార్బడోస్‌లో తొలిసారి టీ20 క్రికెట్‌లో తలపడనున్నాయి. ఇంతకు ముందు ఇక్కడ టీమ్ ఇండియా కేవలం 3 మ్యాచ్‌లు మాత్రమే ఆడగా అందులో 1 మ్యాచ్‌లో మాత్రమే విజయం సాధించింది. 2010 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌పై భారత్ తడబడింది. ఈ రెండు మ్యాచ్‌లలో ఓడిపోయింది. దక్షిణాఫ్రికా గురించి చెప్పాలంటే.. ఇక్కడ జరిగిన 3 టీ20 మ్యాచ్‌ల్లో సౌతాఫ్రికా 2 గెలిచింది. 2010లో బార్బడోస్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా ఈ మూడు మ్యాచ్‌లు ఆడింది. అంటే 2024లో దక్షిణాఫ్రికా జట్టు బార్బడోస్‌లో మ్యాచ్ ఆడడం ఇదే తొలిసారి. బార్బడోస్‌లో జరిగే ఫైనల్ మ్యాచ్‌లో వర్షం కురుస్తుందా అనేది ఇప్పుడు అభిమానుల మదిలో మెదులుతున్న అతిపెద్ద ప్రశ్నగా మారింది. ఇప్పటి వరకు పలు మ్యాచ్‌లకు వర్షం అంతరాయం కలిగించడంతో ఫైనల్ మ్యాచ్‌పై అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఈసారి వెస్టిండీస్‌లో జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో చాలా మ్యాచ్‌లకు వర్షం అంతరాయం కలిగించింది. ఈ కారణంగా చాలా మ్యాచ్‌లను రద్దు చేయాల్సి వచ్చింది. గయానాలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లోనూ వర్షం కురిసినా అదనపు సమయం కారణంగా మ్యాచ్ పూర్తయింది. ఇప్పుడు ఫైనల్స్ వంతు కావడంతో ఇక్కడ కూడా వర్షం కురిసే అవకాశం ఉంది.బార్బడోస్‌లో కూడా పరిస్థితి బాగా లేదు. శనివారం ఫైనల్ మ్యాచ్ రోజున 70-78 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. రోజంతా వర్షం కురిసే అవకాశం ఉంది. అలాగే పూర్తిగా మేఘావృతమై ఉండవచ్చు. అంటే సూర్యరశ్మికి తక్కువ అవకాశం ఉంది. ఇది జరిగితే, ఫాస్ట్ బౌలర్లు సహాయం పొందవచ్చు. దక్షిణాఫ్రికాకు చాలా ప్రమాదకరమైన పేసర్లు ఉన్నారు. ఫైనల్ మ్యాచ్ కోసం రిజర్వ్ డే ఉంచిన సంగతి తెలిసిందే. జూన్ 29 న మ్యాచ్ నిర్వహించలేకపోతే, జూన్ 30 న మ్యాచ్ జరుగుతుంది. అయితే, ఆ రోజు వాతావరణ పరిస్థితులు అంత బాగా ఉండబోవని, జూన్ 30 ఆదివారం నాడు 50 నుంచి 60 శాతం వర్షం కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ కారణంగానే భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరిగే మ్యాచ్‌లో వర్షం పడే అవకాశం ఉంది. ఫైనల్స్‌కు చేరుకోవడానికి ఇరు జట్లు అద్భుతమైన ఆటతీరును కనబరిచాయి. ఈ కారణంగా వర్షం పడకూడదని, మ్యాచ్ మొత్తం జరగాలని అభిమానులు కోరుకుంటున్నారు.

### ఐసీసీ నాకౌట్‌లో తొలి ప్లేయర్‌గా రోహిత్

టీ20 ప్రపంచకప్ రెండో సెమీఫైనల్ మ్యాచ్ ద్వారా టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మూడు గొప్ప రికార్డులను లిఖించాడు. ఈ రికార్డులతో క్రిస్ గేల్, మహేల జయవర్ధనే ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టాడు. టీ20 ప్రపంచకప్ 2వ సెమీఫైనల్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శనను ప్రదర్శించి ఎన్నో రికార్డులను సొంతం చేసుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన హిట్‌మ్యాన్ 39 బంతుల్లో 2 భారీ సిక్సర్లు, 6 ఫోర్లతో 57 పరుగులు చేశాడు. ఈ రెండు సిక్సర్లతో రోహిత్ శర్మ ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌లలో అత్యధిక సిక్సర్లు బాదిన ప్రపంచ రికార్డు హోల్డర్‌గా నిలిచాడు. గతంలో ఈ రికార్డు యూనివర్స్ బాస్ ఫేమ్ క్రిస్ గేల్ పేరిట ఉండేది.వెస్టిండీస్ తరపున టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ, వన్డే ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లు ఆడిన క్రిస్ గేల్ మొత్తం 21 సిక్సర్లు కొట్టి ఈ ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఇప్పుడు ఈ ప్రపంచ రికార్డును హిట్‌మ్యాన్ బ్రేక్ చేసేశాడు.టీమ్ ఇండియా తరపున టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ, వన్డే ప్రపంచకప్‌లో నాకౌట్ మ్యాచ్‌లు ఆడిన రోహిత్ శర్మ ఇప్పటివరకు 22 సిక్సర్లు బాదాడు. దీంతో ఐసీసీ నాకౌట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. దీంతో పాటు టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక ఫోర్లు బాదిన ప్రపంచ రికార్డు కూడా రోహిత్ శర్మ పేరిటే చేరింది. గతంలో ఈ రికార్డు శ్రీలంకకు చెందిన మహేల జయవర్ధనే పేరిట ఉండేది. జయవర్ధనే మొత్తం 111 ఫోర్లు బాదితే.. ఇప్పుడు రోహిత్ శర్మ 113 ఫోర్లు కొట్టి సరికొత్త చరిత్ర సృష్టించాడు. అలాగే టీ20 ప్రపంచకప్‌లో 50 సిక్సర్లు బాదిన రెండో బ్యాట్స్‌మెన్‌గా రోహిత్ శర్మ నిలిచాడు. ఈ జాబితాలో 31 ఇన్నింగ్స్‌ల్లో 63 సిక్సర్లు బాదిన క్రిస్ గేల్ అగ్రస్థానంలో ఉండగా, ప్రస్తుతం రోహిత్ శర్మ 43 ఇన్నింగ్స్‌ల్లో 50 సిక్సర్లతో రెండో స్థానానికి చేరుకున్నాడు.

### రెండు జట్లు:

**భారత జట్టు:**
రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, రిషబ్ పంత్ (వికెట్-కీపర్), సంజు శాంసన్ (వికెట్-కీపర్), శివందు, రాజ్‌పుత్, ఎల్‌దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్, అర్షదీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

**దక్షిణాఫ్రికా జట్టు:**
క్వింటన్ డి కాక్ (వికెట్ కీపర్), రీజా హెండ్రిక్స్, ఐడెన్ మార్క్‌రామ్ (కెప్టెన్), హెన్రిక్ క్లాసెన్, డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్, కగిసో రబడ, హెన్రిక్ నోకియా, తబ్రేజ్ షమ్సీ, ఒట్నీల్ బార్ట్‌నెయిల్, బ్జోర్న్ ఫోర్టుయిన్, ర్యాన్ రికెల్టన్.

### ప్రశంసలు అక్షర్‌కు దక్కడం లేదు

**మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా**

ఇంగ్లండ్‌పై ఘనవిజయం సాధించి పొట్టి కప్పు ఫైనల్స్‌లోకి దర్జాగా అడుగుపెట్టింది టీమిండియా. బట్లర్ సేనను చిత్తు చేసిన రోహిత్ సేన.. కప్పు కోసం తుదిపోరులో సౌతాఫ్రికాతో తాడోపేడో తేల్చుకోనుంది. ఇక, నిన్నటి మ్యాచ్‌లో మెన్ ఇన్ బ్లూ ఆల్‌రౌండర్ ప్రదర్శనతో అదరగొట్టింది. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్.. ఇలా అన్ని యూనిట్లు కలసికట్టుగా రాణించడంతో మనకు తిరుగులేకపోయింది. మ్యాచ్ మొత్తం ఫెంటాస్టిక్ గేమ్‌తో అలరించారు భారత ఆటగాళ్లు. బ్యాటింగ్‌లో రోహిత్ శర్మ (57), సూర్యకుమార్ యాదవ్ (47), హార్దిక్ పాండ్యా (23) సూపర్బ్ నాక్స్ ఆడారు. బౌలింగ్‌లో కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ చెరో 3 వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించారు. పేసుగుర్రం జస్ప్రీత్ బుమ్రా 2 వికెట్లతో ప్రత్యర్థి వెన్ను విరిచాడు. బౌలింగ్‌లో 3 వికెట్లు తీయడమే గాక ఆఖర్లో బ్యాటింగ్‌కు వచ్చి 10 పరుగులు చేసిన అక్షర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. క్రీజులో కుదురుకున్న జోస్ బట్లర్‌తో పాటు డేంజరస్ జానీ బెయిర్‌స్టో, మొయిన్ అలీని ఔట్ చేశాడు అక్షర్. ఈ మ్యాచ్ అనే కాదు.. గత మ్యాచుల్లోనూ అతడు అద్భుతమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఓవరాల్‌గా ఈ వరల్డ్ కప్‌లో 8 వికెట్లు పడగొట్టాడు. బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లో చివర్లో వచ్చి మంచి కాంట్రిబ్యూషన్ అందిస్తున్నాడు అక్షర్. అయినా అతడికి అంతగా క్రెడిట్ దక్కడం లేదు.




## నీటి గుంటలో పడి బాలుడు మృతి

**శామీర్ పేట (జనం సాక్షి ) :**
నీటి గుంటలో పడి బాలుడు మృతి చెందిన సంఘటనశామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్ర వారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూముకుంట పరిధిలోని స్పోర్ట్స్ స్కూల్ సమీపంలో నర్సరీలో విధులు నిర్వహించేందుకు మధ్యప్రదేశ్ కు చెందిన సురేందర్ తన కుటుంబంతో ఉంటున్నాడు. సురేందర్ కుమారుడు మానవ్ (2) అనే బాలుడు పక్కనే ఉన్న నీటి గుంతలో ప్రమాద వశాత్తు పడి మృతి చెందాడు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రధాన రహదారికి నిధులు మంజూరు చేయాలి

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి వినతి సమర్పించిన మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్



**శంషాబాద్, జూన్ 28 (జనంసాక్షి)**
శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 14వార్డులోని రాళ్లగూడ నుండి సిద్దుల గుట్టకు వెళ్లే ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారింది. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకూడదని ముందస్తు జాగ్రత్తగా రోడ్డు పనులు ప్రారంభించాలని మున్సిపల్ చైర్మెన్ సుష్మా రెడ్డితో కలిసి వైస్ చెర్మన్ బండి గోపాల్ యాదవ్ రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ కి వినతి పత్రం సమర్పించారు. రోడ్డు నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయగలరని కోరారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ఫుడ్ కమిషన్ ధ్యేయం





### కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, జూన్ 28(జనం సాక్షి ) :**
అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, రేషన్ షాపులు తనిఖీ ఆరోగ్యకర సమాజ నిర్మాణమే రాష్ట్ర ఫుడ్ కమిషన్ ధ్యేయమని చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ దిశగా అన్ని వర్గాల వారు భాగస్వాములై పేద ప్రజలకు పౌష్టికాహారం అందేలా తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని పలు రేషన్ షాపులు, అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలను ఫుడ్ కమిషన్ నేతృత్వంలోని సభ్యుల బృందం శుక్రవారం తనిఖీ చేసింది. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, రేషన్ షాపుల ద్వారా ఆహార భద్రత కార్డుదారులకు పంపిణీ చేస్తున్న బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు, పాఠశాలల్లో విద్యార్థులకు సమకూరుస్తున్న మధ్యాహ్న భోజనం, ఆసుపత్రుల్లో రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను కమిషన్ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులతో సమావేశమై, ఆయా శాఖల ద్వారా అమలవుతున్న పౌష్టికాహార పంపిణీ తీరుతెన్నులను సమీక్షించారు. పలుచోట్ల చిన్నచిన్న సమస్యలు లోటుపాట్లను గమనించిన కమిషన్ సభ్యులు, వాటిని సరిదిద్దుకోవాలని, తప్పులు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.

అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు, అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని రాజ్యాంగం ద్వారా కల్పించబడిన హక్కు పకడ్బందీగా అమలయ్యేలా పర్యవేక్షించేందుకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఏర్పాటు అయ్యిందన్నారు. ఇది చట్టబద్ధత కలిగిన కమిషన్ అయినందున ప్రజల హక్కులకు భంగం కలిగినప్పుడు చర్యలు చేపట్టే అధికారం కమిషన్ కు ఉందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల వారు విస్తృత స్థాయిలో కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. . తగు న్యాయం జరగని పక్షంలో రాష్ట్ర స్థాయిలో పనిచేసే ఫుడ్ కమిషన్ ను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజల పౌష్టికాహారం హక్కుకు భంగం కలిగించే వారిపై కమిషన్ కఠినంగా వ్యవహరిస్తుందని అన్నారు. రేషన్ షాపుల ద్వారా రానున్న రోజుల్లో బియ్యంతోపాటు చక్కెర గోధుమలు వంటి ఇతర నిత్యావసర సరుకులను కూడా పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో అధికారులందరు సమన్వయంతో పని చేస్తున్నారని ఈ సందర్భంగా ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, గోవర్ధన్ రెడ్డి, శారద, భారతి, జ్యోతి, డిఆర్ఓ సంగీత, పిడి డీఆర్డీఏ శ్రీలత, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు,జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ ఉదయ్ కుమార్, జెడ్పీటీసీ శ్రీలత, ఎమ్.ఆర్.ఓ రవీందర్ రెడ్డి, ఎంపీడిఓ అరుంధతి పాల్గొన్నారు.






## ఒక్క రోజే ఐదొందలు..

### చరిత్రను తిరగరాసిన అమ్మాయిలు

భారత మహిళా క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. టెస్టు క్రికెట్‌లో అత్యధిక స్కోర్‌తో రికార్డులు బద్దలు కొట్టేసింది. దక్షిణాఫ్రికా తో జరుగుతున్న ఐకైక టెస్టులో తొలి రోజే ఐదొందలు బాదేసింది.
చెన్నై చిదంబరం స్టేడియంలో దక్షిణాఫ్రికాతో జరుగుతోన్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో భారత మహిళా క్రికెటర్ ఓపెనర్ బ్యాట్స్‌మెన్ షెఫాలీ వర్మ సంచలనం సృష్టించింది. మొదట టాస్ గెలిచిన బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, ఓపెనింగ్ స్మృతి మంధాన, షెఫాలీ వర్మ కలిసి ఇన్నింగ్స్ స్టార్ట్ చేశారు. తొలి ఓవర్లలో కాస్త జాగ్రత్తగా ఆడిన ఆ ఆ తర్వాత స్పీడ్ పెంచుతూ పరుగులు వర్షం కురిపించారు. వీళ్ళు ఇద్దరు కలిసి తొలి వికెట్ నష్టానికి 292 పరుగుల రికార్డు ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నమోదు చేసారు. దీంతో వీరిద్దరూ 20 ఏళ్ల పాకిస్థాన్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టారు. ఇంతకు ముందు ఈ రికార్డు పాకిస్థాన్‌కు చెందిన సాజిదా షా, కిరణ్ బలోచ్ 2004లో వెస్టిండీస్‌పై వీరిద్దరూ తొలి వికెట్‌కు 241 పరుగులు జోడించారు. స్మృతి మంధాన(149) 292 పరుగుల వద్ద ఔట్ అయ్యి వెనుదిరిగింది. వన్ డౌన్ బ్యాట్స్‌మెన్ గా వచ్చిన శుభా సతీష్ కూడా వెంటనే ఔట్ అయ్యింది. అయినప్పటికీ షెఫాలీ ముందుకు సాగుతూ కేవలం 197 బంతుల్లో 23 ఫోర్లు, 8 సిక్స్‌లతో 205 పరుగులు చేసి పలు రికార్డులను తన పేరిట లిఖించుకుంది. వన్డే తరహా బ్యాటింగ్‌తో 194 బంతుల్లోనే డబుల్ సెంచరీ నమోదు చేసిన షెఫాలీ వర్మ.. ఆస్ట్రేలియా బ్యాటర్ అన్నబెల్ సదర్లాండ్ పేరిట ఉన్న ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ రికార్డ్‌ను అధిగమించింది. ఈ క్రమంలో ప్రపంచంలో 10వ మహిళా క్రికెటర్‌గా, భారతదేశంలో డబుల్ సెంచరీ చేసిన రెండవ మహిళా క్రికెటర్‌గా షెఫాలీ వర్మ నిలిచింది. ప్రస్తుతం టీమిండియా మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల కోల్పోయి 525 పరుగులు చేశారు. ప్రస్తుతం క్రీజులో హర్మన్ ప్రీత్ 42, రిచా ఘోష్ 43 పరుగులతో క్రీజులో ఉన్నారు.

## 73 మంది వాహనదారులపై కేసు నమోదు

- వాహనాలకు వ్యతిరేక మార్గంలో వచ్చే వాహనదారులకు చట్టపరమైన చర్యలు తప్పవు
- మూడు నెలలు జైలు శిక్ష, ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నాగభూషణం

**శంషాబాద్, జూన్ 28 (జనంసాక్షి)**
శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్ కార్యాలయంలో ఏసిపి, నాగభూషణం సీఐ రాజు శుక్రవారం మీడియాకు సమాచారం అందించారు. కమిషనర్ ఆఫ్ పోలీస్ సైబరాబాద్ వారి ఆదేశాల మేరకు ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నాగభూషణం, సిఐ రాజు ఆధ్వర్యంలో గత నెలలో చేపట్టిన వాహనదరులకు వ్యతిరేక మార్గంలో వచ్చే వాహనదారులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాము. తెలిసి కావాలనే తొందరగా వెళ్లాలని నిర్లక్ష్యంగా వాహనాలు వ్యతిరేక మార్గములో నడిపేటప్పుడు అనేక ప్రమాదాలకు గురవుతారు. ప్రమాదాలకు గురి కాకుండా ట్రాఫిక్ రూల్స్ ను వాహనదారులు పాటించాలనే గత నెలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాం. స్పెషల్ డ్రైవ్ లో భాగంగా 73 మంది వాహనాదారులపై కేసులు నమోదు చేశాం. 64 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, 5 ఆటోలు, ఒక ట్రాక్టర్, ఒక డీసీఎం పైన కేసులు నమోదు చేశాం. ప్రజలకు వాహనదారులకు తెలియజేయునది ఏమనగా షాద్నగర్ నుంచి కానీ హైదరాబాదు నుంచి కాని వాహనాలకు వ్యతిరేక మార్గంలో వాహనాలు నడపరాదు. కాదు అని వ్యతిరేక మార్గంలో వాహనాలు నడిపితే మూడు నెలల పాటు జైలు శిక్ష భారీ జరిమానాలు విధిస్తామన్నారు.

## దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కించిన గొప్ప

- నాయకుడు పీవీ నరసింహారావు
- ఘనంగా మాజీ ప్రధాని పివి జయంతి వేడుకలు



**ఎల్బీనగర్, జూన్ 28 (జనం సాక్షి) :**
దేశం క్లిష్ట పరిస్థితులలో ఉన్న సమయంలో పలు సంస్కరణలను తీసుకువచ్చి దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కించిన గొప్ప నాయకుడు పీవీ నరసింహారావు అని పలువురు కొనియాడారు. భారత ప్రధానమంత్రి బహుభాషా కోవిదుడు ఆర్థిక సంస్కరణల కర్త పీవీ నరసింహారావు 103వ జయంతి సందర్భంగా శుక్రవారం నాడు హస్తినాపురం డివిజన్ జడ్పీ రోడ్ లోరాష్ట్ర కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కాయితి రవీందర్ రెడ్డి, రాష్ట్ర కార్మిక సంగం అధ్యక్షులు ఎన్ స్ చారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వయానా పీవీ నరసింహారావు మనవడు శేషగిరిరావులు హాజరై పివి నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ప్రధాని పివి బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రధాని పదవిని అదృష్టంచిన మొదటి దక్షిణాది వ్యక్తి మన తెలంగాణకు చెందిన వాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ విష్ణు, బి ఆర్ యస్ నాయకులు కాయితి రవీందర్ రెడ్డి, రామ్ చరణ్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రామాచారి,వెంకట్ అనిల్ కీర్తన ఫౌండేషన్ చిన్నారులు పాల్గొని చేయడం విజయవంతం చేయడం జరిగింది చిన్నారులకు ఈ సందర్భంగా పండ్లు పంపిణీ చేయడం జరిగింది.

# జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తేవాలి

- జడ్పీ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మి
- బ్యాడ్మింటన్ క్రీడకు మంచి భవిష్యత్తు : డిఎఫ్ఓ శివ ఆశిష్

(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి)





బ్యాడ్మింటన్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తేవాలని మంచిర్యాల జిల్లా జడ్పీ చైర్ పర్సన్ నల్లల భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గ్రీన్ సిటీ లో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిక్స్ సన్ రైస్ సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన నల్లల భాగ్యలక్ష్మి డీఎఫ్ఓ శివ ఆశిష్, మాజీ విప్ నల్లాల ఓదెలు, మంచిర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఉప్పలయ్య లు హాజరైన ఈ కార్యక్రమంలో కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడారు జాతీయ స్థాయిలో రాణించిన వారికి మంచి అవకాశాలు వస్తాయని తెలిపారు, డి ఎఫ్ ఓ శివ ఆశిష్ ఐఎఫ్ఎస్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడకు క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉందని మన క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు, క్రీడలలో రాణించే వారికి విద్యా ఉద్యోగ అవకాశాలలో మంచి అవకాశాలు వస్తాయి అని ఎక్కడికి వెళ్లినా క్రీడాకారులకు మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు, మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య మాట్లాడుతూ మంచిర్యాలలో క్రీడలు నిర్వహించే వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు గారు మంచిర్యాల పట్టణంలో అన్ని క్రీడలకు ఉపయోగకరంగా ఉండే విధంగా ఒక పెద్ద స్టేడియాన్ని నిర్మించేందుకు ప్రణాళిక చేస్తున్నారని తెలిపారు, మంచిర్యాలలో బ్యాడ్మింటన్ క్రీడకు మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం జాయింట్ సెక్రెటరీ బాబు మాట్లాడుతూ మంచిర్యాలలో ప్రతి సంవత్సరం బ్యాడ్మింటన్ రాష్ట్ర పోటీలను నిర్వహిస్తున్నారని క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని చాలా అభినందించదగ్గ విషయమని తెలిపారు, టోర్నమెంట్ కన్వీనర్ గాజుల ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ అందరి సహకారంతో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ముందు ముందు కూడా ఎలాంటి టోర్నమెంట్ ఇచ్చిన నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు, అంతకుముందు కార్యక్రమం ప్రారంభంలో ముఖ్యఅతిథి అతిధులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు, అనంతరం బ్యాడ్మింటన్ క్రీడాకాలను పరిచయం చేసుకొని బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు, డీఎఫ్ఓ శివ ఆశిష్, మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, ఎలక్ట్రిసిటీ %ంవ% శ్రావణ్ కుమార్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ల వాసు కాసేపు బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకాలను ఉత్తేజపరిచారు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్లూరు సుధాకర్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ ప్రారంభానికి వచ్చిన ముఖ్యఅతిథి అతిథిలకు శాలువాలు, మెమెంటులతో ఘనంగా సన్మానించారు, ఉదయం నుండి సాయంత్రం వరకు మెయిన్ డ్రా పోటీలు జరిగాయి, ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గ ప్రసాద్, డివైఎస్ఓ రాజు వీర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదర్ తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ట్రెజరర్ సత్యపాల్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మీనా రెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేష్ రెడ్డి, మధు, కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, హర్ష, రాజలింగు, కృష్ణ, టోర్నమెంట్ రిఫరీ మల్లికార్జున్, టెక్నికల్ కమిటీ చైర్మన్ టి సి ఎస్ రావు, జాయింట్ సెక్రటరీ మనోజ్, రిఫరీ మల్లికార్జున్, మ్యాచ్ కంట్రోల్ కుమార్, ఎంపైర్లు, ఫిజికల్ డైరెక్టర్లు టోర్నమెంట్ నిర్వహణలో పాల్గొన్నారు.

# జగిత్యాలలో ఫ్లెక్సీ వార్

- ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిల పోటాపోటీ ఫ్లెక్సీలు

**జగిత్యాల, జూన్ 28 (జనంసాక్షి)** : జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పెద్ద దుమారం చెలరేగింది. సీనియర్ నేత తాటిపర్తి జీవన్ రెడ్డి నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. జీవన్ రెడ్డిని కూల్ చేసేందుకు మంత్రి శ్రీధర్ బాబు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రంగంలోకి దిగారు. విడతలవారీగా చర్చలు జరిపారు. హైకమాండ్ పెద్దలు చర్చలు జరిపారు. తగిన ప్రాధాన్యం ఇస్తామని.. మంత్రి పదవి అంటూ చెప్పుకొచ్చారు. హైకమాండ్ పెద్దలతోపాటు సీఎం రేవంత్ రెడ్డిని జీవన్ రెడ్డి కలువడం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతా సర్దుకుంటుందని అనుకునే లోపు స్థానిక నేతల మధ్య వివాదం నెలకొంది. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తనకు చెప్పి పార్టీలోకి వస్తే బాగుంటుందని జీవన్ రెడ్డి వర్గం అంటోంది. హైకమాండ్ పెద్దలు జీవన్ రెడ్డిని కూల్ చేశారు. అంతా సర్దుకుంటుందని అనుకునే లోపు మరో వివాదం తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరులు బస్టాండ్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. జగిత్యాల డెవలప్ కోసం సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆ ఫ్లెక్సీ మీద రాశారు. ఎమ్మెల్యే సంజయ్‌కు అతని అనుచరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో జీవన్ రెడ్డి అనుచరులు భగ్గుమన్నారు. కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్నామని.. జగిత్యాల అంటే జీవన్.. జీవన్ అంటే జగిత్యాల అనేలా మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సంజయ్ ఫ్లెక్సీ పైన దీనిని ఏర్పాటు చేశారు. ఇలా సంజయ్, జీవన్ రెడ్డి వర్గాల మధ్య ఫ్లెక్సీల వార్ కొనసాగుతోంది. అభివృద్ధి కోసం పార్టీలో చేరామని ఒకరు అంటుంటే.. మరొకరు కాంగ్రెస్ పార్టీ అంటేనే జీవన్ రెడ్డి అంటున్నారు. అలకబూనిన జీవన్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హైకమాండ్ పెద్దలు మాట ఇచ్చినట్టు తెలుస్తోంది. త్వరలో మంత్రివర్గ విస్తరణ జరగనుండటంతో జీవన్ రెడ్డికి మంత్రి పదవి రావొచ్చని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

## ప్రభుత్వానికి, రైతులకు మధ్య

# సహకార సంఘాలు వారధులు

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్ బ్యూరో, జూన్ 28, (జనం సాక్షి)** : సహకార సంఘాలు ప్రభుత్వానికి, రైతులకు, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సహకార సంఘాలకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తానని, రాజకీయాలకు అతీతంగా సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని సహకార సంఘాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్ జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డిసిసిబి), శుక్రవారం తన 103వ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించింది, 2005 నుండి సహకార సంఘాలు, కెఆర్ఐబిహెచ్సిఓ డైరెక్టర్‌గా ఉన్న ప్రభాకర్‌ను సమావేశానికి ఆహ్వానించారు. ఎన్ఎఎఫ్ఎస్ సిఓబి , డిసిసిబి చైర్మన్ కొండూరు రవీందర్ రావు , ఇతర డైరెక్టర్లు, సిఈఓ , పిఎసిఎస్ చైర్మన్లు సహకార సంఘాల నుండి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, మంత్రి అయిన పొన్నం ప్రభాకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... 2005లో సింగిల్ విండో చైర్మన్ అయ్యాక డీసీసీబీ చైర్మన్ కావాలని అనుకున్నానని, అయితే ప్రభుత్వం తనను డీసీఎంఎస్ చైర్మన్‌గా, ఏపీమార్క్‌ఫెడ్ చైర్మన్‌గా నియమించిందని అన్నారు. తాను సహకార రంగం నుండి నా రాజకీయ జీవితాన్ని ప్రారంభించానని, హుస్నాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుండి ఎన్నికైన తర్వాత ఎంపీని, ఇప్పుడు మంత్రిని అయ్యానని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వైఎస్ఆర్ మార్క్‌ఫెడ్‌ను పెద్దఎత్తున నిధులు కేటాయించి మార్చారన్నారు. రైతుల నుంచి మొక్కజొన్న, వరిధాన్యం కొనుగోలు చేయడంతోపాటు ఎరువులను కూడా రైతులకు విక్రయించడం ద్వారా పీఏసీఎస్‌లను బలోపేతం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. సహకార సంఘాలు అంటే రైతులు, చేనేత కార్మికులు కూడా ఉంటారని, రాష్ట్రంలో చేనేతకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు మాట్లాడుతూ... 2005లో డీసీసీబీ చైర్మన్‌గా సహకార శాఖతో పొన్నం ప్రభాకర్‌తో కలిసి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారన్నారు. కెఆర్ఐబి హెచ్ సీఓ లో రూ. 5 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేయమని ప్రభాకర్ మాకు తెలియజేశారని, ఇప్పుడు పిఏసీఎస్ మంచి డివిడెండ్‌లతో ధనవంతులను పొందుతున్నాయని ఆయన గుర్తు చేశారు. 2008లో సహకార సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలను ప్రారంభించడంలో ప్రభాకర్‌తో కలిసి తాను కీలకంగా పనిచేశానని గుర్తు చేసుకున్నారు. పొన్నం ప్రభాకర్ సన్మాన కార్యక్రమంలో వైస్ చైర్మన్ పి.రమేష్ , సిఇఓ ఎన్. సత్యనారాయణరావు, డిసిఎంఎస్ చైర్మన్ ఎ. శ్రీకాంత్ రెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ జి.చిన్నారెడ్డి జన్మదిన వేడుకలు





- శుభాకాంక్షలు తెలిపిన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ దివ్య

**హైదరాబాద్, జూన్ 28 (జనంసాక్షి)** : రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి 70వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో ఉన్న ప్రణాళిక సంఘం కార్యాలయంలో జరిగిన చిన్నారెడ్డి జన్మదిన వేడుకలలో వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వందలాది మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. దేవరకద్ర ఎం ఎల్ ఏ మాధవ రెడ్డి, ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ దివ్య, వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మిరెడ్డి కృపాకర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ రుద్రగౌని, ఐ ఎన్ టీ యూ సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిల్ షరీఫ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిత్య, విఘ్నేష్, వంశీ, రామేశ్వర్ రెడ్డి, భాస్కర్, సహా వందలాది మంది చిన్నారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు, ఆత్మీయులు, అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది సమక్షంలో జన్మదిన సందర్భంగా చిన్నారెడ్డి కేక్ కట్ చేశారు. జన్మదిన వేడుకలలో భాగంగా ప్రజా భవన్ ప్రాంగణంలో చిన్నారెడ్డి బాదాం మొక్కను నాటారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని చిన్నారెడ్డి ఆకాంక్షించారు.

### ప్రజావాణికి భారీగా వినతులు స్వీకరించిన చిన్నారెడ్డి

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలు చిన్నారెడ్డిని, ప్రజాభవన్ అధికారులను కలిసి వినతి పత్రాలు అందచేశారు. శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 494 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 125, హౌసింగ్ కు సంబంధించి 43 దరఖాస్తులు, పౌరసరఫరాల శాఖ కు సంబందించి 71, హోం శాఖకు సంబందించి 45 దరఖాస్తులు, పంచాయతి రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కు సంబందించి 47, ఇతర శాఖలకు సంబంధించి 48 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించండం తో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యులు అందుబాటులో ఉండాలి
- రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ఏటూరునాగారం, జూన్ 28(జనంసాక్షి)** : వర్షాకాల నేపథ్యంలో విషజ్వరలపై అప్రమత్తంగా ఉండాలని, వైద్యులు అందుబాటులో ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని పల్లె దవాఖాన ను రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో విష జ్వరాలపై వైద్య అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని అన్నారు.



# వరదనీటిలో పడవలో కౌన్సిలర్ నిరసన

- కేజ్రీవాల్ ప్రభుత్వంపై విమర్శలు

**న్యూఢిల్లీ, జూన్ 28 (జనంసాక్షి)** : ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు వినూత్నంగా నిరసన తెలపడం అలవాటు చేసుకున్నారు. తాజాగా ఢిల్లీకి చెందిన ఓ బీజేపీ నేత అరవింద్ కేజీవ్రాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. గత రెండు రోజులుగా దేశ రాజధానికి వర్షాలు ముంచెత్తుతున్నాయి. దీంతో రోడ్లపై మోకాళ్ల ఎత్తులో వర్షపు నీరు నిలిచింది. వరదలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీంతో బీజేపీ కౌన్సిలర్ రవీందర్ సింగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినూత్నంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. వరదల్లో ఓ చిన్న పడవ నడుపుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ రాజధానిలో సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేదని, కేజీ సర్కార్ మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు.'అన్ని మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయి. వర్షాకాలం ముందు వాటిని శుభ్రం చేయలేదు. ఒకవైపు వరదలు ముంచెత్తుతుంటే ఇంకోవైపు తాగు నీటి సమస్య తలెత్తుతోంది' అని రవీందర్ సింగ్ అన్నారు. ఢిల్లీ – ఎన్‌సీఆర్ పరిధిలో శుక్రవారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తోంది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఢిల్లీ విమానాశ్రయ టెర్మినల్ – 1పైకప్పు కొంత భాగం కూలిపోయింది. ధౌలా కువాన్ ఫ్లై ఓవర్ కింద నీరు నిలిచిన కారణంగా నరైనా నుండి మోతీ బాగ్, వైస్ వెర్సా వైపు ట్రాఫిక్ జామ్ అయింది. భారీ వర్షాల కారణంగా యశోభూమి ద్వారకా సెక్టార్ – 25 మెట్రో స్టేషన్ మూసేసినట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ తెలిపింది.

# సభలో విపక్షాల తీరు దారుణం

- స్పీకర్ స్పష్టంగా చెప్పినా వినకపోవడం సరికాదు
- తొలిసారి అడుగు పెట్టిన కంగనా రనౌత్ ఆవేదన



**న్యూఢిల్లీ, జూన్ 28 (జనంసాక్షి)** : నీట్ రగడ పార్లమెంట్ ఉభయసభలనూ కుదిపివేసింది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్, పరీక్ష నిర్వహణ లోటుపాట్లపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో లోక్‌సభలో గందరగోళం నెలకొనడంతో సభ జులై 1కి వాయిదా పడింది. రాజ్యసభలోనూ నీట్ ప్రకంపనలతో సభా కార్యకలాపాలు స్తంభించాయి. విపక్షాల తీరును బీజేపీ ఎంపీ, బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ తప్పుపట్టారు. సభలో ప్రతిపక్ష సభ్యుల తీరు సరైంది కాదని దుయ్యబట్టారు. స్పీకర్ పలుమార్లు సంయమనంతో వ్యవహరించాలని పదేపదే కోరినా విపక్ష సభ్యులు పెడచెవిన పెట్టారని, విపక్షం ఎవరి మాటా వినిపించుకనే పరిస్థితిలో లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తాము సభలో తొలిసారిగా అడుగుపెట్టమని, విపక్షాల రగడ చూసి తాము విస్తుపోయామని అన్నారు. ఏ ఒక్కరినీ మాట్లాడేందుకు వారు అనుమతించకపోవడం సరైంది కాదని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చను విస్మరించి విపక్షాలు సభలో రచ్చ చేయడం విడ్డూరమని కంగనా రనౌత్ వ్యాఖ్యానించారు. సభలో విపక్ష సభ్యుల ప్రవర్తన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. కాగా, విపక్షాలు ఏ అంశం లేవనెత్తినా సమగ్ర సమాచారం ఇస్తామని తాము స్పష్టంగా చెప్పినా విపక్షాలు సభా కార్యకలాపాలకు అడ్డుపడటం విచారకరమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ప్రభుత్వం చర్చకు సిద్ధమని తాము సభ్యులకు మరోసారి హామీ ఇస్తున్నామని చెప్పారు. సభా కార్యకలపాలకు కాంగ్రెస్ సభ్యులు అడ్డుపడుతూ సభను సజావుగా జరగనివ్వకపోవడం సరైంది కాదని, దీన్ని తాను ఖండిస్తున్నానని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. సభా కార్యకలాపాలకు అడ్డుతగలవద్దని ఆయా సభ్యులకు తాను విజ్ఞప్తి చేస్తున్నానని మంత్రి చెప్పారు. కాగా, నీట్ వ్యవహారంలో ప్రభుత్వ తీరును కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ తప్పుపట్టారు.

# విమానం టాయ్‌లెట్‌లో సిగరెట్ తాగిన ప్రయాణికుడు

- కేసు పెట్టి అరెస్ట్ చేసి, జైలుకు పంపిన పోలీసులు



**న్యూఢిల్లీ, జూన్ 28 (జనంసాక్షి)** : విమాన ప్రయాణంలో కొందరు కావాలనే చేయరాని పనులు చేస్తుంటారు. కొన్నిసార్లు ప్రయాణికుల ప్రవర్తన చర్చకు దారితీస్తుంటుంది. కొందరు వ్యక్తులు విమాన ప్రయాణంలో ఏవి చేయకూడదో అవే చేస్తూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఓ వ్యక్తి విమానం వాష్‌రూమ్‌లో సిగరెట్ తాగి ఇప్పుడు కటకటాల పాలయ్యాడు. ఈనెల 26వ తేదీన సాయంత్రం 5.15 గంటలకు ఇండిగో విమానం 176 మంది ప్రయాణికులతో ఢిల్లీ విమానాశ్రయం నుంచి ముంబై బయల్దేరింది. విమానం ముంబై ఎయిర్‌పోర్ట్‌లో దిగడానికి 50 నిమిషాల ముందు ఉత్తరప్రదేశ్‌కు చెందిన 36 ఏళ్ల ఖలీజ్ కాజమ్ముల్ ఖాన్ అనే ప్రయాణికుడు టాయిలెట్‌కు వెళ్లాడు. అతడు వాష్‌రూమ్‌లో సిగరెట్ తాగాడు. స్మోక్ సెన్సార్ల ద్వారా అప్రమత్తమైన క్యాబిన్ సిబ్బంది ప్రయాణికుడు టాయిలెట్ నుంచి బయటకు రాగానే తనిఖీ చేశారు. అక్కడ ఓ అగ్గిపుల్ల, సిగరెట్ స్టబ్ కనిపించింది. దీంతో విమాన సిబ్బంది వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సదరు ప్రయాణికుడిని ప్రశ్నించగా.. లావేటరీలో పొగతాగినట్లు ఖాన్ అంగీకరించాడు. దీంతో ముంబై ఎయిర్‌పోర్ట్‌లో విమానం ల్యాండ్ కాగానే అతడిని సహర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విమాన సిబ్బంది ఫిర్యాదుతో అతడిపై పోలీసులు ఇండియన్ పీనల్ కోడ్, ఎయిర్ క్రాఫ్ట్ రూల్స్ కింద కేసులు బుక్ చేసి అరెస్ట్ చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370